సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 32

సోమవారం 24-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'



భళా బెంగళూరు...

మెరిసిన మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్, హర్షల్. రాజస్తాన్‌పై ఆర్‌సీబీ గెలుపు. -12లో



రిటర్నులు సరే.. ఆ తర్వాత?


ఐటీ రిటర్నుల దాఖలు తర్వాత చేయాల్సిన పనులపై కథనం. -13లో



ఎట్టకేలకు అమృత్‌పాల్ అరెస్ట్

ఖలిస్తాన్ వేర్పాటువాద నేత, వారిస్ పంజాబ్ దే చీఫ్ అమృత్‌పాల్‌సింగ్ ఎట్టకేలకు పంజాబ్ పోలీసులకు చిక్కాడు.

వివరాలు 6లో ▸



కలల అలలపై...

అమెరికాకు చెందిన షరాన్ లేన్ అనే 75 ఏళ్ల రిటైర్డ్ టీచర్ నౌక ద్వారా ప్రపంచ యాత్రకు సిద్ధమైంది.

వివరాలు 6లో ▸



న్యూస్‌రీల్

మే 15 కల్లా ఇంటర్, టెన్త్ ఫలితాలు



లక్షలాది మంది విద్యార్థులు ఎదురు చూస్తున్న టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు మే 15 కల్లా విడుదలయ్యే చాన్స్ ఉందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ కసరత్తు తుది దశకు చేరుకుంటోంది.

- వివరాలు 14లో▶

ఒక పోస్టు... 174 మంది పోటీ



ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు ఈసారి పోటీ తీవ్రంగా ఉంది. 614 పోస్టులకుగాను 1,06,272 మంది తుది రాతపరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 174 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

- వివరాలు 14లో▶

'సెలబ్రిటీ' ఖాతాలకు మళ్లీ బ్లూ టిక్



చందామొత్తాన్ని చెల్లించలేదంటూ చాలా మంది ప్రముఖుల ట్విట్టర్ ఖాతాల్లో బ్లూ టిక్‌ను తొలగించిన ట్విట్టర్ యాజమాన్యం ఆదివారం కొందరికి బ్లూ టిక్‌ను పునరుద్ధరించింది.

- వివరాలు 6లో▶

నేడు కేరళకు ప్రధాని మోదీ

- దేశంలోనే తొలి డిజిటల్ సైన్స్ పార్క్‌కు శంకుస్థాపన -వివరాలు 6లో▶



అధికారంలోకి రాగానే

చేవెళ్లలో జరిగిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న అమిత్ షా

ముస్లిం 'కోటా' రద్దు

ఆ రిజర్వేషన్ ఫలాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అందేలా చర్యలు • చేవెళ్ల సభలో అమిత్ షా

- మజ్లిస్ స్టీరింగ్‌తో నడుస్తున్న కేసీఆర్ పాలనతో రాష్ట్రాభివృద్ధి జరగదు
- అవినీతిమయ బీఆర్ఎస్ పాలనకు 'రివర్స్ కౌంటింగ్' మొదలైనట్టే
- టీఎస్‌పీఎస్సీ లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితం నాశనం
- దానితో సంబంధమున్న వారందర్నీ మేం జైలుకు పంపుతాం
- నేను మళ్లీ వస్తా. ప్రతిదాని లెక్కాపత్రం అడుగుతా...
- తెలంగాణలో భారీ మెజారిటీతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- ప్రధాని కావాలని కేసీఆర్ కలలు కంటున్నారు..
- కానీ అక్కడ కుర్చీ ఖాళీ లేదు..అవదు

- వివరాలు 2లో

రాష్ట్రంలో బీజేపీ ఖాళీ.. ఢిల్లీలో ప్రధాని కుర్చీ ఖాళీ



- అమిత్‌షాకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ కౌంటర్
- అమిత్‌షా మాట్లాడిన ప్రతీ అంశంపై స్పందించిన కేటీఆర్ - 2లో



సూర్యాపేట జిల్లా భీమ్లాతండ గ్రామంలో ఐకేపీ కేంద్రంలో ధాన్యం రాశి చుట్టూ వర్షం నీరు చేరడంతో రోదిస్తున్న రైతు

50 వేల ఎకరాల్లో పంట నష్టం

మూడు రోజులుగా రాష్ట్రంలో వర్షాలు, వడగండ్లు

ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలపై ప్రభావం

దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మామిడి.. పిడుగుపాటుతో మహిళ మృతి

నష్టం అంచనాకు చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సీఎం కేసీఆర్ ఆదేశం

- వివరాలు 5లో

వరి సిరి పెరిగింది

- వరి దిగుబడిలో దేశంలోనే రెండోస్థానంలో తెలంగాణ
- 2022-23లో దాదాపు 154 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి -5లో

64,056 జలవనరులు

- తెలంగాణలో 98.5% జల వనరులు గ్రామీణ ప్రాంతాల్లోనే..
- కేంద్ర జలశక్తి శాఖ తొలి జలవనరుల సెన్సస్‌లో వెల్లడి -5లో

ఔరంగాబాద్ గులాబీమయం

- నేడు మహారాష్ట్రలో బీఆర్ఎస్ బహిరంగ సభ.. నాందేడ్, కాందార్‌లోహ సభల స్ఫూర్తితో ఏర్పాట్లు
- సాయంత్రం 6 గంటలకు సభ.. హాజరవనున్న సీఎం కేసీఆర్
- పలువురు కార్పొరేటర్లు సహా 200 మంది నేతల చేరిక

3 లో

నేడు ఖమ్మంలో కాంగ్రెస్ 'నిరుద్యోగ సభ'

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, ఉద్యోగ నియామకాల్లో నిర్లక్ష్యంపై పోరుబాట
- హాజరుకానున్న రేవంత్ తదితరులు
- సభకు భారీగా తరలిరావాలని విద్యార్థులు, నిరుద్యోగులకు టీపీసీసీ పిలుపు

3 లో

55 వేల వరకు నేషనల్ లెవల్...



- అంతలోపు ర్యాంక్ వస్తేనే జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రవేశం.. ఈసారి దేశవ్యాప్తంగా 10 వేల సీట్లు పెరిగే అవకాశం
- విడుదలకు సిద్ధంగా జేఈఈ మెయిన్ ర్యాంకులు

- వివరాలు 3లో






ఇంతంజాతక్



హెలీకాప్టరయితే ఆలస్యమవుతుందట!



నేడు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి విదర్భ, తెలంగాణ, కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల వడగండ్ల వానలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. సోమవారం రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదవుతాయని సూచించింది. ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 39.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 21.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
కర్నూలు	41.3	27.5
రెంటచింతల	41.2	27.4
మహబూబ్‌నగర్	38.5	24.5
నల్లగొండ	37.5	21.0
హైదరాబాద్	37.2	24.0
నిజామాబాద్	37.1	22.5
రామగుండం	37.0	23.0
ఆదిలాబాద్	37.0	22.7
దుండిగల్	37.0	22.3
హకీంపేట్	36.8	23.1

పచ్చదనం పెరిగింది!

గత 20 ఏళ్లలో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా చెట్లతో కూడిన విస్తీర్ణం (ట్రీ కవర్) పెరిగింది. 2000–2020 మధ్యకాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే 13.09 కోట్ల హెక్టార్ల మేరకు ట్రీ కవర్ పెరిగిందని 'ధరిత్రీ దినోత్సవం' సందర్భంగా వెలువరించిన 'గ్లోబల్ ఫారెస్ట్ రివ్యూ'తాజా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్'కు అనుబంధంగా గ్లోబల్ ఫారెస్ట్ రివ్యూ పనిచేస్తోంది. మరోవైపు ఎక్కువ విస్తీర్ణంలోనే పచ్చని అడవుల నరికివేత కొనసాగుతోంది. ఈ 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా నికరంగా 10.06 కోట్ల హెక్టార్లలో అడవుల్ని కోల్పోయినట్లు నివేదిక వెల్లడిస్తోంది అయితే 36 దేశాల్లో మొక్కలు నాటడం, కలప తోటలు, పండ్ల తోటల విస్తీర్ణం పెరుగుతున్నందున.. అడవులు, కలప/పండ్ల తోటలతో కలిపి పచ్చని చెట్ల విస్తీర్ణం నికరంగా పెరిగిందని గ్లోబల్ ఫారెస్ట్ పేర్కొంది. అయితే దీర్ఘకాలం ఎదిగిన అడవుల్ని నరికివేయటం వల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని.. తాజా ట్రీ కవర్ పూర్తిగా భర్తీ చేయలేదని నివేదిక స్పష్టం చేసింది.

–సాక్షి, సాగుబడి డెస్క్



ప్రపంచవ్యాప్తంగా 13.09 కోట్ల హెక్టార్ల మేర పెరిగిన అడవులు, తోటల విస్తీర్ణం

భారత్ సహా 36 దేశాల్లో నికర పెరుగుదల

గ్లోబల్ ఫారెస్ట్ రివ్యూ తాజా నివేదిక వెల్లడి

పెరిగిన 13.09 కోట్ల హెక్టార్ల ట్రీ కవర్‌లో 91% (11.86 కోట్ల హెక్టార్లు) అడవులు ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన పెరుగుదలతో పాటు అడవుల పునరుద్ధరణ పథకాల అమలు ఇందుకు దోహదపడుతున్నాయి. మిగతా 9% (1.23 కోట్ల హెక్టార్లు)లో వాణిజ్యపరంగా సాగు చేస్తున్న యూకలిప్టస్, సుబాబుల్, ఆయిల్‌పామ్, రబ్బరు,

9% కలప/పండ్ల తోటలు

పండ్ల తోటలు ఉన్నాయి. కలప తోటలు, పండ్ల తోటల సాగు ద్వారా పెరిగిన 1.23 కోట్ల హెక్టార్లలో దాదాపు సగం ఇండోనేసియాలోని ఆయిల్‌పామ్, బ్రెజిల్‌లోనే కలప తోటలే కావటం విశేషం. మలేసియా, ఉరుగ్వే, న్యూజిలాండ్ దేశాల్లోని ట్రీ కవర్‌లో 70% వాణిజ్య, ఉద్యాన తోటల వల్లనే సాధ్యమైంది. భారత్‌లో అడవులు, కలప / పండ్ల తోటలతో నికరంగా 8,74,100 హెక్టార్ల విస్తీర్ణంలో ట్రీ కవర్ పెరిగినట్లు గ్లోబల్ ఫారెస్ట్ రివ్యూ నివేదిక తెలిపింది.



ఇరవై ఏళ్లలో ట్రీ కవర్ నికరంగా పెరిగిన దేశాలు 36 ఉండగా అందులో చైనా, భారత్ కూడా ఉండటం విశేషం. ఐరోపా దేశాల్లో 60 లక్షల హెక్టార్లలో నికరంగా ట్రీ కవర్ పెరిగింది. భారత్, చైనా సహా అనేక మధ్య, దక్షిణాసియా దేశాల్లోనూ అంతే. అడవుల పునరుద్ధరణ పథకాలను పెద్ద ఎత్తున అమలు చేయటం, వ్యవసాయ భూములను పడావుగా వదిలేయటంతో చెట్లు పెరగటం వల్ల ఈ నికర పెరుగుదల నమోదైనట్లు నివేదిక పేర్కొంది.

ఐరోపా దేశాల్లో 60 లక్షల హెక్టార్లలో..

అత్యధికంగా చైనాలో..

అత్యధికంగా చైనాలో 21,44,900 హెక్టార్ల మేర ట్రీ కవర్ పెరుగుదల చోటు చేసుకుంది. భారత్‌లో 8,74,100 హెక్టార్ల మేర నికర ట్రీ కవర్ పెరుగుదల ఉంది. ఉరుగ్వే మినహా ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల్లోని ఏ దేశంలోనూ ట్రీ కవర్‌లో నికర పెరుగుదల లేదు. అడవుల నరికివేత, కార్చిచ్చుల నష్టం అక్కడ ఎంత ఎక్కువగా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

ప్రతినిధుల సభలే.. వచ్చే ఎన్నికలకు పునాదిరాళ్లు

మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్

- సంక్షేమానికి సీఎం కేసీఆర్, సంక్షోభానికి పీఎం మోదీ చిరునామా
- ప్రతిగడపకూ చేరేలా, ప్రతిగుండెనూ తట్టేలా పార్టీ కార్యాచరణ
- వచ్చే ఎన్నికలదిశగా సమరోత్సాహంతో గులాబీదండు కదలాలి
- 25న జరిగే నియోజకవర్గాల ప్రతినిధులసభలో ఆరు తీర్మానాలు
- 4 లక్షలమంది పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేలా ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 25న జరిగే ప్రతినిధులసభలను వచ్చే ఎన్నికలకు బలమైన పునాదిరాళ్లుగా ఉపయోగించుకోవాలని భారత్ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు పిలుపునిచ్చారు. ఈ ఏడాది జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసి సమరోత్సాహంతో కదంతొక్కేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలతో కేటీఆర్ ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సంక్షేమానికి చిరునామాగా సీఎం కేసీఆర్, సంక్షోభానికి చిరునామాగా ప్రధాని మోదీ ఉన్నారనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. తొమ్మిదేళ్లలో మారిన తెలంగాణ ముఖచిత్రంపై చర్చించడంతోపాటు 'వ్యవసాయం, సంక్షేమం, పల్లెప్రగతి– పట్టణప్రగతి, విద్య– ఉపాధి, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక అంశాల'పై తీర్మానాలు చేయాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ మోసాలు, బీజేపీ అన్యాయాలపై ప్రతి గడపకూ చేరేలా, ప్రతీ గుండెనూ తట్టేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కేటీఆర్ నిర్దేశించారు.

ఎన్నికల శంఖారావంలా ప్రతినిధులసభలు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న నియోజకవర్గ ప్రతినిధుల సభల్లో తొమ్మిదేళ్ల ప్రభుత్వ ప్రస్థానాన్ని ప్రజలకు వివరించడంతోపాటు ఎన్నికలదిశగా కేడర్‌ను కార్యోన్ముఖులను చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 3 వేల నుంచి 3,500 మంది ప్రతినిధులను ఆహ్వానించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలమంది కార్యకర్తలను మమేకం చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత కార్యక్రమాలపైనే ప్రత్యేకంగా రాజకీయ తీర్మానం ఉండాలని కేటీఆర్ సూచించారు. విద్యారంగం–ఉపాధి అనే అంశంపై మూడో తీర్మానం చేయాలని, ఉద్యోగాల భర్తీపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రగతిపై చర్చించడం ద్వారా ఈ సరికొత్త అభివృద్ధి నమూనాను దేశానికి పరిచయం చేయాల్సిన ఆవశ్యకతపై తీర్మానాలు చేయాలన్నారు.

బీజేపీ వైఫల్యాలను ఎండగట్టేలా తీర్మానాలు

ధరలను నియంత్రించలేని కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని రాష్ట్ర ప్రభుత్వంపైకి నెట్టే కుట్రలపై ప్రజలకు అవగాహన కలిగేలా తీర్మానం ఉండాలని కేటీఆర్ సూచించారు. కేంద్రం సుదీర్ఘంగా పెండింగ్‌లో పెట్టిన అంశాలు, విభజన హామీలు, రాష్ట్రంపై చూపుతున్న వివక్షపై రాజకీయ తీర్మానాలు చేయాలన్నారు. 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, సెక్రటేరియట్‌కు అంబేడ్కర్ పేరు తదితర అంశాలపై ప్రతినిధుల సభలో చర్చించాలని, వచ్చే ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేసేలా ఎన్నికల శంఖారావం పూరిస్తూ సభలు నిర్వహించాలని సూచించారు.



చేవెళ్ల సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో చంద్రశేఖర్, ఈటల, డా.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తరుణ్‌చుగ్, డీకే అరుణ, మురళీధర్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి

అధికారంలోకి రాగానే ముస్లిం 'కోటా' రద్దు

ఆ రిజర్వేషన్ ఫలాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అందేలా చర్యలు ● చేవెళ్ల సభలో అమిత్ షా

చేవెళ్ల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగ వ్యతిరేక ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని, వాటి ఫలాలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అందేలా చర్యలు తీసుకుంటామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించారు. పార్టీకి పెరుగుతున్న మద్దతు, ఈ సభకు వచ్చిన ప్రజాస్పందన చూస్తుంటే, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ భారీ మెజారిటీతో అధికారంలోకి రాబోతోందనే విషయం స్పష్టమౌతోందన్నారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ సర్కార్‌పై ప్రజల్లో పెల్లుబుకుతున్న జనాగ్రహాన్ని మొత్తం ప్రపంచం వీక్షిస్తోందన్నారు. చేవెళ్లలో బీజేపీ విజయసంకల్ప సభతో గత 8, 9 ఏళ్ల అవినీతిమయ బీఆర్ఎస్ పాలనకు 'రివర్స్ కౌంటింగ్' మొదలైనట్టేనని చెప్పారు. ఉద్యోగాల ఆశ చూపి నిరుద్యోగ యువతను నిండా ముంచిన కేసీఆర్ సర్కార్‌కు ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని మండిపడ్డారు. తాను మళ్లీ వస్తానని, అన్నింటికీ లెక్కలు అడుగుతానని, ఇచ్చిన హామీల అమలు ఏమయ్యిందో నిలదీస్తానన్నారు. ఆదివారం చేవెళ్లలో జరిగిన తొలి 'విజయసంకల్ప యాత్ర' బహిరంగసభలో అమిత్‌షా పాల్గొన్నారు. చిలుకూరు బాలాజీ భగవాన్‌కి ప్రార్థనలు, ఉమ్మడి ఏపీ మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డికి ప్రణామాలంటూ ప్రసంగం ప్రారంభించారు.

ఎంఐఎం చేతుల్లో కారు స్టీరింగ్

'బీఆర్ఎస్ ఎన్నికల గుర్తు అయిన కారు స్టీరింగ్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతుల్లో ఉంది. అందువల్ల దాని దిశ సరిగా ఉండదు. ఒవైసీ ఎజెండాపై నిర్లజ్జగా నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ స్వాతంత్య్ర దినోత్సవాన్ని నిర్వహించడం లేదు. మోదీ నేతృత్వంలో ఇక్కడ బీజేపీ అధికారానికి వచ్చాక పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తాం. మీరు మజ్లిస్‌కు భయపడవచ్చేమో కానీ బీజేపీ భయపడదు. డబుల్ బెడ్‌రూం స్కీంలోనూ మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించారు. విద్యలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారు. ఇది ఇక ముందు సాగదు. మజ్లిస్ స్టీరింగ్‌తో నడుస్తున్న కేసీఆర్ పాలనతో రాష్ట్రాభివృద్ధి జరగదు. అధికార, పోలీసు యంత్రాంగం పూర్తిగా రాజకీయంగా ప్రభావితమై ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తోంది. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు కిందిస్థాయి వరకు చేరడం లేదు. అయితే కేసీఆర్ ఏం చేసినా తెలంగాణలోని పేదలను ప్రధాని మోదీ నుంచి దూరం చేయలేరు. రాబోయే ఎన్నికల్లో భారీమెజారిటీతో ఇక్కడ బీజేపీ అధికారానికి రావడం ఖాయం. కమలం పువ్వుకు ఓటెయ్యండి, కమలంపై కూర్చుని మహాలక్ష్మీ, వైభవ్‌లక్ష్మీ తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఎవరి చేతుల్లోనో స్టీరింగ్‌తో నడిచే ప్రభుత్వంలా కాదు. దేశాభివృద్ధిలో తెలంగాణను భాగస్వామి చేసేలా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. 2024లో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం, ఆయన అండదండలతో 2023లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేలా ప్రజలు సహకరించాలి..' అని అమిత్‌షా కోరారు.

లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఒక్క ఉద్యోగ భర్తీ పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేని ప్రభుత్వానికి అధికారం చెలాయించే అర్హత లేదు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో సంబంధమున్న ప్రతి ఒక్కరినీ జైలుకు పంపుతాం. రాష్ట్రంలో ఎస్ఎస్‌సీ ప్రశ్నపత్రాలు కూడా లీక్ అయ్యాయి. టీఎస్‌పీఎస్సీ లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగులు, యువత జీవితం నాశనమైంది. ఎన్నికల మైదానంలో ఈ నిరుద్యోగులు కూడా కేసీఆర్ ప్రభుత్వ లెక్కాపత్రాలు సరిచేసి తగిన తీర్పు ఇవ్వబోతున్నారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీపై కేసీఆర్ కనీసం నోరు విప్పలేదు. కేసీఆర్ ఎవరిని రక్షించాలని అనుకుంటున్నారు? ఆయనకు ధైర్యముంటే ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. విచారణ నిర్వహించకుండా మీరు తప్పించుకోగలమని అనుకుంటున్నారేమో.. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే అవినీతికి పాల్పడేవారిని జైలుకు పంపించడం ఖాయం. నిరుద్యోగ యువతపై లాఠీలు ప్రయోగించి, బీజేపీ నేతలను జైలుకు పంపించి ప్రజల నోరుమూయించలేరు.

లీకేజీపై ప్రశ్నిస్తే సంజయ్‌ను జైలుకు పంపారు

'పేపర్ లీకేజీని నిలదీసినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను జైలుకు పంపించారు. కానీ 24 గంటలు కూడా ఆయన్ను అందులో ఉంచలేకపోయారు. సంజయ్ చేసిన తప్పేమిటో కేసీఆర్ చెప్పాలి. నిరుద్యోగ యువతకు జరిగిన నష్టంపై గొంతెత్తిన సంజయ్‌ను అరెస్ట్ చేయడాన్ని మీరు సమర్థిస్తారా? (సభికులు లేదంటూ కేకలు పెట్టారు). కేసీఆర్ సర్కార్ జైలుకు పంపినా, కేసులు పెట్టినా బీజేపీ కార్యకర్తలు భయపడరు. ప్రభుత్వాన్ని గద్దె దింపేదాకా విశ్రమించరు. బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను అసెంబ్లీలో మాట్లాడనీయకుండా అడ్డుకుంటే లక్షలాది మంది ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిస్తే మీరేమీ చేయలేకపోయారు' అని విమర్శించారు.

రాష్ట్రానికి పెద్దయెత్తున కేంద్రం నిధులు

'మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులిస్తోంది. మూడేళ్లలో రామగుండం ఫ్యాక్టరీ తెరిపించడం, ఎంఎంటీఎస్ రైలు విస్తరణ, తదితరాలన్నీ కలిసి భారీగా మేలు జరిగింది. తెలంగాణకు మెగా టెక్స్‌టైల్ పార్కు కూడా మోదీ ఇచ్చారు. రూ.లక్ష కోట్లు ఇక్కడ హైవేల కోసం ఖర్చయ్యాయి. ఎనిమిదేళ్ల పాలనలో తెలంగాణలో జాతీయ రహదారులు రెండింతలు అయ్యాయి. ఈ ప్రాంతం గుండా వెళ్లే హైదరాబాద్–బీజాపూర్ హైవే కోసం డబ్బులిచ్చినా, కేసీఆర్ ఇంకా భూసేకరణ చేయకపోవడంతో ఐదేళ్లు ఆలస్యమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేవెళ్ల ప్రజలకు అందాల్సిన ప్రయోజనం అందుబాటులోకి రాలేదు. ఒకసారి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందంటే మోదీ ఇచ్చే రూపాయికి బీజేపీ ప్రభుత్వం 25 పైసలు కలిపి రూ.1.25 ఖర్చు చేస్తుంది..' అని అమిత్‌షా అన్నారు. ప్రసంగానికి ముందు మహాత్మా బసవేశ్వర జయంతి పురస్కరించుకుని స్టేజిపై ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి అమిత్‌షా నివాళులర్పించారు. హైదరాబాద్‌కు చెందిన బడే గులాం అలీఖాన్ జయంతి సందర్భంగా ప్రణామాలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో బండి సంజయ్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు, పార్టీ నేతలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఏవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నేతలతో భేటీ

అమిత్‌షాకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పలువురు ముఖ్య నేతలతోపాటు ఎంపీ అరవింద్, రఘునందన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు శాలువాలు కప్పి సత్కరించారు. అక్కడినుంచి అమిత్‌షా నేరుగా నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు.

అక్కడ తరుణ్‌చుగ్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర రాజకీయాలపై, భవిష్యత్తులో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది. సుమారు నలభై నిమిషాల పాటు ఆయన పార్టీ నేతలతో కలిసి ఉన్నారు. అనంతరం రోడ్డు మార్గంలో చేవెళ్లకు బయలుదేరి వెళ్లారు. కాగా ట్రిపుల్ ఆర్ సీసీ బృందంతో అమిత్‌షా భేటీ రద్దయ్యింది.

ప్రజల దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్‌గా మార్పు

'మీ కుటుంబ అవినీతిమయ పాలన గురించి తెలంగాణ ప్రజలకు పూర్తిస్థాయిలో తెలిసివచ్చింది. భారీగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. పలు కుంభకోణాల్లో మీ సన్నిహితులే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణలో అవినీతి గంగ వరదలా పారింది. వాటిని, తెలంగాణను కేసీఆర్ కుటుంబం ఏటీఎంగా వాడుకుంటోంది. తమ అవినీతి, అక్రమాలు, వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చారు. ప్రధాని కావాలని కేసీఆర్ కలలు కంటున్నారు. కొన్ని రాష్ట్రాల్లో పర్యటించి ప్రధాని అయినట్లు అనుకుంటున్నారు. కానీ ప్రధానమంత్రి కుర్చీ ఖాళీ లేదు. అందులో మోదీ ఉన్నారు. 2024 ఎన్నికల్లోనూ మళ్లీ పూర్తి మెజారిటీతో ప్రధాని కాబోతున్నారు. చేవెళ్ల ప్రజలు 2024లో మోదీని ప్రధానిని చేస్తారా.. లేదా.. రెండు చేతులెత్తి చెప్పండి. రాష్ట్రంలోనే వారి పాలన, పని ముగిసిపోతుంటే, ఇంకా జాతీయ రాజకీయాల గురించి గొప్పలెందుకు? లోక్‌సభ ఎన్నికల సినిమా రావడానికి ముందే ఇక్కడ బీజేపీ ప్రభుత్వం ఏర్పడే ట్రైలర్ రాబోతోంది..' అని అమిత్‌షా అన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలా వద్దా? ఢిల్లీలో మోదీకి వినిపించేలా గట్టిగా చెప్పండి అంటూ 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేయించారు.

రాష్ట్రంలో బీజేపీ ఖాళీ.. ఢిల్లీలో ప్రధాని కుర్చీ ఖాళీ

- అమిత్‌షాకు ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్ కౌంటర్
- కేంద్రమంత్రి మాట్లాడిన ప్రతి అంశంపై స్పందించిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేవెళ్ల సభలో చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి కె. తారక రామారావు ఆదివారం రాత్రి ట్విట్టర్ వేదికగా ఘాటుగా స్పందించారు. 'డియర్ అమిత్‌షా జీ..త్వరలో అధికారంలోకి కాదు.. బీజేపీ అంధకారంలోకే.. త్వరలో రాష్ట్రంలో బీజేపీ ఖాళీ.. ఢిల్లీలో ప్రధాని కుర్చీ ఖాళీ.. 2024లో వైఫల్యాల మోదీకి గుజరాత్ ఘర్‌వాపసీ తప్పదు.. మరోసారి మోదీని ప్రధాని పీఠం ఎక్కిస్తే దేశాన్ని బలిపీఠం ఎక్కించినట్టేననే భావనలో ప్రజలున్నారు' అంటూ అమిత్‌షా వ్యాఖ్యలపై ఎక్కడికక్కడ కౌంటర్ ఇస్తూ ఆయన చేసిన వరుస ట్వీట్లు ఇలా..

అదానీ చేతిలో బీజేపీ స్టీరింగ్

'కారు స్టీరింగ్ కాదు.. బీజేపీ స్టీరింగే అదానీ చేతికి చిక్కింది. కార్పొరేట్ దోస్తు కబంధహస్తాల్లో కమలం విలవిలలాడుతోంది. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో బీజేపీ ఫుల్ పిక్చర్‌ను దేశప్రజలు 70 ఎంఎంలో చూసేశారు. ఇంకా ఏ ట్రైలర్ అవసరం లేదు. తెలంగాణలో గల్లీ బీజేపీ నేతల పగటివేషాలు నడవవు. ఢిల్లీ పెద్దల పగటికలలు నెరవేరవు. అదానీపై జేపీసీ వేయని బీజేపీకి సిట్టింగ్ జడ్జి విచారణ అడిగే హక్కుందా?. ముక్కునేలకు రాసినా..మోకాళ్ల యాత్ర చేసినా..మోసాల మోదీని తెలంగాణ నమ్మదు. బట్టేబాజ్ బీజేపీని తెలంగాణ సమాజం క్షమించదు. కరప్షన్‌కు కెప్టెన్.. మోదీ. క్యాప్టన్.. బీజేపీ. ఎంఐఎం భుజంపై తుపాకీపెట్టి ఎంతకాలం కాలుస్తారు?. తెలంగాణలో సొంత బలం లేని పార్టీ బీజేపీ. పల్లెపల్లెనా బలగం కలిగిన పార్టీ బీఆర్ఎస్'.

నిస్సిగ్గుగా సుద్దులా?

'బారాణా తీసుకుని చారాణా కూడా ఇవ్వని బీజేపీకి మిగిలేది బూడిదే. అదానీ విషయంలో జేపీసీ కాదు కదా కనీసం సిట్ కూడా వేయని వారు అవినీతి గురించి మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టుంది. గుజరాత్‌లో మోదీ హయాంలో మీరు హోంమంత్రిగా ఉన్నప్పుడు పేపర్ లీకుల్లో గుజరాత్ నంబర్‌వన్‌గా ఉన్నమాట నిజం కాదా?. గత ఎనిమిదేళ్లలో గుజరాత్‌లో 13సార్లు పేపర్లు లీక్ కాలేదా?. ఈ దేశంలో 'వ్యాపం' లాంటి అతి జుగుప్సాకరమైన స్కాం చేసింది మీ బీజేపీ ప్రభుత్వం కాదా?. అటువంటి మీరు నిస్సిగ్గుగా సుద్దులు మాట్లాడటం మీకే చెల్లింది'.

పీఎం కేర్స్‌లో ఎంత జమైందో చెబుతారా?

'పీఎం కేర్స్‌లో ఎంత జమైందో, ఏవిధంగా ఖర్చయిందో చెప్పని వారు, కాగ్ ఆడిట్ పీఎం కేర్స్‌కు వర్తించదని నిస్సిగ్గుగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిన వారు, కాగ్ మాత్రమే కాక అన్ని రకాల బ్యాంక్స్ ఆడిట్లతో కట్టిన ప్రాజెక్టులపై మాట్లాడటం అవివేకం కాక మరేమిటి?. ఎనిమిదేళ్లుగా కృష్ణా నదిలో తెలంగాణ వాటా తేల్చకుండా, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించకుండా ఇక్కడికొచ్చి ఎవరో మీ గులాములు రాసిచ్చిన స్క్రిప్టును వల్లెవేస్తే నమ్మేదెవరు?' అంటూ కేటీఆర్ తన వరుస ట్వీట్‌లను ముగించారు.

మీకు ఫ్రెండ్ ఫస్ట్.. నేషన్ లాస్ట్..

'ఐటీఐఆర్ హైదరాబాద్, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, హైదరాబాద్ మెట్రో రెండోదశ, ఐఐఎం, ఐసెర్, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐడీ, నవోదయ, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలకు శంకుస్థాపన చేసినందుకు కృతజ్ఞతలు. ఓహ్.. ఆగండాగండి.. ఇవేవీ ఆయన చేయలేదు' అంటూ అమిత్ షాను ఉద్దేశించి రాష్ట్రమంత్రి కేటీఆర్ మరో ట్వీట్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ కంటే మెరుగ్గా పనిచేసిన బీజేపీ పాలిత రాష్ట్రం పేరు ఒక్కటీ ఎందుకు చెప్పలేకపోయారు' అని మంత్రి కేటీఆర్ అమిత్‌షాను ప్రశ్నించారు. 'ఆకాశాన్నంటుతున్న పప్పు, ఉప్పు, నూనె ధరలు నియంత్రించే సోయి లేదు. ప్రజలపై పెట్రోధరల భారాన్ని తగ్గించాలన్న సోయి కూడా లేదు. గ్యాస్ ధరలను భరించలేకపోతున్న మహిళలపై కనికరం లేదు. కానీ ఆగమేఘాలపై అదానీ కంపెనీని ఆదుకోవడమే మీ ఏకైక లక్ష్యం. దేశం కోసం కాదు.. దోస్తు కోసం ప్రజల రెక్కల కష్టాన్ని ధారపోస్తున్న వైనం. సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు.. ప్రధాని ప్రాధాన్యాల్లో పేదవాడు ఎక్కడ?. దేశానికి అర్థమైంది.. మీకు ఫ్రెండ్ ఫస్ట్.. నేషన్ లాస్ట్' అంటూ కేటీఆర్ బీజేపీపై మండిపడ్డారు.

సెటిల్‌మెంట్ల కోసమే హైదరాబాద్‌కు అమిత్‌షా

ఈటల, రేవంత్‌లవి దొంగ నాటకాలు: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అమిత్ షా హైదరాబాద్ వరుస టూర్ల వెనుక ఆర్థిక లాభాలు ఉన్నాయని, బీజేపీ నేతల డబ్బుల సెటిల్మెంట్ల కోసమే కేంద్ర హోంమంత్రి హైదరాబాద్ వస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్‌ఎల్‌పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఈటల రాజేందర్, వివేక్ ఆర్థిక వ్యవహారాలు సెటిల్ చేసేందుకే చేవెళ్ల సభ నిర్వహించారని విమర్శించారు. ఈ ఇద్దరి నేతల కోసమే ఆగమేఘాల మీద చేవెళ్ల సభకు అమిత్‌షా వచ్చి పోయారని అన్నారు. ఈటల, రేవంత్ రెడ్డి రాజకీయంగా దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఒక్క రూపాయి ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి భాగ్యలక్ష్మి దేవాలయం సాక్షిగా ప్రమాణం చేశారు సరే, మరి ఈటల.. రేవంత్‌రెడ్డికి డబ్బులు ఇచ్చాడని ఆనాడు తాను చెప్పిన మాటలకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తాను ఉన్నదున్నట్లు అడిగితే ఈటల బట్టలు చింపుకుంటున్నారని, వేం నరేందర్ కొడుకు పెళ్లిలో హుజూరాబాద్ ఎన్నికల డీల్ కుదిరించుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. రూ. 25 కోట్ల డబ్బులు లెజెండ్ రెస్టారెంట్‌లో మార్చుకుంది నిజం కాదని హుజూరాబాద్ ఇల్లంతకుంట రాముడి గుడి సాక్షిగా ప్రమాణం చేద్దామా అని ప్రశ్నించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఈటల రూ.25 కోట్లు రేవంత్‌రెడ్డికి ఇచ్చారని, రేవంత్‌రెడ్డికి, ఈటలకు తేడాలు రావడంతో మనసులో మాట బయటపడిందని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు.

వేట మొదలైంది.. అందుకే పులి వచ్చింది


- చేవెళ్ల సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: 'సీఎం కేసీఆర్ నన్ను అక్రమంగా అరెస్ట్ చేసి 8 గంటలు రోడ్లపై తిప్పారు. అప్పుడు కార్యకర్తలకు నేనొక్కటే చెప్పిన. మీరేం భయపడకండి. ఢిల్లీ నుంచి ఫోన్ చేసింది. పులి వస్తోంది. వేట మొదలైంది. వెంటాడటం ప్రారంభించింది. ఆ పులి కార్యకర్తలను కాపాడే పులి. ఆ పులే చేవెళ్ల గడ్డకు వచ్చింది. ఆ పులికి అందరూ లేచి స్వాగతం పలికండి'అంటూ బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ అని అన్నారు. చేవెళ్లలో ఆదివారం జరిగిన 'విజయ సంకల్ప సభ'లో సంజయ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణను అభివృద్ధి చేసేందుకు మోదీ ప్రభుత్వం ఇక్కడికి వస్తుంటే కేసీఆర్ అడుగడుగునా అడ్డుకుంటోంది. ఒక్కసారి తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. బీజేపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తాం. పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందిస్తాం. ఫసల్ బీమా అమలు చేస్తాం. ఇళ్లను నిర్మిస్తాం. జాబ్ కేలండర్ ప్రకటిస్తాం. ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తాం. తెలంగాణలో రాక్షస రాజ్యాన్ని, కుటుంబపాలన, నియంత పాలనను కూకటివేళ్లతో పెకిలించి వేసేందుకు అమిత్ షా ఆధ్వర్యంలో ఇక్కడికి వచ్చాం. మీ అందరూ ఆశీస్సులివ్వాలని కోరుతున్నా. లాఠీదెబ్బలకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదు. ఇంతపెద్ద ఎత్తున వచ్చిన మీ అందరికీ రెండు చేతులెత్తి జోడిస్తున్నా' అని పేర్కొన్నారు.

'ఫ్రస్టేషన్‌లో అమిత్‌షా అవాకులు చెవాకులు'

సాక్షి, హైదరాబాద్: దేశంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్న ఆవేదనతో, ఫ్రస్టేషన్లో అమిత్ షా చేవెళ్లలో మాట్లాడారని తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్‌కో) చైర్మన్ వై.సతీష్‌రెడ్డి విమర్శించారు. పేపర్ లీకేజీలపై అమిత్ షా మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ఒక్క గుజరాత్‌లోనే బీజేపీ పాలనలో మొత్తం 118 సార్లు పేపర్ లీకేజీలు జరిగితే ఎన్నిసార్లు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించారో తడీపార్ అమిత్ షా చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యాపం స్కామ్‌తో మధ్యప్రదేశ్‌లో అనేకమందిని పొట్టన పెట్టుకున్నారని, సాక్షులు, కేసు విచారించిన వాళ్ళు కూడా అనుమానస్పదంగా మరణించారని గుర్తు చేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలు సరికావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ అగ్రనేత అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సంకుచిత రాజకీయాలకు నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ విమర్శించారు. ఇలాంటి ప్రకటనల ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ముస్లిం మైనార్టీ ప్రజల్లో అభద్రతా భావం పెంపొందించేలా మాట్లాడటం దేశ విస్తృత ప్రయోజనాలను దెబ్బ తీస్తుందన్న విషయాన్ని గ్రహించాలని కోరారు.

స్థలం కేటాయిస్తే హాస్పిటల్ నిర్మాణానికి నిధులు తెస్తా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి మాణికేశ్వర్‌నగర్‌లో హాస్పిటల్ కోసం స్థలాన్ని కేటాయిస్తే దాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో 19 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన మహాధర్నాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పెట్రోల్ బంకులు, సినిమా హాళ్లు, హోటళ్లు, మసీదులకు యూనివర్సిటీ అనుమతిచ్చిందని, ప్రజలకు ఉపయోగపడే ఆస్పత్రికి స్థలాన్ని ఎందుకు కేటాయించదని ప్రశ్నించారు. ఈ విషయంపై తాను యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు బసవేశ్వరుడు

బసవేశ్వరుని జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపనకోసం కృషి చేసిన భారతీయ దార్శనికుడు బసవేశ్వరుడని దేశ ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం బసవేశ్వరుని జయంతి సందర్భంగా వీరశైవ లింగాయత్‌లు, లింగ బలిజలు సహా దేశ ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. బసవేశ్వరుని స్ఫూర్తిని రేపటి తరాలు కొనసాగించేందుకు గుర్తుగా వారి కాంస్య విగ్రహాన్ని ట్యాంకుబండ్ మీద నెలకొల్పుకున్నామన్నారు. హైదరాబాద్ కోకాపేటలోని బసవ భవన్ నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు.

రఘునందన్‌రావు ఆరోపణలు అవాస్తవం

మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ఆర్డీఎస్ కాలువ ఎక్కడుందో, కృష్ణా ముంపు కాలువ ఎక్కడుందో కనీస అవగాహన లేదని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన చెప్పిన చందూరు భూములకు ఆర్డీఎస్ కాలువ రాదని స్పష్టం చేశారు. తన ఆస్తులకు సంబంధించి రఘునందన్‌రావు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రఘునందన్‌రావు తన భూము లకు సంబంధించి చూపిన పత్రాలు శుద్ధ అబద్ధాలని చెప్పారు. 80 ఎకరాలు కొని 80 ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించడం అవాస్తవమన్నారు. రఘునందన్‌రావు ఆరోపణలు తప్పని రుజువైతే ఆయన ఏం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఉద్యోగుల ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న పోలీసులు



ప్రెస్‌క్లబ్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

పంజగుట్ట (హైదరాబాద్): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆరు నెలల వరకు విద్యుత్ సంస్థల్లో సమ్మె నిషేధిస్తూ విద్యుత్ ఉన్నతాధికారులు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఉద్యోగ సంఘం నాయకులు ఇప్పటికే ఈ నెల 25 నుంచి సమ్మెకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. దీంతో శనివారం రాత్రి నుంచే ముందస్తు అరెస్టు చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి.. సమ్మెకు వెళ్తామని ప్రకటించనున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఉదయం నుంచే భారీగా మోహరించారు. ప్రెస్‌క్లబ్ వద్దకు వచ్చిన 8 మంది ఉద్యోగులను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు.

లీకేజీపై ప్రగతి భవన్ డైరెక్షన్‌లో దర్యాప్తు

వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ట్వీట్



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకులపై సిట్ దర్యాప్తు.. ప్రగతి భవన్ డైరెక్షన్‌లో సాగుతోందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ట్విటర్ వేదికగా మండిపడ్డారు. పాత్రధారులను దోషులుగా చూపిస్తూ.. సూత్రధారులకు క్లీన్ చిట్ ఇచ్చే పనిలో పడ్డారని విమర్శించారు. ఇందుకు సిట్ దర్యాప్తే నిదర్శనమన్నారు. తెరవెనుక ఉన్న అసలు దొంగలను దర్యాప్తుల్లో దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బోర్డ్ సభ్యుల్లో ఒక్కరినీ అదుపులోకి తీసుకోలేదని విమర్శించారు. కనీసం కాన్ఫిడెన్షియల్ అధికారిని కూడా బాధ్యతల నుంచి తప్పించలేదని, దర్యాప్తు ముగిసే వరకు బోర్డ్ సభ్యులపై కనీసం నిఘా పెట్టలేదన్నారు. పేపర్ లీకుల్లో ఉద్యోగులు మాత్రమే ఉంటే సీబీఐ దర్యాప్తునకు కేసీఆర్ అండ్ బ్యాచ్‌కు భయమెందుకని నిలదీశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

55,000 వరకు నేషనల్ లెవల్



అంతలోపు ర్యాంకు వస్తేనే జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రవేశం

ఈసారి దేశవ్యాప్తంగా 10 వేల సీట్లు పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు కోసం ఈ నెల 15 వరకు జరిగిన జేఈఈ మెయిన్ ఎంట్రన్స్ ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో తమకు ఏ ర్యాంకు వస్తుంది? ఎక్కడ, ఏ బ్రాంచీలో సీటు వస్తుందనే ఉత్సుకత విద్యార్థుల్లో నెలకొంది. గతేడాది జేఈఈ అంచనాలు, ఈసారి పేపర్ విధానాన్ని పరిశీలిస్తే జేఈఈ మెయిన్‌లో 55 వేల వరకు ర్యాంకు వచ్చిన వాళ్లకు కూడా జాతీయస్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏదో ఒక కోర్సులో, ఎక్కడో ఒకచోట సీటు ఖాయమని తెలుస్తోంది. ఈడబ్ల్యూఎస్‌కు 60 వేలు, ఓబీసీలకు 65 వేలు, ఎస్సీలకు 1.20 లక్షలు, ఎస్టీలకు 3 లక్షలు, పీడబ్ల్యూడీలకు 8 లక్షల ర్యాంకు వచ్చినా జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు పొందే వీలుంది. అయితే కంప్యూటర్ సైన్స్, నచ్చిన కాలేజీలో సీటు కోసం మాత్రం పోటీ ఎక్కువే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వరంగల్, సూర్తాల్, తిరుచాపల్లి వంటి ఎన్ఐటీ కాలేజీల్లో సీటు రావాలంటే జేఈఈ మెయిన్‌లో 5 వేలలోపు ర్యాంకు వరకే ఆశలు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.



30 నుంచి దరఖాస్తులకు అవకాశం...

ఈ నెల 30 నుంచి జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఉమ్మడి ప్రవేశాల అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. ఈసారి జేఈఈ మెయిన్ ప్రవేశపరీక్షను దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది రాశారు. వారిలో 2.5 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించనున్నారు. జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన వారు ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కాలేజీలతోపాటు రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో బీ–కేటగిరీ సీట్లలో ప్రాధాన్యం పొందుతారు. దేశవ్యాప్తంగా ఈసారి 10 వేల ఇంజనీరింగ్ సీట్లు పెరిగే వీలుంది. కొత్త కోర్సులకు అనుమతించడం, కొన్ని కాలేజీల్లో సీట్లు పెంచడమే దీనికి కారణం. ఐఐటీల్లో 16,053 సీట్లు, ఎన్ఐటీల్లో 24 వేలు, ట్రిపుల్ ఐటీల్లో 16 వేలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో 6,078 సీట్లున్నాయి. గతేడాది పర్సంటైల్‌ను పరిశీలిస్తే జనరల్ కేటగిరీలో 88.41 పర్సంటేల్ వస్తే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యారు. ఓబీసీ ఎన్‌సీఎల్‌కు 67.00, ఈడబ్ల్యూఎస్‌కు 63.11, ఎస్సీలకు 43.08, ఎస్టీలకు 26.77, పీడబ్ల్యూడీలకు 0.003 పర్సంటేల్‌తో అడ్వాన్స్‌డ్ కటాఫ్ ఖరారైంది. ఈసారి కూడా పోటీని బట్టి కటాఫ్ గతేడాదికి కొంచెం అటుఇటుగా ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఏ నిట్‌లో ఏ ర్యాంకు వరకూ సీటు...? (అంచనా...)

నిట్		జనరల్	ఈడబ్ల్యూఎస్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ
వరంగల్ (సీఎస్‌సీ)	బాలురు	2,257	5,247	4,592	12,551	-
	బాలికలు	3,913	-	1,169	-	-
వరంగల్ (కెమికల్)	బాలురు	28,719	39,567	43,417	99,501	1,41,639
	బాలికలు	32,020	33,455	48,741	92,575	-
ఏపీ (సీఎస్‌సీ)	బాలురు	19,189	19,812	24,368	61,386	68,016
	బాలికలు	19,474	20,053	39,347	62,333	-
ఏపీ (కెమికల్)	బాలురు	66,983	73,122	71,267	1,42,937	1,47,480
	బాలికలు	73,327	7,748	79,001	9,599	-
కాలికట్ (సీఎస్‌సీ)	బాలురు	4,799	6,927	7,949	23,305	42,766
	బాలికలు	6,315	8,033	-	-	-
సూరత్‌కల్ (సీఎస్‌సీ)	-	4,932	5,909	6,460	48,610	34,078
జలంధర్ (సీఎస్‌సీ)	-	11,547	13,749	16,506	-	-
దుర్గాపూర్ (సీఎస్‌సీ)	-	9,100	10,200	13,600	44,000	52,000



ఆలోచించి అడుగేయాలి..

జేఈఈ మెయిన్‌లో టాప్ పర్సంటైల్ వచ్చిన వారు సాధారణంగా అడ్వాన్స్‌డ్‌కు వెళ్తారు. మెయిన్‌లో అర్హత పొంది, 55 వేల ర్యాంకు వరకు వస్తే మాత్రం ఎన్ఐటీ కాలేజీల్లో సీటు పొందే వీలుంది. ర్యాంకు ఎంతో తెలిశాక ఆచితూచి అడుగేయాలి. కాలేజీతో ప్రాధాన్యం లేదనుకుంటే ఇప్పటివరకు వస్తున్న ర్యాంకులను బట్టి ముందుకెళ్లాలి. కోరుకున్న కోర్సు, కాలేజీనే కావాలనుకుంటే వచ్చిన ర్యాంకును బట్టి సీటు వస్తుందో లేదో చూసుకోవాలి. లేకుంటే లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకొని వచ్చే ఏడాది మంచి ర్యాంకు సాధించేందుకు ప్రయత్నించడమే మంచిది.

– ఎంఎస్ రావు, జేఈఈ మెయిన్ బోధన నిపుణుడు

ఔరంగాబాద్ గులాబీమయం

నేడు మహారాష్ట్రలో బీఆర్ఎస్ బహిరంగ సభ

- నాందేడ్, కాందార్‌లోహ సభల స్ఫూర్తితో ఏర్పాట్లు
- సాయంత్రం 6 గంటలకు సభ.. హాజరవనున్న సీఎం కేసీఆర్
- పలువురు కార్పొరేటర్లు సహా 200 మంది నేతల చేరిక



మహారాష్ట్రలోని ఔరంగబాద్ రోడ్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఫ్లెక్సీ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలో పార్టీ కార్యకలాపాల విస్తరణపై దృష్టి కేంద్రీకరించిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సోమవారం మరో కీలక అడుగు వేసేందుకు రంగం సిద్ధమైంది. ఔరంగాబాద్ (ఛత్రపతి శంభాజీనగర్) జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హాజరు కానుండటంతో సభ నిర్వహణ ఏర్పాట్లను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సుమారు రెండు లక్షల మంది సభకు హాజరవుతారని వారంరోజులుగా సభ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ తెలంగాణ నేతలు చెప్తున్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు ఔరంగాబాద్ జబిందా మైదానంలో జరిగే సభకు హాజరయ్యేందుకు కేసీఆర్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరతారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విధానాలను సీఎం కేసీఆర్ ఔరంగాబాద్ సభా వేదికగా ఎండగట్టనున్నారు.

మహారాష్ట్రలో మూడో బహిరంగ సభ..

బీఆర్ఎస్‌గా అవతరించిన తర్వాత పొరుగున ఉన్న మహారాష్ట్రపై దృష్టి కేంద్రీకరించిన కేసీఆర్ ఫిబ్రవరి 6న నాందేడ్‌లో చేరికల సభ, మార్చి 26న కాందార్ లోహాలో బహిరంగసభ నిర్వహించారు. మూడో బహిరంగ సభను తొలుత ఔరంగాబాద్ అంకాస్ మైదానంలో నిర్వహించాలని భావించినా పోలీసులు అనుమతి నిరాకరించడంతో జబిందా గ్రౌండ్‌కు వేదికను మార్చారు. బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్, జాతీయ ప్రధాన కార్యదర్శి హిమాన్షు తివారీ, పార్టీ మహారాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు మాణిక్ కదమ్, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్, పార్టీ నేతలు వేణుగోపాలచారి, గ్యాదరి బాలమల్లు, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవ తదితరులు వారంరోజులుగా ఔరంగాబాద్‌లో మకాం వేసి సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జన సమీకరణ కోసం సన్నాహాక సమావేశాలు నిర్వహించడంతో పాటు డిజిటల్ ప్రచార రథాలు, వాల్ పోస్టర్లతో తెలంగాణ ప్రభుత్వ పథకాలను స్థానికంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు

బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు మహారాష్ట్రకు చెందిన బీజేపీ, ఎన్‌సీపీ, కాంగ్రెస్, శివసేన, ఎంఐఎం తదితర పార్టీలకు చెందిన నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే శంకరన్న దోండ్గె, దినేశ్ బాబూరావు మడావీ, ఔరంగాబాద్ జెడ్పీ చైర్మన్ షెల్కే వంటి కీలక నేతలు బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. మహారాష్ట్ర ప్రదేశ్ సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ పార్టీతో పాటు పలు సామాజిక సంస్థలు బీఆర్ఎస్‌లో తమ విలీనాన్ని ప్రకటించాయి. సోమవారం ఔరంగాబాద్ బహిరంగ సభ వేదికగా వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు సుమారు 200 మంది ముఖ్య నేతలు బీఆర్ఎస్‌లో చేరుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

నేడు ఖమ్మంలో కాంగ్రెస్ నిరుద్యోగ సభ

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, ఉద్యోగ నియామకాల్లో నిర్లక్ష్యంపై పోరుబాట
- హాజరు కానున్న రేవంత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుద్యోగుల పక్షాన ఉద్యమకార్యాచరణ చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సోమవారం ఖమ్మంలో భారీసభ నిర్వహించనుంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతోపాటు టెన్త్ పరీక్షల లీకేజీ, ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యార్థి వ్యతిరేక విధానాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం తదితర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ నిరసనసభలు నిర్వహించాలని ఇప్పటికే కాంగ్రెస్ నిర్ణయించింది. అందులో భాగంగా ఖమ్మంలో తొలిసభ జరగనుంది. ఈ సభ సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి మయూరి సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తామని టీపీసీసీ తెలిపింది. సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు సీనియర్ నేతలు పాల్గొంటారని, కాంగ్రెస్ కార్యకర్తలు, నిరుద్యోగులు, విద్యార్థులు ఈ సభకు భారీగా తరలిరావాలని టీపీసీసీ పిలుపునిచ్చింది.

27న కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని తొలగించినందుకు నిరసనగా ఈనెల 27న గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. దీక్షలో సంఘటన్ జాతీయ అధ్యక్షురాలు మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ నేతలు దీక్షలో పాల్గొంటారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్‌కు అమ్ముడు పోయిన ఈటల

నల్లగొండ: మునుగోడు ఉప ఎన్నికల్లో కేసీఆర్ నుండి ఈటల రాజేందర్ రూ.25 కోట్లు తీసుకున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ విమర్శించారు. అలాంటి వ్యక్తి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంఐఎంను బీ టీమ్‌గా మార్చుకున్న బీజేపీ తాము బలహీనంగా ప్రాంతాల్లో ఎంఐఎం అభ్యర్థులను పోటీలో నిలిపి బిహార్ తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.

స్ట్రాంగ్‌రూమ్ తాళాలు బ్రేక్

- హైకోర్టు ఆదేశాలతో పగులగొట్టిన అధికారులు
- 26న కోర్టుకు నివేదిక



వీఆర్‌కే కళాశాల ఎదుట పోలీసు బందోబస్తు

జగిత్యాల: జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలను హైకోర్టు ఆదేశాలతో అధికారులు ఆదివారం పగులగొట్టారు. కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లోనే కోర్టును ఆశ్రయించారు. అప్పట్నుంచి కేసు విచారణ సాగుతుండగా ఈనెల 10న స్ట్రాంగ్‌రూమ్ తెరిచి 17 ఏ, 17 సీ డాక్యుమెంట్లు, సీసీ ఫుటేజీలు, డాక్యుమెంట్లను ఈనెల 11న అందజేయాలని కోర్టు ఆదేశించింది. కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆధ్వర్యంలో మల్యాల మండలం నూకపల్లిలోని వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ గదులు తెరిచేందుకు యత్నించగా.. రెండు గదుల తాళాలు వచ్చాయి. కోర్టు అడిగిన 17ఏ, 17సీ డాక్యుమెంట్లు, సీసీ ఫుటేజీలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళం చెవులు మాత్రం సరిపోలేదు. అధికారులు సుమారు ఐదు గంటలపాటు అధికారులు తాళం తెరుచుకోలేదు. చివరకు దానిని పగులగొట్టేందుకు యత్నించగా, కాంగ్రెస్ అభ్యర్థి మరోసారి కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికల సమయంలో పనిచేసిన కలెక్టర్ శరత్, ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ రవితోపాలు అప్పటి ఎన్నికల అధికారులను ఈనెల 17న కోర్టు విచారించింది. చివరకు తాళం పగులగొట్టేందుకు అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదివారం ఉదయం 11గంటలకు టెక్నీషియన్ల సాయంతో తాళం పగులగొట్టారు. 17 ఏ, 17సీ డాక్యుమెంట్లు, సీసీ పుటేజీలు, రికార్డులను కోర్టుకు నివేదించేందుకు నివేదిక సిద్ధం చేస్తున్నారు. కాగా, గుర్తింపు కార్డులు ఉన్నవారినే స్ట్రాంగ్‌రూమ్‌లోకి అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, స్ట్రాంగ్‌రూమ్ తాళం పగులగొట్టే సమయం నుంచి ట్రంకు పెట్టెలు తెరిచేవరకూ ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా వీడియోలో చిత్రీకరించారు. స్కానర్లు, ప్రింటర్ల సాయంతో బూత్‌ల వారీగా డాక్యుమెంట్లను ప్రింట్ చేసి, సీల్డ్ కవర్లలో హైకోర్టుకు సమర్పించేందుకు సిద్ధం చేస్తున్నారు. కాగా, మొత్తం 20 ట్రంకు పెట్టెలు ఉండగా, కేవలం 4 ట్రంకు పెట్టెలకే తాళాలు వేసి ఉన్నాయని, వాటినే తెరిచారని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు.

సీఎం పదవి దక్కదనే రేవంత్‌రెడ్డికి కన్నీళ్లు

- కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కేసీఆర్ చేతుల్లోకి వెళ్లిపోయింది
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లే: బండి సంజయ్



ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వర విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బండి సంజయ్, ఈటల

కవాడిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కేసీఆర్ చేతుల్లోకి వెళ్లిపోయిందని, ఈ నేపథ్యంలో తన పీసీసీ పదవి పోవడంతో పాటు సీఎం పదవి దక్కదన్న బాధతోనే రేవంత్‌రెడ్డికి కన్నీళ్లు వచ్చాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారని ఈటల రాజేందర్ అన్నారే తప్పా.. రేవంత్‌రెడ్డికి ఇచ్చారని ఎక్కడా అనలేదని ఆయన స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ అన్నమాటలో తప్పేముందని బండి ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లేనని ఆయన అన్నారు. ఆదివారం మహాత్మ బసవేశ్వర 890వ జయంతిని పురస్కరించుకొని ట్యాంక్‌బండ్‌పై ఉన్న బసవేశ్వర విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎంపీ కె.లక్ష్మణ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటతో రేవంత్‌రెడ్డి ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని చెబుతున్నారని పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీఎం కేసీఆర్ ఆర్థిక సహాయం చేస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వద్ద కాంగ్రెస్ పార్టీ డబ్బులు తీసుకున్న మాట వాస్తవమని, మునుగోడులో ఇదే విషయం ప్రచారం జరుగుతోందని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు ఓటు వేసినట్లేనని.. ఇదే మాటను గతంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డిలు స్పష్టం చేశారని బండి సంజయ్ గుర్తు చేశారు. తెలంగాణకు బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అవసరమా అని ప్రశ్నించారు. కాగా, వీరశైవలింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు బీజేపీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

నాకు, ఆయనకు పోలికేంటి: మీడియాతో ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని బీజేపీ శాసనసభ్యుడు ఈటల రాజేందర్ సూచించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవితంలో ఇప్పటివరకు తను ఒక్కసారి కూడా సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు పెట్టలేదని, నిర్మాణం జరుగుతున్న ఇళ్ల వద్ద ధర్నాలు చేయలేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఏయే ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లాడో చెప్పాలన్నారు. తనకు విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లిన చరిత్ర ఉందని, రేవంత్‌తో తనకు పోలిక ఏమాత్రం సరికాదని పేర్కొన్నారు. ఉద్యమాలు చేయాలంటే టీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న దుర్మార్గాల మీద కొట్లాడాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు భారీగా దెబ్బతిన్నాయని, కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కసారి కూడా పరిహారం ఇవ్వలేదని ఈటల ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ధీరుడి వలె ఉద్యమిస్తానని చెప్పి ఏడుస్తున్నాడని, రేవంత్ ఏడుస్తున్నప్పుడు కూడా సంస్కార హీనంగా మాట్లాడాడని మండిపడ్డారు. రేవంత్ ఏడ్చింది ఈటల రాజేందర్ కోసం కాదని, సీఎం కావాలనుకున్న తన కల కల్లలైందని ఏడ్చాడన్నారు. కౌశిక్ ఒక మెంటల్ కేసు అని, బీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు డబ్బులు పంపిణీ చేశాడని, అలాంటివారందరినీ కేసీఆర్ దగ్గరకు చేర్చుకున్నాడన్నారు.

రేవంత్‌పై బురదజల్లేందుకే రాజేందర్ వ్యాఖ్యలు!

- ప్రజలను తప్పుదోవపట్టిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- హనుమకొండ జిల్లాలో పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి, వరంగల్: బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క భగ్గుమన్నారు. తనది ప్రగతిశీల భావజాలమని చెప్పుకునే ఈటల రాజేందర్, తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్‌పై అభాండాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బురద జల్లే విధంగా ఈటల వ్యాఖ్యలు చేశారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం భీంపల్లికి చేరింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ ఉండకూడదని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఎజెండాలో భాగంగానే.. ముగిసిపోయిన మునుగోడు ఎన్నికలపై ఈటల మాట్లాడారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీలో ఈటల రాజేందర్ కూడా అతిపెద్ద వాటాదారుడేనన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి.. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా ఉండటానికి బీజేపీ, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకంలో భాగమే ఎమ్మెల్యే ఈటల వ్యాఖ్యలన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన ప్రధాని మోదీ, ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తుంటే.. బంగారు తెలంగాణ చేస్తానన్న సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ దోపిడీ చేసిన సొమ్మును కక్కిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు నాయిని రాజేందర్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, బల్మూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





స్నేహితుడంటే ఎవరు?
రెండు శరీరాల్లో నివసిస్తున్న ఒకే ఆత్మ.
- అరిస్టాటిల్

సాక్షి

సోమవారం, 24 ఏప్రిల్ 2023

ఆంగ్లంలోకి ఎత్తిపోయాలి!

అవార్డు వచ్చిందే అత్యుత్తమ రచన కాకపోవచ్చు. అత్యుత్తమ రచనలన్నింటికీ అవార్డులు రాకపోవచ్చు. కానీ అవార్డు వచ్చింది సాధారణంగా మంచి పుస్తకమే అయివుండొచ్చు. ఒకవేళ ఈ వాక్యాలతో ఏమైనా విభేదించే అవకాశం ఉన్నా, అవార్డు వచ్చిన పుస్తకం ఎంతోకొంత ఆసక్తి కలిగింపజేస్తుందనే విషయంలో మాత్రం ఏ విభేదం లేదు. అవార్డు ఎంత పెద్దదైతే, అంత ఆసక్తి. ఆ భారీతనం వరుస సంవత్సరాలుగా ఇస్తుండటం వల్ల వచ్చిన ప్రతిష్ఠరూపంలో ఉండొచ్చు, లేదా పారితోషికం రూపంలో ఉండొచ్చు. ఏమైనా ప్రస్తుతం, 'భారతదేశపు అత్యంత విలువైన సాహిత్య బహుమానం'గా 'జేసీబీ ప్రైజు'ను పేర్కొంటున్నారు. అక్షరాలా ఈ పురస్కార విలువ పాతిక లక్షల రూపాయలు. గొప్ప భారతీయ రచనలను ఉత్సవం చేయాలనే ఉద్దేశంతో నెలకొల్పిన 'ద జేసీబీ ప్రైజ్ ఫర్ లిటరేచర్' ప్రత్యేకతలు ఏమంటే, ఇంగ్లిష్ రచనలకే బహుమానం ఇస్తున్నప్పటికీ, ఇంగ్లిష్ అనువాదాలను కూడా పరిగణనలోకి తీసుకోవడం; ఇంకా ఆసక్తికరమైనది, ఒకవేళ అనువాద రచన బహుమానం గెలుచుకుంటే, అనువాదకులకు అదనంగా మరో పది లక్షలు ఇవ్వడం.

''గతంలో ఒక కొత్త ఉర్దూ నవల విడుదలయ్యిందంటే– విద్యార్థులు, అధ్యాపకులు దాని గురించి చర్చించుకునేవాళ్లు. ఇప్పుడు, దానికొక అవార్డు వచ్చి కొంత పాపులర్ అయితే తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదు. అదొక ధోరణిలా మారిపోయింది. విశ్వవిద్యాలయాలు ఒకప్పుడు జ్ఞానాన్ని సృష్టించేవి. ఇప్పుడవి కేవలం పంపిణీ చేస్తున్నాయి,'' అంటారు ఉర్దూ నవలా రచయిత ఖాలిద్ జావేద్. 2022లో 'ద ప్యారడైజ్ ఆఫ్ ఫుడ్' నవలకుగానూ ఆయన 'జేసీబీ ప్రైజ్'ను స్వీకరించారు. 'నేమత్ ఖానా' పేరుతో వచ్చిన ఈ ఉర్దూ మూల నవలను బరన్ ఫారూఖీ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. ఖాలిద్ ఆవేదన ఉర్దూ సాహిత్య రంగం గురించినదే అయినప్పటికీ అది దేశంలోని అన్ని భాషలకూ వర్తిస్తుంది. అందుకే అవార్డులు, పురస్కారాలు అనేవి సాహిత్యంలో ఎంతోకొంత ఊపును సృష్టించగలుగుతాయి. వాటి పరిమితులను మినహాయిస్తే, అదొక సానుకూలాంశం. అందువల్లే వంటిల్లు నేపథ్యంలో జరిగే అధికార క్రీడనూ... కత్తులు, మంట వంటి ప్రమాదకర ఆయుధాలను కలిగివుండే చోటునూ చిత్రించిన ఖాలిద్ ఉర్దూ నవల విస్తృత పాఠకలోకంలో చర్చనీయాంశంగా మారగలిగింది.

నిర్మాణ పనుల్లో; తవ్వకం, ఎత్తిపోత, కూల్చివేతల్లాంటి పనుల్లో వాడే 'జేసీబీ' గురించి మనకు తెలుసు. ఈ జేసీబీ అనేదే ఆ యంత్రానికి ఒక పేరులా స్థిరపడిపోయిందిగానీ అది ఒక సంస్థ పేరు. ఇంగ్లండ్ వ్యాపారవేత్త జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్ (జేసీబీ) తన పేరుతోనే నెలకొల్పిన కంపెనీ ఈ జేసీబీ. 2018 నుంచి ఈ సంస్థ భారతీయ రచనలకు బహుమానాలు ఇస్తోంది. మార్చ్ నెలలో ఎంట్రీలను ఆహ్వానిస్తారు. ఏప్రిల్ 30 ఈ యేటి ఎంట్రీలు పంపడానికి ఆఖరి తేదీ. వారి వెబ్‌సైట్‌లో అన్ని వివరాలూ లభిస్తాయి. కథలు, కవిత్వ సంపుటాలు కాకుండా 'యూనిఫైడ్ వర్క్' మాత్రమే దీనికి పంపాలి. సాధారణంగా సెప్టెంబర్‌లో లాంగ్ లిస్ట్ విడుదలవుతుంది. అంటే వచ్చిన రచనల్లో తొలి వడపోతలో మిగిలిన పదింటిని ప్రకటిస్తారు. అక్టోబర్‌లో షార్ట్ లిస్ట్ వస్తుంది. అప్పటికి ఐదు నవలలు తుది పోటీలో ఉంటాయి. నవంబర్‌లో విజేతను ప్రకటిస్తారు. దీనికిగానూ ప్రతి యేటా ఒక స్వతంత్ర జ్యూరీ ఏర్పాటు అవుతుంది.

ఇప్పటికి మూడు సంవత్సరాలు ముగ్గురు మలయాళ రచయితలు ఈ బహుమానం గెలుచుకోవడం విశేషం. మలయాళ చిత్ర పరిశ్రమలాగే, మలయాళ సాహిత్యం కూడా వర్ధిల్లుతోందని చెప్పడానికి ఇదొక సాక్ష్యం. కాదు, మలయాళ సాహిత్యం వర్ధిల్లుతున్నందుకే మలయాళ చిత్రసీమ వర్ధిల్లుతున్నదని అనాలేమో! తన 'జాస్మిన్ డేస్' నవలకుగానూ బెన్యామిన్ 2018లో 'జేసీబీ' తొలి బహుమానాన్ని గెలుచుకున్నారు. దీన్ని షెహనాజ్ హబీబ్ ఆంగ్లంలోకి అనువదించారు. 2020 సంవత్సరానికి 'ముస్తాష్' నవలకుగానూ ప్రైజ్ గెలుచుకున్న ఎస్.హరీశ్ ఇటీవలి మలయాళ కళాఖండం అనదగిన సినిమా 'నన్ పగల్ నేరత్తు మయక్కమ్'(పగటి వేళ మైకం)కు రచయిత కావడం విశేషం. హరీశ్ తన నవలను 'మీస' పేరుతో తన మాతృభాషలోనే రాశారు. అది ఆయన తొలి నవల కూడా. 2021లో మరో మలయాళ నవల 'ఢిల్లీ: ఎ సాలిలాక్వీ'ని కూడా ఈ ప్రైజ్ వరించింది. రచయిత ఎం.ముకుందన్. 2019లో 'ద ఫార్ ఫీల్డ్' నవలకుగానూ మాధురీ విజయ్ గెలుచుకున్నారు. ఈమె కర్ణాటకకు చెందినవారు. కానీ ఆంగ్లంలో రాస్తారు.

పేరుకు రెండు తెలుగు రాష్ట్రాలు ఉన్నాయిగానీ ఈ ఐదేళ్లలో ఏ ఒక్క తెలుగు పుస్తకం షార్ట్‌లిస్టు అటుండనీ, లాంగ్‌లిస్టులోకి కూడా రాలేదు. అసలు ఏ ఒక్కటైనా పోటీకి పంపారా అన్నదీ అనుమానమే. అంతకంటేముందు అసలు ఏ పుస్తకాలైనా ఇంగ్లిష్‌లోకి వెళ్తున్నాయా? పోనీ, వెళ్లాల్సినంతగా వెళ్తున్నాయా? అసలు మొత్తంగానే తెలుగు నవల భారతీయ పాఠకుల మనస్సులు గెలుచుకునేంత కళాత్మకంగా ఉంటోందా? ఉంటే, దాన్ని ఇంగ్లిష్‌లోకి చేర్చడంలో ఉన్న అడ్డంకులేమిటి? ఈ బహుమానం అనే కాదు, మన విలువను కట్టడానికి మరొకటైనా పరమ ప్రమాణం కాకపోవచ్చు. కానీ ఆ 'గేమ్'లో మనం అసలంటూ ఎందుకు లేము? దక్షిణాది వరకే పరిమితం అయితే– కన్నడ, తమిళం, మలయాళం అనగానే కొందరు రచయితల పేర్లయినా జాతీయ స్థాయిలో తెలుస్తాయి. అలా తెలిసే తెలుగు రచయితలు ఎవరున్నారు, ఎందరున్నారు? ఇలాంటివి జరగాలంటే ఎలాంటి సంస్థలు, వ్యవస్థలు చొరవ చూపాలి? ఇవన్నీ మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు. సావధానంగా జవాబులు వెతుక్కోవాల్సిన ప్రశ్నలు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.43 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** మృగశిర రా.2.30 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.6.56 నుండి 8.37 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** సా.5.08 నుండి 6.51 వరకు.
సూర్యోదయం : 5.43 ; **సూర్యాస్తమయం :** 6.13 ; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు;
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

ఈ హత్యల వెనుక ప్రశ్నలు ఎన్నో!

కామెంట్



కరణ్ థాపర్

అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్‌ల హత్య కేసులో విచారణ ముందుకు సాగితే కనుక... ఆ విచారణ వార్తలను రానున్న కొద్ది వారాల్లో మీడియాలో చదువుతున్నప్పుడు, లేదా చూస్తున్నప్పుడు కొన్ని ప్రశ్నల్ని మీ మదిలో మెదలనివ్వండి. జరిగింది ఏమిటన్న దానికి మనం దగ్గరవుతున్నామా లేక తప్పుదారి పడుతున్నామా అనే విషయాన్ని ఆ ప్రశ్నలు మీకు తెలియజేస్తాయి. సమాధానాలతో ప్రమేయం లేకుండా ప్రశ్నలకుండే ప్రాధాన్యం ప్రశ్నలకు ఎప్పుడూ ఉంటుంది. ఏం జరిగిందన్న విషయమై వాస్తవాన్ని రాబట్టేందుకు అదనంగా... ఎందుకు, ఎలా జరిగిందన్నది తెలుసుకునేందుకు మాత్రమే ముఖ్యం అయిన ప్రశ్నలు కాకపోవచ్చువి. రెండవ ముఖ్యమైన కారణం కూడా ఉంటుంది. జస్టిస్ లోకూర్ అన్నట్లు... "మునుపు ఎన్‌కౌంటర్ మరణాలు ఉంటుండగా... పోలీసు కస్టడీలో జరిగిన అతీక్, అష్రాఫ్‌ల హత్యలు బహుశా మొదటిసారి బయటి వ్యక్తులు చేసినవి.'' అందుకే అనేక ప్రశ్నలు మనల్ని చుట్టుముడతాయి.

బహుశా ఇది సందేహాస్పదమైన ప్రామాణికత గల కథోపాఖ్యానం వంటిది కావచ్చు. తాత్వికురాలు గెర్ట్రూడ్ స్టెయిన్స్ మరణశయ్యపై ఉండినప్పుడు... ''సమాధానాలు ఏమిటి?'' అని (ఆమె భర్త) ఆమెను అడిగారట. అప్పుడు ఆమె తీవ్ర ప్రయత్నంతో తనను తాను కూడదీసుకుని, ''మొదట ప్రశ్నలేమిటో అడగండి!'' అన్నారట! ఆమె ప్రశ్న స్పష్టమైనది, సరళమైనది. మీరు అడగడమే తప్పుగా ప్రశ్నలు అడిగితే మీరు ఎన్నటికీ నిజం ఏమిటన్న దానిని పొందలేరు. పోలీసు కస్టడీలో అత్యంత భయానకంగా, నిర్దాక్షిణ్యంగా, వ్యవస్థకే తలవంపుగా జరిగిన అతీక్ అహ్మద్, అతడి సోదరుడు అష్రాఫ్‌ల హత్య కేసు విచారణలో కూడా ఇదే రకమైన ప్రశ్నల ఆలోచనా విధానం ప్రధానంగా ఉండాలి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రఖ్యాతి గాంచి, పదవీ విరమణ పొందిన వారిలో ఒకరైన జస్టిస్ మదన్ లోకూర్‌తో నేను జరిపిన సంభాషణలో ఆయన లేవనెత్తిన అనేక చిక్కుముడి ప్రశ్నలను ఇప్పుడు మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. చాలా విషయాల్లో జరిగిన తప్పులను ఎత్తిచూపిన ప్రశ్నలవి. అందుకే అవి సత్యానికి తోవ చూపే జాడలు. అతీక్, అష్రాఫ్‌ల హత్య కేసు విచారణ, విచారణ ఫలితాల వెల్లడింపు వార్తలను రానున్న కొద్ది వారాల్లో మీరు చదివేటప్పుడు ఈ ప్రశ్నలను మదిలో ఉంచుకోండి. జరిగింది ఏమిటన్న దానికి మనం దగ్గరవుతున్నామా లేక తప్పుదారి పడుతున్నామా అనే విషయాన్ని ఆ ప్రశ్నలు మీకు తెలియజేస్తాయి.

మొదటి ప్రశ్న. రాత్రి గం.10.30 సమయంలో అతీక్, అష్రాఫ్ సోదరులను వైద్య పరీక్షల కోసం తీసుకెళ్లాల్సిన అవసరం ఏమిటి? 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' చెబుతున్న దానిని బట్టి అతీక్, అష్రాఫ్‌లను ఉంచిన నైనీ జైలు తలుపులను విధిగా సాయంత్రం 6 గంటలకు మూసివేస్తారు. వైద్య చికిత్స అందించవలసిన అత్యవసర పరిస్థితి లేనప్పుడు జైలు వేళల్ని



హత్యకు కొద్ది క్షణాల ముందు అతీక్ అహ్మద్ (కుడి), అష్రాఫ్ (ఎడమ)

ఉల్లంఘించి మరీ ఎందుకు వారిద్దరినీ బయటికి తీసుకువచ్చారు? వారి పోలీసు కస్టడీ ముగియడానికి మర్నాడు ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉన్నప్పుడు, వారిని ఆదివారం ఉదయం వైద్య పరీక్షలకు తీసుకెళ్లి ఉండవచ్చు కదా! అంతవరకు ఎందుకు ఆగలేదు?

రెండవది. వాళ్ళిద్దర్ని తీసుకెళుతున్న పోలీస్ జీపు ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశించకుండా ఆసుపత్రి బయట ఉన్న మైదానంలోనే ఎందుకు ఆగిపోయింది? ఆసుపత్రి లోపల పార్కింగ్‌కి చోటు ఉన్నప్పుడు వాళ్లను బయటే దింపి, లోపలికి నడిపించుకుని వెళ్లవలసిన అవసరం ఏముంది? నిజానికి అలా చేయడం అనవసరంగా ప్రమాదానికి తావు కల్పించడమే!

మూడవది. ఆ ఇద్దర్నీ చుట్టుముట్టి ప్రశ్నలు అడిగేందుకు మీడియాను ఎందుకు అనుమతించారు? అయినా రాత్రి 10.30కి వారిని వైద్య పరీక్షలకు తీసుకెళుతున్నట్లు మీడియాకు ఎలా తెలిసింది? ఏ ఆసుపత్రికి తీసుకెళుతున్నారో వాళ్లెలా తెలుసుకోగలిగారు? ఎవరైనా సమాచారం అందించారా? అయితే ఆ అందించిన వారెవరు?

నాల్గవది. రాత్రి పూట అతీక్, అష్రాఫ్‌లను వైద్య పరీలకు తీసుకెళుతున్నట్లు హంతకులకు ఎలా తెలుసు? ఏ ఆసుపత్రికి తీసుకెళుతున్నారో వాళ్లెలా కనిపెట్టగలిగారు? హంతకులు న్యూస్ కెమెరామన్‌ల వేషంలో వచ్చారంటే మీడియా అక్కడికి వస్తుందని ముందే వారికి ఎలా తెలిసింది? ఎవరైనా ఉప్పందించారా? అందిస్తే ఎవరు?

ఐదవది, 'టైమ్స్ ఆఫ్ ఇండియా' చెబుతున్న ప్రకారం 22 సెకన్ల పాటు కాల్పులు కొనసాగాయి. ఆ వ్యవధిలో 14 రౌండ్ల కాల్పులు జరిగాయి. హత్యకు పాల్పడిన ముగ్గురూ వృత్తి ప్రావీణ్యం గలవారిలా కనిపించారని కూడా ఆ పత్రిక రాసింది. అంటే హంతకులు తుపాకీ కాల్చడంలో శిక్షణ పొందినవారా? 7 లక్షల రూపాయల ఖరీదైన టర్కీ పిస్టల్ వారిలో ఒకరి చేతికి ఎలా వచ్చింది? ఈ ప్రశ్న మరింత ముఖ్యమైనది... టర్కీ పిస్టల్స్‌ని ఇండియా నిషేధించడం కనుక నిజమైతే!

ఆరవది. ఎస్కార్ట్ పోలీసులు ఆయుధాలు కలిగి ఉన్నారా? కలిగి ఉంటే, వాళ్లెందుకు తిరిగి కాల్పులు జరపలేదు? ఆయుధాలు లేకుంటే ఎందుకు లేవు? అతీక్‌ను చంపేస్తామనే బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, అతడికి సాయుధ భద్రత అవసరం అనీ వారికి నిర్ధారణగా తెలిసి కూడా ఎందుకు భద్రతను కల్పించలేదు? భద్రతను అందించకపోవడం నేరపూరితమైన బాధ్యతారాహిత్యంతో సమానం కదా?

ఏడవ ప్రశ్న. హంతకులను పోలీసులు ఎందుకని పోలీస్ కస్టడీకి ఇవ్వమని అడగలేదు? బదులుగా జ్యుడీషియల్ రిమాండ్‌కు ఎందుకు సమ్మతించారు? హంతకులను ప్రశ్నించి, తదుపరి విచారణ జరపవలసిన అవసరం లేదా? అవసరం లేదనుకుంటే, పోలీసులకు ముందే అంతా తెలుసు కనుక... తెలుసుకోడానికి కస్టడీకి తీసుకోవలసిన అవసరం ఏముంది అనే సంకేతం రావడం లేదా? అదే నిజమైతే వారికి ప్రతిదీ ఎలా తెలుసు (ఎందుకు తెలుస్తోంది అని కూడా) అనే ప్రశ్న వస్తుంది.

ఏం జరిగిందన్న విషయమై వాస్తవాన్ని రాబట్టేందుకు అదనంగా... ఎందుకు, ఎలా జరిగిందన్నవి తెలుసుకునేందుకు మాత్రమే ఇవి ముఖ్యమైన ప్రశ్నలు కావు. రెండవ ముఖ్యమైన కారణం కూడా ఉంది. జస్టిస్ లోకూర్ అన్నట్లు... ''మునుపు ఎన్‌కౌంటర్ మరణాలు ఉంటుండగా... పోలీసు కస్టడీలో గత శనివారం రాత్రి (ఏప్రిల్ 15) అతీక్, అష్రాఫ్‌లపై జరిగినవి బహుశా మొదటిసారి బయటి వ్యక్తులు చేసిన హత్యలు.'' ఇలా జరగడమే భయానకం, కలవరపాటు, సిగ్గు చేటు.

ఇలా మళ్లీ జరగకుండా చూసుకోవాలి. లేదంటే ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం అని చాటుకునే మన ప్రగల్భాలు– 'ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది' అనే తక్కువ సమర్థనీయమైన మాటనైతే పక్కన పెట్టేయండి – నకిలీలా, బోలుగా ధ్వనిస్తాయి. అందుకే జస్టిస్ లోకూర్ ప్రశ్నలు ముఖ్యమైనవి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అటూ పోయాయి!



క్రీ.పూ. 6,000-2,000 సంవత్సరాల మధ్య మూపురం ఉన్న ఎడ్లు, ఎనుములు, ఏనుగులు, లంగూర్ కోతులు, కోళ్లు, నెమళ్లు, కుక్కలు, ఆఖరికి ఎలుకలు కూడా ఇండియా నుంచి 'బయటికి'– పశ్చిమాసియా, స్టెప్పీలకు వెళ్లాయి. అయినప్పటికీ ప్రపంచ మేధావులు, ఎంతోమంది భారతీయులు భారీ భాషా కుటుంబాలు, తెగలు కేవలం ఇండియా 'లోకి' మాత్రమే వచ్చాయని నమ్ముతారు. భవిష్యత్ చరిత్రకారులు నవ్వుతారు!

– జోసెఫ్ టి. నూనీ, విశ్లేషకుడు

అవి యాపిల్స్ కాదా?



నాకు ఇప్పటిదాకా వేర్వేరు షాపింగ్ మాల్స్‌లో ఐప్యాడ్, ఐఫోన్, మ్యాక్‌బుక్ లాంటి యాపిల్ ఉత్పత్తులు అమ్ముతున్నవి యాపిల్ స్టోర్లు కాదని తెలీదు. జోక్ కాదు, నిజం చెబుతున్నా. (కొత్తగా ప్రారంభమైనవి కంపెనీ సొంతంగా నడిపే స్టోర్లు.)

– సంజుక్తా బసు, సంపాదకురాలు

ఎండలు బాబోయ్!



వాతావరణం గురించి మాట్లాడి బోర్‌కొట్టించే వ్యక్తిగా ఉంటున్నందుకు సారీ. కానీ ఓ మై గాడ్! ముంబయిలో భరించలేనంత వేడిగా ఉంది.

– నయోమీ దత్తా, రచయిత్రి

బాధగా ఉండదూ!



గత నాలుగేళ్లలో అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ 1,49,000 మంది భారతీయులు దొరికిపోయారు. వాళ్లను జో బైడెన్, కమలా హ్యారిస్ 'చెదలు' అని పిలిస్తే ఎలా ఉంటుంది? (రోహింగ్యాలపై విసుర్లను అన్యాపదేశంగా ప్రస్తావిస్తూ)

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఇవ్వడమే మేలు



మధుమేహం ఉన్న తల్లులు పాలివ్వడం అనారోగ్యకరం అని చాలామంది అనుకుంటారు. నిజానికి, పాలివ్వడం వల్ల తల్లీ, నవజాత శిశువు – ఇద్దరికీ లాభకరం. పాలివ్వడం పిల్లల్ని స్థూలకాయం, టైప్ 2 మధుమేహం నుంచి కాపాడుతుందని దీర్ఘకాల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

– వి. మోహన్, డయాబెటిస్ స్పెషలిస్ట్

ఏడ్చేశాం



చాలా ఏళ్లుగా కలవని ఒక స్నేహితుడు ఉన్నట్టుండి కనబడ్డాడు. మాటల్లో వాళ్ల నాన్న పోయారని చెప్పాడు. తల్లిదండ్రుల్ని కోల్పోయిన చాలామంది స్నేహితులు ఇంతకుముందూ తెలుసు. కానీ ఈసారి మాత్రం ఈ వార్త గట్టిగా తాకింది. మనందరికీ తెలుసు, ఇలాంటివి ఏదోరోజు ఎదుర్కోవాల్సి ఉంటుందని! కానీ ఎవరమూ సిద్ధంగా ఉండం. తనూ లేడు, నేనూ లేను. గుండె పగిలింది.

– నతాషా ఫతాహ్, జర్నలిస్ట్

చారిత్రక జిత్తులు



ఏ జనాన్నయినా గెలవాలనుకుంటే– వాళ్ల జాతి, వాళ్ల వారసత్వం, వాళ్ల సంస్కృతి, ఆధ్యాత్మికతలను రాక్షసమైనవని ఒప్పించాలి. వాళ్ల ప్రాచీనులు అనాగరికులని చెప్పాలి. ఆఫ్రికా విషయంలో జరిగింది ఇదే. మన చదువులు మన మూలాలకు సంబంధించిన ప్రేమను నాశనం చేశాయి.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

ఇన్‌బాక్స్

'లింక్' కోసం డబ్బులా?

పాన్ కార్డును ఆధార్‌కు అనుసంధానం (లింక్) చేయనందుకు కేంద్ర ప్రభుత్వం జరిమానా విధించడం న్యాయం కాదు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచీ జూన్ నెలాఖరు వరకు ఈ లింక్‌ను చేయించుకోవడానికి అనుమతిస్తూ రూ. 1,000 జరిమానాగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికితోడు... లింక్ చేయడానికి వంద, రెండు వందల రూపాయలు 'మీ సేవా' కేంద్రాలలో తీసుకొంటున్నారు. పాన్ కార్డు అంటేనే సామాన్యులలో అత్యధికులకు తెలియదు. పాన్ కార్డు ఆధార్‌కు లింకు చేయకపోతే జూలై నుంచి తమ బ్యాంకు ఖాతా రద్దవుతుందని ఇంకా ఎక్కువ మందికి తెలియదు. ఇన్‌కమ్ టాక్స్ పరిధిలోకి రానివారి పాన్ కార్డ్‌ను ఆధార్‌తో లింక్ చేయాల్సిన అవసరం ఏమిటని చాలామంది మధ్యతరగతివారు ప్రశ్నిస్తున్నారు. అనేక మంది సామాన్యుల దగ్గర ఈ విషయాలను ప్రస్తావిస్తే తమకు ఈ విషయాలేవీ తెలియవన్నారు. ఈ సంగతి సామాన్యులకే కాదు. నిత్యం పేపర్లు చదివేవారికి, టీవీ వార్తలు చూసేవారికి కూడా తెలియక పోవడం గమనార్హం.

అంటే ఆధార్‌కు పాన్‌ను లింక్ చేయాలనే విషయంపై తగిన ప్రచారం జరగలేదన్నమాట. విస్తృత ప్రచారం చేయకుండా జరిమానా వేయడాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించుకోవడం గర్హనీయం. జీరో ఎకౌంట్ వల్ల, డ్వాక్రా గ్రూపుల వల్ల ప్రతి కుటుంబానికి కనీసం రెండు బ్యాంకు ఎకౌంట్లు ఉన్నాయి. బ్యాంకులలో జీరో ఎకౌంటు తెరిచి లావాదేవీలు జరిపితే పది వేల రూపాయల వరకు అప్పు ఇస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అది అమలుకు నోచుకోలేదు.


జీరో ఎకౌంట్‌లో కూడా కనీస నగదు ఉంటేనే లావాదేవీలు జరుగుతాయని బ్యాంకు అధికారులు అనడంతో ఖాతాదారులు కనీస నగదును ఎకౌంట్‌లో ఉంచవలసి వచ్చింది. దీంతో బ్యాంకులకు కోట్లాది రూపాయలు చేరినట్లు వార్తలు వచ్చాయి. ఇదే సమయంలో కార్పొరేట్ కంపెనీలకు మాత్రం 10 లక్షల కోట్ల రూపాయల పైగా రుణమాఫీ చేశారు. కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచీ 22 శాతానికి తగ్గించారు. కాకులను కొట్టి గద్దలకు వేయడమంటే ఇదే! సామాన్యుని పాన్ కార్డ్‌ను ఆధార్‌కు లింకు చేయాలనే నిబంధనను రద్దు చేయాలి. లేదా జరిమానా రద్దు చేయాలి.

– బి.బి. రామకృష్ణారావు; సామర్లకోట, కాకినాడ జిల్లా

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇది పాక్ నుంచి మనం నేర్చుకోవాల్సిందే!

అభిప్రాయం



మంగారి రాజేందర్

పాకిస్తాన్ నుంచి భారతదేశం నేర్చుకునే విషయాలు చాలా తక్కువ. కానీ ఆ దేశం నుంచి కూడా మనం నేర్చుకునే విషయాలు ఉన్నాయని లాహోర్ హైకోర్టు ఈ మధ్య ఇచ్చిన 'రాజద్రోహం రద్దు' తీర్పు చూసిన తరువాత అనిపిస్తుంది. పాకిస్తాన్ పీనల్ కోడ్‌లో ఉన్న సెక్షన్ 124(ఏ) అనేది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తీర్పును ప్రకటించింది. ఆ నిబంధన దుర్వినియోగం అవుతోందనీ, అది వలసవాదులు వదిలిన అవశేషమనీ లాహోర్ హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వాలు తమ ప్రత్యర్థులకి వ్యతిరేకంగా ఈ నిబంధనను ఉపయోగిస్తున్నాయని దాఖలైన బ్యాచ్ పిటిషన్లను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి షాహిద్ కరీమ్ ఈ నిబంధనను రద్దు చేశారు.

పాకిస్తాన్ మాజీ నియంత జనరల్ పర్వేజ్ ముషారఫ్ 2007వ సంవత్సరంలో రాజ్యాంగాన్ని తారుమారు చేసినందుకు... 2019వ సంవత్సరంలో ఆయనను దోషిగా నిర్ధారించి, మరణశిక్షను విధించిన న్యాయమూర్తి జస్టిస్ కరీం. మన దేశం, పాకిస్తాన్ ఇరుదేశాలూ ఈ నిబంధనను బ్రిటిష్ వాళ్ళ దగ్గర నుంచి వారసత్వంగా పొందినవే. భారతీయులను అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం తయారు చేసిన నిబంధన సెక్షన్ 124(ఏ). భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచిన వ్యక్తులనూ, అదే విధంగా అప్పుడు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గొంతెత్తిన వ్యక్తులనూ అణచి వేయడానికి తయారు చేసిన నిబంధన ఇది. మహాత్మాగాంధీ, బాల గంగాధర్ తిలక్ లాంటి వ్యక్తులు అందరూ ఈ నిబంధన బాధితులే.

సెక్షన్ 124 (ఏ) నిబంధనను సుప్రీంకోర్టు గత సంవత్సరం రద్దు చేసింది. అంటే కేంద్ర ప్రభుత్వం ఈ నిబంధనను పునఃపరిశీలించే వరకు ఈ నిబంధనను ఆపేసింది. సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఈ నిబంధన కింద కేసులను నమోదు చేయకూడదు. దీని కింద అభియోగాలు ఉన్న అన్ని విచారణలనూ, అప్పీళ్లనూ, ఇతర ప్రొసీడింగ్స్‌నూ ఉపసంహరించుకోవాలని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం భారత ప్రభుత్వాన్ని కోరింది. భారత ప్రభుత్వం దీనిని ఉపసంహరించడానికి ఎలాంటి ఆసక్తినీ కనబరచడం లేదు. సుప్రీంకోర్టు చెప్పినట్టు భారత ప్రభుత్వం పునఃపరిశీలన కూడా చేయలేదు. మన సుప్రీంకోర్టు భారత ప్రభుత్వాన్ని ఈ నిబంధనను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని లేదా పరిశీలించాలని చెప్పింది. కానీ రద్దు చేయలేదు. కానీ పాకిస్తాన్ హైకోర్టు మన సుప్రీంకోర్టు కన్నా నాలుగు అడుగులు ముందుకు వేసి దీనిని రద్దు చేసింది. అది రాజ్యాంగ విరుద్ధమని కూడా ప్రకటించింది. అందుకని మనం ఈ విషయంలో పాకిస్తాన్ నుంచి నేర్చుకోవాల్సి ఉంది.

సెక్షన్ 124 (ఏ) అనేది మన దేశంలో, పాకిస్తాన్‌లో ఒకే విధంగా ఉంది. ఎవరైనా, మాటల ద్వారా, ద్వేషం వల్ల ధిక్కారాన్ని తీసుకొని రావడానికి ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వం పట్ల అసంతృప్తిని ప్రేరేపించడానికి లేదా ప్రేరేపించ ప్రయత్నం చేసినా... వాళ్ళను ఈ నిబంధన కింద శిక్షించడానికి అవకాశం ఉంది. 1962వ సంవత్సరంలో 'కేదార్‌నాథ్' కేసులో ఈ నిబంధన చెల్లుబాటును సుప్రీంకోర్టు సమర్థించింది. కానీ దీని పరిధిని పరిమితం చేసింది.

అశాంతి సృష్టించే ఉద్దేశంతో లేదా హింసను



ప్రేరేపించే చర్యలకు మాత్రమే ఈ నిబంధనను పరిమితం చేయాలని కోర్టు నిర్దేశించింది. కానీ పాలకులు దీన్ని పట్టించుకోలేదు. నిబంధనలో ఉన్న అంశాలను అక్షరాలా అర్థం చేసుకున్నారు. ప్రభుత్వానికి, దేశానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించలేదు. నినాదాలు చేసినందుకు, శాంతియుతంగా నిరసన తెలిపినా, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పోస్టులను పెట్టినా వారిపై తరచూ దేశద్రోహ కేసులను నమోదు చేస్తున్నారు.

ఈ మధ్యకాలంలో ఇలాంటి కేసుల సంఖ్య పెరిగిపోయింది. దేశ పౌరులను బెదిరించడం సర్వసాధారణమై పోయింది. పాకిస్తాన్‌లో నెలకొని ఉన్న ప్రస్తుత రాజకీయ గందరగోళంలో ఈ నిబంధనను రద్దు చేయడం చరిత్రాత్మకమైన విషయంగా పేర్కొనవచ్చు. మన దేశంలో అలాంటి పరిస్థితులు లేవు. భారత పౌరుల హక్కులను ఇది కాలరాస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది ఉండటానికి వీల్లేదు. చాలా ప్రజాస్వామ్య దేశాలు దీన్ని రద్దు చేశాయి. పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి ఈ నిబంధన రద్దు గురించి స్పందన కన్పించలేదు. కానీ ఆ దేశంలోని రాజకీయ పక్షాలు, పౌరులు, జర్నలిస్టులు, న్యాయవాదులు ఈ తీర్పును స్వాగతిస్తున్నారు. పాకిస్తాన్‌లోని మానవ హక్కుల కమిషన్ కూడా ఈ రద్దును స్వాగతించింది.

భారత ప్రభుత్వం బ్రిటిష్ వాళ్ల దగ్గర నుంచి మనకు సంక్రమించిన చాలా శాసనాలను పురాతనమైనవిగా భావించి రద్దు చేసింది. దాదాపుగా 1500 చట్టాలను తొలగించింది. కాని, ఈ నిబంధనను తొలగించడానికి ఉత్సుకత చూపించడం లేదు. భారతదేశ మొదటి ప్రధాని దీని బాధితుడే. కానీ – భారత రాజ్యాంగానికి చేసిన మొదటి సవరణ ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛకు పరిమితులు ఏర్పడినాయి. ఇందిరాగాంధీ హయాంలో సెక్షన్ 124 (ఏ)ను కాగ్నిజబుల్ నేరంగా మార్చారు. అది 1974 నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ నిబంధన దుర్వినియోగం జరుగుతున్నా పాలకులు దీనిని తొలగించడానికి ఇష్టపడడం లేదు. లాహోర్ హైకోర్టు తీర్పుతోనైనా మన దేశంలోనూ దీనిని త్వరగా తొలగిస్తే మన ప్రజాస్వామ్యానికి మేలు జరుగుతుంది.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

హక్కులను కాలరాస్తే అగ్గిరాజేస్తాం



సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు

నల్లగొండ టౌన్: బీసీల హక్కులను కాలరాస్తే దేశవ్యాప్తంగా అగ్గిరాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బీసీల కులగణన చేపట్టాలని ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన అనేది బీసీల హక్కు అని, బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు కులగణనకు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. కులగణనపై మే మొదటివారంలో దేశంలోని మేధావులతో హైదరాబాద్‌లో మేధోమథన సదస్సు, మే రెండోవారంలో అమరావతి నుంచి హైదరాబాద్ వరకు బీసీ రథయాత్ర నిర్వహిస్తామని వెల్లడించారు. రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో బీసీ ఉద్యోగుల సదస్సు, కరీంనగర్‌లో విద్యార్థి, యువ జనుల సదస్సు, కామారెడ్డిలో మహిళల సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. బీసీల కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తు చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు బైరి రవికృష్ణ, చక్రహరి రామరాజు, శ్రీనివాస్‌ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, గొడుకు మహేశ్, చొల్లేటి ప్రభాకర్, కాంగ్రెస్ నేత చెరుకు సుధాకర్ పాల్గొన్నారు.

కులగణన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి



కాచిగూడ: జనగణనలో కులగణన కోసం ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కటై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం నిరంతర పోరాటంతో జనగణనలో కులగణన కోసం ప్రతిపక్ష పార్టీల మద్దతు కూడగట్టగలిగామన్నారు. కులాల వారి లెక్కలు తీయాలని 16 రాజకీయ పార్టీలు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవడం శుభ పరిణామమని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. బీసీ వ్యతిరేక వైఖరిని మానుకోవాలన్నారు. బీసీ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి కులాల వారీ జనాభా లెక్కలు ఉపయోగపడతాయని తెలిపారు. కురుబ, కురుమలకు బీసీ జాబితా నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని జబ్బల శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

పద్మశాలీలు ప్రణాళికతో ముందుకు సాగాలి



ఎల్.రమణ

కాచిగూడ (హైదరాబాద్): రాజ్‌మోహల్లా పద్మశాలి భవన్ కేంద్రంగా అభివృద్ధికి రాష్ట్రవ్యాప్త కార్యాచరణ ప్రణాళికతో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ముందుకు వెళ్లాలని మాజీమంత్రి, ఎమ్మెల్సీ ఎల్.రమణ పేర్కొన్నారు. ఆదివారం నారాయణగూడ, రాజ్‌మోహల్లా పద్మశాలి భవన్‌లో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు అధ్యక్షతన నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్.రమణ పాల్గొని మాట్లాడుతూ...కొత్తగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గం రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పద్మశాలిల్లో చైతన్యం తేవాలని కోరారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ...జూన్ 4న నగరంలో జరిగే పద్మశాలి శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడిగా మచ్చ ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కమర్తపు మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మా చెర్ల రాంచంద్రరావు, కోశాధికారిగా బొమ్మ రఘురాం నేత, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా గుంటక రూప ప్రమాణం చేశారు.

నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడి



కడెం: వీధికుక్క దాడిలో నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన గోపు సుహాని (4) ఆదివారం ఇంట్లోంచి బయటకు వచ్చిన క్రమంలో కుక్క దాడిచేసింది. చిన్నారి చెంపపై తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు బాలికను వెంటనే కడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ఎవరూ లేరు. అటెండర్ ఫోన్‌చేసి ఏఎన్‌ఎంకి సమాచారం ఇవ్వడంతో గంట తర్వాత వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్లపై కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ ఏర్పడే నాటికి వరి పంట ఉత్పత్తిలో దేశంలో తొమ్మిదో స్థానంలో ఉన్న రాష్ట్రం, ఇప్పుడు ఏకంగా రెండో స్థానానికి చేరుకుంది. 2022-23లో 156.31 లక్షల మెట్రిక్ టన్ను (ఎల్‌ఎంటీ)ల వరి ఉత్పత్తితో పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో ఉండగా.. 153.87 ఎల్‌ఎంటీల ఉత్పత్తితో తెలంగాణ ఆ తర్వాతి స్థానంలో నిలిచిందని కేంద్ర వ్యవసాయశాఖ నివేదిక వెల్లడించింది. 147.36 ఎల్‌ఎంటీలతో ఉత్తరప్రదేశ్, 135.88 ఎల్‌ఎంటీలతో పంజాబ్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. వాస్తవానికి 2019-20లో 74.28 ఎల్‌ఎంటీల ఉత్పత్తితో తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. ఆ ఏడాది పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. అయితే కేవలం నాలుగేళ్ల కాలంలో తెలంగాణ రెట్టింపు స్థాయిలో వరిని ఉత్పత్తి చేసిన రాష్ట్రంగా నిలిచిందని కేంద్రం తెలిపింది.

- సాక్షి, హైదరాబాద్

వరి సిరి పెరిగింది



వరి పంట ఉత్పత్తిలో దేశంలోనే రెండోస్థానంలో రాష్ట్రం

2022-23లో దాదాపు 154 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి

- కేవలం నాలుగేళ్ల కాలంలో రెట్టింపు ఉత్పత్తి
- పశ్చిమ బెంగాల్ తర్వాత తెలంగాణలోనే అధికం
- పత్తిలో మూడో స్థానం.. ఎర్ర మిర్చిలో ఫస్ట్ ప్లేస్
- కేంద్ర వ్యవసాయ శాఖ నివేదిక వెల్లడి

పత్తి, మిర్చిలోనూ అగ్రభాగాన..





పత్తి ఉత్పత్తిలో 54.41 లక్షల బేళ్లతో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. గుజరాత్ 87.12 లక్షల బేళ్లతో మొదటి స్థానంలో, మహారాష్ట్ర 81.85 లక్షల బేళ్లతో రెండో స్థానంలో నిలిచిందని కేంద్రం ప్రకటించింది. 2014-15లో తెలంగాణలో పత్తి ఉత్పత్తి 50.50 లక్షల బేళ్లు కాగా అప్పుడు కూడా దేశంలో మూడో స్థానంలో నిలిచింది. ఇక ఎర్ర మిర్చి ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. 2021-22లో 6.51 ఎల్‌ఎంటీల మిర్చి ఉత్పత్తి అయ్యిందని కేంద్రం తెలిపింది. 4.17 ఎల్‌ఎంటీలతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. 2014-15 సంవత్సరంలో తెలంగాణలో మిర్చి ఉత్పత్తి కేవలం 2.53 ఎల్‌ఎంటీలు మాత్రమే ఉండగా ఏటా పెరుగుతూ వచ్చింది. 2020-21లో 5.36 ఎల్‌ఎంటీల ఉత్పత్తి జరిగింది.


కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేశారు

వరి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో నిలవడం హర్షణీయం. మిర్చి మొదటి స్థానం, పత్తి మూడో స్థానంలో ఉండటం కూడా ఎంతో సంతోషకరం. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం, కాళేశ్వరంతో రిజర్వాయర్లు నిండిపోవడం, పుష్కలంగా నీటి వనరులు అందుబాటులోకి రావడం, ఉచితంగా 24 గంటలూ కరెంటు ఇవ్వడంతో రైతులు పెద్ద ఎత్తున సాగు విస్తీర్ణం పెంచారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేశారు. ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చైర్మన్, తెలంగాణ రైతుబంధు సమితి

2022-23 సీజన్‌లో అన్నీ రికార్డులే..

2022-23లో తెలంగాణ వరి ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలవడానికి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడమే ప్రధాన కారణం. వానాకాలం పంటల సాగు విస్తీర్ణం ఆల్ టైం రికార్డు సృష్టించింది. 2020 వానాకాలం సీజన్‌లో అత్యధికంగా 1,35,63,492 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు కాగా, 2022-23 వానాకాలం సీజన్‌లో 1,35,75,687 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వరి సాగు కూడా రికార్డు స్థాయిలో నమోదు అయ్యింది. 2021 వానాకాలంలో వరి సాగు విస్తీర్ణం 62.13 లక్షల ఎకరాలు కాగా, 2022-23 సీజన్‌లో ఏకంగా 64.31 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. తెలంగాణ రాకముందు 2013లో 29.16 లక్షల ఎకరాల్లో సాగు కాగా, ఇప్పుడు వానాకాలం సీజన్‌లో రెట్టింపునకు పైగా వరి సాగు కావడం విశేషం. అలాగే యాసంగిలోనూ ఆల్ టైం రికార్డులు నమోదయ్యాయి. 2020-21 యాసంగి సీజన్లో 68.17 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఆ రికార్డును బద్దలు కొడుతూ 2022-23 యాసంగి సీజన్‌లో 68.53 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈ యాసంగిలో వరి సాగు కూడా ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా 53.08 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి.



తెలంగాణలో

64,056 జల వనరులు

98.5% జల వనరులు గ్రామీణ ప్రాంతాల్లోనే..

- రాష్ట్రంలో 53,886 మానవ నిర్మిత జల వనరులు
- 3,032 జల వనరుల్లో ఆక్రమణలు
- కేంద్ర జలశక్తి శాఖ తొలి జల వనరుల సెన్సస్‌లో వెల్లడి



- సాక్షి, న్యూఢిల్లీ

తెలంగాణలో మొత్తం 64,056 జల వనరులు ఉన్నాయని.. వీటిలో 98.5% (63,064) గ్రామీణ ప్రాంతాల్లో, మిగిలిన 1.5% (992) పట్టణాల్లో ఉన్నాయని కేంద్ర జలశక్తి శాఖ విడుదల చేసిన తొలి జల వనరుల సెన్సస్ నివేదిక వెల్లడించింది. 80.5% (51,593) జల వనరులు ప్రభుత్వ యాజమాన్యంలో ఉండగా, 19.5% (12,463) ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నాయి. 17.3% (11,076) జల వనరులు 'కరువు పీడిత ప్రాంతాల కార్యక్రమం'కింద, 10.6% (6,781) గిరిజన ప్రాంతాల్లో, మిగిలిన 72.1% (46,199) వరద పీడిత ప్రాంతాలు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయి. అంతేగాక 64,056 జల వనరుల్లో 80.8% (51,733) వాడుకలో ఉండగా, 19.2% (12,323) ఎండిపోవడం, పూడిక తీయకపోవడం, మరమ్మతు చేయలేని విధంగా నాశనం కావడం, లవణీయత ఇతర కారణాల వల్ల ఉపయోగంలో లేవని నివేదికలో వెల్లడించారు.

నిండిన స్థితిలో 43,695 జల వనరులు

రాష్ట్రంలో 10,170 సహజసిద్ధమైన, 53,886 మానవ నిర్మిత జల వనరులు ఉన్నాయి. సహజ జల వనరుల్లో 96.2% (9,781) గ్రామీణ ప్రాంతాల్లో, 3.8% (389) పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. మానవ నిర్మిత జల వనరుల్లో 98.9% (53,283) పల్లెల్లో, 1.1% (603) పట్టణాల్లో ఉన్నాయి. రాష్ట్రంలోని 64,056 జల వనరుల్లో 43,695 వనరులు 'నిండిన నిల్వ సామర్థ్యం'/ 'నిండిన స్థితి'కలిగి ఉన్నాయి. గత ఐదేళ్లలో నిల్వ సామర్థ్యాన్ని పెంచడం లాంటి ప్రమాణాల ఆధారంగా ఈ 43,695 వనరుల్లో 20.3% (8,862) ప్రతి ఏటా నిండుతున్నట్లు గుర్తించారు. 41.9% (18,301) సాధారణంగా నిండుతుండగా, 29.8% (13,033) చాలా అరుదుగా నిండుతున్నాయని, 8.0% (3,499) ఎప్పుడూ నిండట్లేదని నివేదికలో వెల్లడించారు. మొత్తమ్మీద 38,540 వనరులు జిల్లా నీటిపారుదల ప్రణాళిక/రాష్ట్ర నీటిపారుదల ప్రణాళికలో ఉన్నాయి. వీటిలో 45.9% (17,681) చెరువులు కాగా, 54.1% (20,859) ట్యాంకులు, సరస్సులు, రిజర్వాయర్లు, నీటి సంరక్షణ పథకాలు/చెక్ డ్యామ్‌లు మొదలైనవి ఉన్నాయి.



1,540 చెరువులు, 1,492 ట్యాంకులు, సరస్సుల్లో ఆక్రమణలు

రాష్ట్రంలోని 3,032 జల వనరుల్లో ఆక్రమణలను గుర్తించారు. వాటిలో 50.8% (1,540) చెరువులు, 49.2% (1,492) ట్యాంకులు, సరస్సులు, రిజర్వాయర్లు, జల సంరక్షణ పథకాలు/చెక్ డ్యామ్‌లు మొదలైనవి ఉన్నాయి. వీటిలో 3,032 ఆక్రమణకు గురైన జల వనరులు, 2,028 జల వనరుల్లో ఆక్రమణ ప్రాంతాన్ని అంచనా వేశారు. ఈ 2,028 వనరులకుగాను 1,415 జల వనరుల్లో 25% కంటే తక్కువ విస్తీర్ణంలో ఆక్రమణలకు గురవుతున్నాయని, 402 జలవనరులు 25%-75% మధ్య ఆక్రమణ కలిగి ఉన్నాయని నివేదికలో పొందుపరిచారు. మిగిలిన 211 జల వనరులు 75% కంటే ఎక్కువ ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. 64,056 జల వనరుల్లో 63,769 వనరుల్లో 'జల వ్యాప్తి ప్రాంతం'నివేదించారు. వీటిలో 51.6% (32,914) జల వనరులు 0.5 హెక్టార్ల కంటే తక్కువ జల వ్యాప్తిని కలిగి ఉన్నాయి. అయితే 1.8% (1,166) జల వనరులు 50 హెక్టార్ల కంటే ఎక్కువ జల వ్యాప్తిని కలిగి ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

---

50 వేల ఎకరాల్లో పంట నష్టం

మూడురోజులుగా రాష్ట్రంలో వర్షాలు, వడగళ్లు

- ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలపై ప్రభావం
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మామిడి పంటలు
- పిడుగుపాటుతో మహిళ మృతి



ఖమ్మం జిల్లా గువ్వలగూడెంలో ధాన్యం రాశుల వద్ద నిలిచిన నీరు



యాదాద్రి జిల్లా గుండాలలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: మూడు రోజులుగా ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన అకాల వర్షాలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దాదాపు 50 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో వరి ధాన్యం నిల్వలు తడిసిపోయాయి. మొక్కజొన్న నేల రాలింది. కూరగాయల పంటలూ దెబ్బతిన్నాయి. మామిడికి భారీ నష్టం జరిగింది. గత నెలలో అకాల వర్షాలకు 1.51 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తుది అంచనా వేసిన వ్యవసాయ శాఖ, ఆ మేరకు పరిహారం ప్రకటించింది. ఎకరానికి రూ.10 వేల సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాల్లో ఇలా..

ఉమ్మడి వరంగల్‌లో శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం కురిసిన వడగళ్లతో కూడిన వర్షానికి వరి, మొక్కజొన్న పంటలకు, మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు.. నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు. జనగామ జిల్లాలో.. జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి మండలాల పరిధిలోని 21,559 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు, మామిడి, కూరగాయల తోటలకు నష్టం వాటిల్లింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేట్ గ్రామంలో కోతకొచ్చిన వరి గింజలు పూర్తిగా రాలిపోయాయి. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్, కారేపల్లి, చింతకాని, బోనకల్, గుండాల, కరకగూడెం, దుమ్ముగూడెం తదితర మండలాల్లో పంటలు బాగా దెబ్బతిన్నాయి. నేలకొండపల్లి మండలంలో వివిధ గ్రామాల్లో రోడ్లపైన, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులకు అకాల వర్షాలు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, దండేపల్లి మండలాల్లో కోతకు వచ్చిన వరి నేల వాలింది. కల్లాల్లో ధాన్యం తడిసింది. కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. వరి, జొన్నతో పాటు వివిధ పంటలు దెబ్బతిన్నాయి. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. కోతకు వచ్చిన వరిచేలు నేలవాలగా.. ధాన్యం రాశులు తడిసిపోయాయి. మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. కొన్నిచోట్ల ధాన్యం కొట్టుకుపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రహదారులు వడగళ్లతో నిండిపోయాయి. పెంకుటిళ్లు, వాహనాల అద్దాలు దెబ్బతిన్నాయి. ఇలావుండగా సూర్యాపేట జిల్లాలోని పూర్యానాయక్ తండాకు చెందిన కేలోత్ రంగమ్మ (45) పిడుగుపాటుతో మృతి చెందింది.

రోడ్డెక్కిన రైతులు

వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల కేంద్రం సమీపంలోని వేల్పుచర్ల స్టేజీ వద్ద సూర్యాపేట – జనగామ జాతీయ రహదారిపై అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో కూడా రైతులు రోడ్డెక్కారు. క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని అడ్డుకున్నారు. 'పరిశీలన కాదు.. సాయం తీసుకురండి' అంటూ నిలదీశారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: గంగుల

వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చెప్పారు. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో అకాలవర్షానికి నష్టపోయిన వరిపంటను అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను చూసి కన్నీరు పెట్టుకున్నారు. వడగళ్ల నష్టంపై జనగామ కలెక్టరేట్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష నిర్వహించారు. పెద్దపహాడ్ గ్రామాన్ని సందర్శించి బాధిత రైతులతో మాట్లాడారు.

పంట నష్టం అంచనాకు చర్యలు తీసుకోండి

కరీంనగర్ జిల్లా చొప్పదండి, కరీంనగర్ రూరల్ మండలం సహా రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతికుమారిని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. కలెక్టర్లతో మాట్లాడి పంటలకు వాటిల్లిన నష్టంపై నివేదికలు తెప్పించాలని సూచించారు.



వేల్పుచర్ల స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు



తాహెర్ కొండాపూర్‌లో వరిపంటను పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్



ఖమ్మం జిల్లా ముదిగొండలో పడిన వడగళ్లు

'ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు'

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోలుకు 7 వేల కేంద్రాలు తెరిచామని, కొనుగోళ్లు కూడా ప్రారంభిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన వాస్తవాలకు దూరంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో విమర్శించారు. మార్కెట్లోకి వచ్చిన ధాన్యం వారాలు గడిచినా కొనకపోవడంతో.. రైతులు మార్కెట్లలోనే ఉండి కాపలా కాస్తున్నారని తెలిపారు. రెండు రోజులుగా అకాల వర్షాల వల్ల మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం తడిచిపోయిందని పేర్కొన్నారు. ఈ నష్టాన్ని మార్కెట్ కమిటీలే భరించాలని ఆయన కోరారు.

ముందుకు రాలేక.. కాపాడలేక..

- అందరూ చూస్తుండగానే విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కొణతం రామచంద్రరావు

మధిర: విద్యుదాఘాతంతో ఒక వ్యాపారి మృతి చెందారు. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పట్టణానికి చెందిన పురుగు మందుల వ్యాపారి కొణతం రామచంద్రరావు (63) దుకాణం ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల మరమ్మతులు చేయించారు. శ్లాబ్‌కు నీరు పట్టేందుకు భవనం పైకి ఎక్కారు. దానికి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి సిటీ కేబుల్ వైర్లు కూడా ఉన్నాయి. రామచంద్రరావు శ్లాబ్‌పై నీరు పడుతుండగా సిటీ కేబుల్ వైర్ల ద్వారా ఎర్త్ వచ్చి విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇది అక్కడున్న వారు గమనించినప్పటికీ.. అతన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తే కరెంట్ షాక్‌కు గురవుతామన్న భయంతో ముందుకు రాలేదు. దీంతో అందరూ చూస్తుండగానే రామచంద్రరావు ప్రాణా లు కోల్పోయారు. ఆయన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామం నుంచి 40 ఏళ్ల క్రితం మధిరకు వచ్చి స్థిరపడ్డారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఏపీలో వర్షాలు.. పిడుగులు

- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఐదుగురి మృతి

సాక్షి, అమరావతి/ పాతమల్లాయ పాలెం (ప్రత్తిపాడు)/అవనిగడ్డ/ చల్లపల్లి/ ఎటపాక: తీవ్ర ఎండలతో అల్లాడుతున్న ఏపీలో ఆదివారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. పిడు గులు పడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఐదుగురు మరణించారు. వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణో గ్రతలు తగ్గి వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు సేదతీరారు. కృష్ణాజిల్లా బంటుమిల్లిలో 10.1 సెంటీమీటర్ల వర్షం పడింది. నెల్లూరు జిల్లా చినపవనిలో 9.3 సెంటీమీర్ల వర్షం కురిసింది.

వచ్చే నెలలో ఓయూలో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం

- తొలి ఆత్మీయ సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో మే మొదటి వారంలో బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర స్థాయి తొలి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తెలిపారు. ఆదివారం ఓయూలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 9 ఏండ్ల పాలనలో విద్యా రంగం అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలతో పాటు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, మండలానికి గురుకుల పాఠశాలలు, కళాశాలు, హాస్టల్స్, వర్సిటీలలో మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. జిల్లా, మండల స్థాయి నుంచి వర్సిటీలు, వివిధ కాజీలలో బీఆర్‌ఎస్వీ బలోపేతానికి అనుసరించాల్సిన భవిష్యత్తు వ్యూహాలను రూపొందించనున్నట్లు చెప్పారు. ఓయూలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి మాజీ విద్యార్థి నాయకులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కోఆర్డినేటర్లు, మండల, నియోజకవర్గాల కమిటీ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. నూతన కమిటీల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దశరథ్ విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్.. ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి చూడు

- అక్కడి ప్రభుత్వం గంటలోపే ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది
- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గుండాల: ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షాల పాలవుతోందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన మాటముచ్చట సమావేశంలో మాట్లాడుతూ.. వరి కోతలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అకాల వర్షాలతో రైతులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని పక్షం రోజుల క్రితం మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించినా చాలాచోట్ల మొదలుకాలేదన్నారు. ప్రభుత్వానికి చేతులెత్తి దండం పెడుతున్నా.. రైతులు నష్టపోకుండా వడ్ల సంగతి తేల్చాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ ఔరంగాబాద్‌లో కాదని.. పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి చూడాలని, అక్కడ మార్కెట్లలోకి వచ్చిన ధాన్యాన్ని గంటలోనే మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. ఇది నిజం కాకపోతే నా ఎంపీ పదవికి రాజీనామా చేస్తా.. నిజమైతే నీ పదవికి రాజీనామా చేస్తావా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. సమ్మేళనాలు పెట్టి ప్రజల ప్రాణాలతో బీఆర్‌ఎస్ చెలగాటమాడుతోందని ఆరోపించారు.



గుండాలలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

प्रतिभूति मुद्रणालय
SECURITY PRINTING PRESS
(भारत प्रतिभूति मुद्रण तथा मुद्रा निर्माण निगम लिमिटेड की इकाई)
(A unit of Security Printing and Minting Corporation of India Limited)
(भारत सरकार के पूर्ण स्वामित्वाधीन / Wholly owned by Government of India)
टकसाल कंपाउंड, सैफाबाद, हैदराबाद / Mint Compound, Saifabad, HYDERABAD-500 063
E-mail: spp.hyd@spmcil.com GSTIN: 36AAJCS6111J1ZP Ph: 040-23253621
Website: http://spphyderabad.spmcil.com CIN No. U22213 DL 2006 GOI 144763 Fax: 040-23456637
No.SPPH/A-II/Adv/2023/205 Date: 24-04-2023
Tenders are invited from eligible and qualified tenderers for the following items :
निविदा आमंत्रण सूचना/Notice Inviting Tender (NIT)

Sl. No.	Description	Qty.	Gem Bid no.	Closing date and time for receipt of tenders
1.	Hiring of services of 2 persons of Core Network Engineers and 1 Person of System Administrator	2 Years	GEM/2023/B/3259796	26-05-2023 At 10:45 AM(IST)
2.	Hiring of services for Digital Authentication with Track & Trace of Adhesive Labels for Punjab Agricultural Department	1 AU	Development Tender(GEM/2023/B/3332757	26-05-2023 At 10:45 AM(IST)

For further details, please visit our website at http://spphyderabad.spmcil.com & amendment/corrigendum if any, will be published on website only.
Sd/-
MANAGER & HEAD MATERIALS For Chief General Manager

వాటర్ మెట్రో వచ్చేస్తోంది



కొచ్చి: నీళ్లల్లో రయ్‌మని దూసుకువెళ్లే మెట్రో వచ్చేస్తోంది. దేశంలోనే మొట్టమొదటి వాటర్ మెట్రో కేరళలో ప్రారంభం కానుంది. కేరళ అంటేనే బ్యాక్ వాటర్స్‌తో నిండి ఉండే రాష్ట్రం. అక్కడ ప్రయాణాలంటే రోడ్లు, రైలు, ఆకాశ మార్గాలతో పాటు గమ్యస్థానం చేరుకోవడానికి నీళ్లలో కూడా ప్రయాణం తప్పనిసరి. అందుకే ఒక దీవి నుంచి మరో దీవికి చేరుకోవడానికి అన్ని హంగులతో కూడిన ఎలక్ట్రిక్ హైబ్రిడ్ పడవల్ని ప్రవేశపెడుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం కొచ్చిలో ఈ వాటర్ మెట్రోని ప్రారంభిస్తారు. ఈ మెట్రో కొచ్చి రవాణా రంగంలో ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది. కొచ్చి చుట్టుపక్కల పది దీవుల మధ్య వాటర్ మెట్రో ప్రయాణిస్తుంది. కొచ్చి షిప్‌యార్డ్ లిమిటెడ్ మొత్తం ఎనిమిది ఎలక్ట్రిక్ హైబ్రిడ్ బోట్స్‌ని తయారు చేసింది. వాటర్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఈ మెట్రోతో విప్లవాత్మక మార్పులు వస్తాయని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. రవాణా, పర్యాటక రంగాలకు ఈ మెట్రో ఊతమిస్తుందని అన్నారు. జర్మనీ ఫండింగ్ ఏజెన్సీ కేఎఫ్‌డబ్ల్యూ, కేరళ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.1,137 కోట్ల ఖర్చుతో ఈ ప్రాజెక్టు చేపట్టింది.


షిరిడి ట్రస్ట్‌కి 'చిల్లర' కష్టాలు

షిరిడి: షిరిడిలో సాయిబాబా ఆలయానికి కొత్త కష్టం వచ్చింది. భక్తులు ప్రతీ రోజూ భక్తితో సమర్పించుకునే కానుకల్లో వచ్చే చిల్లర నాణేలను తీసుకోవడం బ్యాంకులకు తలనొప్పుల్ని తెస్తోంది. శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌కి (ఎస్ఎస్ఎస్‌టీ) ప్రతీ రోజూ దాదాపుగా రూ.90 వేల వరకు చిల్లర రూపంలో వస్తుంది. ఈ చిల్లరని వారానికి ఒకసారి బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. అయితే ఆ చిల్లర నాణేలను తీసుకోవడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయి. షిరిడి ట్రస్ట్‌కి వివిధ బ్యాంకుల్లో 13 ఖాతాలున్నాయి. ట్రస్ట్ ఇచ్చిన చిల్లర నాణేల బ్యాగులతో బ్యాంకుల స్ట్రాంగ్ రూమ్‌లు నిండుతున్నాయి. కొన్ని బ్యాంకులు స్ట్రాంగ్ రూమ్ బయటే చిల్లర నాణేల సంచీలను ఉంచుతున్నాయి. షిరిడి సంస్థాన్ నుంచి వచ్చిన చిల్లర డబ్బులు అన్ని బ్యాంకుల్లో కలిసి రూ. 11 కోట్ల వరకు ఉంది. ఇంకా బస్తాల్లో చిల్లర తీసుకువస్తే ఉంచడానికి తమ బ్యాంకుల్లో జాగా లేదని 4 ప్రధాన బ్యాంకులు నాణేలను తీసుకోవడానికి నిరాకరించాయి. చిల్లర నాణేల బ్యాగులతో నిండిపోయిన కెనరా బ్యాంకు స్ట్రాంగ్ రూమ్ ఆ బరువు తాళలేక ఎప్పుడైనా కుప్పకూలిపోతుం దేమోనని దాని కింద అంతస్తులో ఉన్న దుకాణదారులు వణికిపోతున్నారు.

ఇతర గ్రహాలపై జీవజాలం..
ఓజోన్ పొర ఆధారం

భూమికి ఆవల జీవుల అన్వేషణకు కొత్త పద్ధతి ● నక్షత్రాలకు అధిక లోహతత్వం ఉంటే గ్రహాల చుట్టూ రక్షిత పొర

అనంతమైన విశ్వంలో మనం జీవిస్తున్న ఈ భూగోళంపైనే కాకుండా ఇతర గ్రహాలు, నక్షత్రాలపైనా జీవజాలం ఉందా? ఇప్పుడు లేకపోయినా గతంలో ఎప్పుడైనా ఉండేదా? ఒకవేళ ఉంటే అవి ఎలాంటి జీవులు? ఈ ప్రశ్నలు ఎన్నో శతాబ్దాలుగా భూమిపై మానవాళిని వెంటాడుతూనే ఉన్నాయి. సువిశాలమైన విశ్వంలో భూమికి ఆవల జీవుల ఉనికిని కనిపెట్టేందుకు ఖగోళ శాస్త్రవేత్తలు అలుపెరగకుండా అన్వేషణ కొనసాగిస్తూనే ఉన్నారు. మన పాలపుంత(గెలాక్సీ)లో ఇప్పటిదాకా 5,000కుపైగా గ్రహాలను కనిపెట్టారు. వాటిపై జీవులు ఉన్నాయా? అనేది తెలుసుకొనేందుకు కృషి చేశారు. ఇందుకోసం ఎన్నెన్నో పద్ధతులు అనుసరించారు. ఇతర గ్రహాలపై జీవజాలం ఉన్నట్లు ఇప్పటివరకైతే బలమైన ఆధారాలేవీ లభించలేదు. పరిశోధనల్లో భాగంగా శాస్త్రవేత్తలు మరో కొత్త పద్ధతిపై దృష్టి పెట్టారు. అదేమిటో తెలుసుకోవడం ఆసక్తికరమే.



- మన భూగోళానికి రక్షణ కవచం ఓజోన్ పొర అన్న సంగతి తెలిసిందే. అత్యంత హానికరమైన అల్ట్రావయొలెట్(యూవీ) రేడియేషన్ నుంచి ఓజోన్ పొర రక్షిస్తోంది. అందుకే భూమిపై కోట్లాది జీవులు నిక్షేపంగా మనుగడ సాగిస్తున్నాయి.
- ఏదైనా గ్రహాన్ని మందపాటి ఓజోన్ పొర ఆవరించి ఉంటే ఆ గ్రహంపై జీవుల ఉనికి సాధ్యమని దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. శాస్త్రవేత్తలు ఇప్పుడు ఇదే అంశాన్ని సరికొత్త అస్త్రంగా మార్చుకుంటున్నారు.
- ఏదైనా నక్షత్రానికి లోహతత్వం(మెటాలిసిటీ) ఎక్కువగా ఉంటే దాని చుట్టూ ఉన్న గ్రహాలపై రక్షిత ఓజోన్ పొర ఆవరించి ఉంటుందని గుర్తించారు.
- ఈ అధ్యయనం వివరాలను 'నేచర్ కమ్యూనికేషన్' పత్రికలో ప్రచురించారు.
- విశ్వ పరిణామ క్రమంలో కొత్తగా పుట్టుకొస్తున్న నక్షత్రాలకు లోహతత్వం అధికంగా ఉంటున్నట్లు తేల్చారు. ఇలాంటి నక్షత్ర మండల్లాలోని గ్రహాల చుట్టూ దట్టమైన ఓజోన్ పొర ఏర్పడుతుందని, తద్వారా అక్కడ జీవులు ఉద్భవించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.
- అధిక లోహతత్వం ఉన్న నక్షత్రాల పరిధిలోని గ్రహాలే జీవుల అన్వేషణకు మెరుగైన లక్ష్యాలని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.
- గ్రహాల చుట్టూ రక్షిత ఓజోన్ పొర ఏర్పడాలంటే దానికి సంబంధించిన నక్షత్రానికి ఏయే లక్షణాలు ఉండాలో అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెబుతున్నారు.
- విశ్వంలో గ్రహాలను కలిగిన చాలా నక్షత్రాల ఉష్ణోగ్రత 5,000 నుంచి 6,000 డిగ్రీల సెల్సియస్ ఉంది. మన నక్షత్రమైన సూర్యుడు ఇదే విభాగంలోకి వస్తాడు.
- సూర్యుడి నుంచి వెలువడుతున్న అల్ట్రావయొలెట్ కాంతి(రేడియేషన్) మన భూగ్రహ వాతావరణంపై చూపిస్తున్న సంక్లిష్టమైన ప్రభావాన్నే ఇతర గ్రహాల వాతావరణంపైనా చూపించే అవకాశం ఉందని ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ అన్నా సపిరో ఒక ప్రకటనలో వెల్లడించారు.
- నక్షత్రాల్లోని లోహతత్వం వాటి నుంచి ఉద్గారమయ్యే అల్ట్రావయెలెట్ కాంతిని ప్రభావితం చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. యూవీ రేడియేషన్ నక్షత్రాల సమీపంలో కక్ష్యలో తిరిగే గ్రహాల వాతావరణంపై ఎలాంటి ప్రభావం చూపిస్తోందన్న దానిపై దృష్టి సారించారు.
- మన భూగోళంపై ఉన్న వాతావరణం ఇక్కడి జీవ పరిణామ క్రమాన్ని తెలుసుకొనేందుకు ఉపకరిస్తుందని, ఇదే సూత్రాన్ని ఇతర గ్రహాలకు సైతం వర్తింపజేయవచ్చని సైంటిస్టు జోస్ లెలీవెల్డ్ అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎట్టకేలకు అమృత్‌పాల్ అరెస్ట్

అస్సాం జైలుకు తరలించిన పంజాబ్ పోలీసులు

చండీగఢ్/దిబ్రూగఢ్: ఖలిస్తాన్ వేర్పాటువాద బోధకుడు, వారిస్ పంజాబ్ దే సంస్థ చీఫ్ అమృత్‌పాల్ ఎట్టకేలకు పంజాబ్ పోలీసులకు చిక్కాడు. నాడు స్వర్ణదేవాలయంలో నక్కిన ఖలిస్తాన్ ఉగ్రవాది దివంగత జర్నైల్‌సింగ్ బింద్రన్‌వాలే స్వగ్రామం రోడేలో ఆదివారం ఉదయం అమృత్‌పాల్ తానున్నచోటు చెప్పిమరీ లొంగిపోయినట్లు వార్తలొచ్చాయి. 'అతడు లొంగిపోలేదు. రాష్ట్ర పోలీసులు, నిఘా విభాగం సంయుక్తంగా అతని ఆచూకీ కనిపెట్టి గురుద్వారా అన్నివైపులా చుట్టుముట్టాం. అపవిత్రం చేయకూడదనే ఉద్దేశంతో యూనిఫాంలో ఉన్న పోలీసులు గురుద్వారా లోపలికి వెళ్లలేదు. లొంగిపోవాలని బయటి నుంచే హెచ్చరించాం. పారిపోయేందుకు ఆస్కారం లేకపోవడంతో అమృత్‌పాల్ బయటికొచ్చి లొంగిపోయాడు' అని ఐజీ సుఖ్‌చైన్‌సింగ్ గిల్ స్పష్టం చేశారు. 36 రోజులపాటు పంజాబ్ పోలీసులను ముప్పతిప్పలు పెట్టిన అమృత్‌పాల్‌ను కఠిన జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్ చేసిన పోలీసులు వాయు మార్గంలో అస్సాం రాష్ట్రంలోని దిబ్రూగఢ్ కేంద్ర కారాగారానికి తరలించారు.

ఎందుకీ అరెస్ట్?

తమ సహచరుడిని విడిపించుకునిపోవడానికి అజ్నాలా పోలీస్‌స్టేషన్‌పై వందలాది మంది అమృత్‌పాల్ అనుచరులు ఖడ్గాలతో దాడికి తెగబడిన తర్వాత అమృత్‌పాల్ కోసం పోలీసుల వేట మొదలైన విషయం తెల్సిందే. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సత్సంబంధాలు నెరపుతూ మళ్లీ ఖలిస్తాన్ దేశం కోసం పోరాడేలా సిక్కు యువతను వేర్పాటువాదం వైపు ఆకర్షించేందుకు అమృత్‌పాల్ ప్రయత్నిస్తున్నాడని ఆరోపణలున్నాయి. గతంలో దుబాయ్ నుంచి తిరిగొచ్చాక ఉద్యమకారుడు, గాయకుడు దీప్ సిద్ధూ మరణించాక వారిస్ పంజాబ్ దేకు చీఫ్ అయ్యాడు. డ్రగ్స్ బానిసలను బాగుచేస్తామని పైకి చెప్పినా సంస్థ లోపల జరిగేది వేరే అని నిఘా వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతకు భంగం కలిగేలా దుష్ప్రచారం, హత్యాయత్నం, పోలీసులపై దాడి తదితర ఘటనలపై అతనిపై, అనుచరులపై పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల లండన్‌కు వెళ్లేందుకు యత్నించిన అతని భార్యను పోలీసులు అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్‌లో అడ్డుకోవడం తెల్సిందే. కాగా, 'సారవంతమైన పంజాబ్ నేలలో ఏ పంటలైనా పండుతాయి. కానీ విద్వేష విత్తులు మొలకెత్తవు. మొలకెత్తనివ్వం. శనివారం రాత్రి ఆచూకీ తెలిశాక రాత్రంతా నిద్రపోలేదు. రక్తపాతం, ఘర్షణలు జరక్కుండా అరెస్ట్ పూర్తవ్వాలని కోరుకున్నా' అని అమృత్‌పాల్ అరెస్ట్ తర్వాత రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ ట్వీట్‌చేశారు.



అరెస్ట్ సందర్భంగా అమృత్‌పాల్

అంతం కాదిది.. ఆరంభం

గురుద్వారా వద్ద తీసిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'నేను పరారీలో ఉన్నపుడు రాష్ట్రంలోని సిక్కులపై ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి తెచ్చింది. నన్ను అరెస్ట్ చేయడం కంటే భద్రతా ఏజెన్సీలకు ప్రజలను వేధించడమే ఇష్టమనుకుంటా. అవి ఆపేందుకే లొంగిపోవాలనుకున్నా. నా అరెస్ట్‌తో అంతా అయిపోదు. ఇప్పుడే మొదలైంది. దైవం ముందు నేను నిర్దోషినే' అని అందులో అమృత్ ప్రసంగిస్తున్నట్లు ఉంది.

కలర్‌ఫుల్ ఎంఆర్ఐ స్కానర్

న్యూఢిల్లీ: ఎంఆర్ఐ స్కానింగ్ అంటే చాలా మందికి భయం. వింత శబ్దాలతో గుహలోకి వెళ్లిన ఫీలింగ్. చిన్నారులకు ఎంఆర్ఐ అంటే మరీ కష్టం. పిల్లలు భయపడకుండా స్కాన్ తీయడం కోసం 'చిన్నారి' ఎంఆర్ఐ మిషన్లు వస్తున్నాయి. మిషన్‌కు రంగులద్దడంతో పాటు దానిపైన ఫిక్షనల్ కేరక్టర్స్, బొమ్మలు చిత్రీకరించి పిల్లల్ని ఆకర్షించేలా రూపొందిస్తున్నారు. చాలా ఆస్పత్రుల్లో ఇలాంటి ఎంఆర్ఐ మిషన్లు ఉంటున్నాయని పారిశ్రామికవేత్త హర్షగోయెంక ఒక ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇప్పుడు ఆ మిషన్‌ను చూసిన నెటిజన్లు భలేగా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు.



69 క్యాన్ల సోడాలు హాంఫట్

ఒట్టావా: కెనడాలో ఒక మహిళకి వింత అనుభవం ఎదురైంది. ఇంట్లో అవసరాల కోసం తెచ్చుకున్న సోడా క్యాన్లను ఒక ఎలుగు ఊది పారేసింది. షరోన్ రోజెల్ అనే మహిళ తెల్లవారుజామున కుక్క మొరగడంతో లేచి చూసింది. అప్పటికే తన కారు అద్దాలు బద్దలు కొట్టిన ఎలుగుబంటి అందులో ఉంచిన 72 సోడాల క్యాన్లలో ఏకంగా 69 తాగేసింది. బాల్కనీ నుంచి ఇదంతా చూసి రోజెల్ వాటి ఫోటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఒక ఎలుగుబంటి ఆ స్థాయిలో సోడాలు తాగడం అత్యంత అరుదు అని కొందరు వ్యాఖ్యానించారు.

'సెలబ్రిటీ' ఖాతాలకు మళ్లీ బ్లూ టిక్

న్యూఢిల్లీ: చందా మొత్తాన్ని చెల్లించలేదంటూ చాలా మంది ప్రముఖుల ట్విట్టర్ ఖాతాల్లో బ్లూ టిక్‌ను తొలగించిన ట్విట్టర్ యాజమాన్యం ఆదివారం కొందరికి బ్లూ టిక్‌ను పునరుద్ధరించింది. లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న ట్విట్టర్ ఖాతాలకే ఈ మినహాయింపు ఇచ్చినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, రాహుల్ గాంధీ, సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీసహా ప్రముఖ భారతీయ నటులు, రాజకీయనేతలు, క్రీడాకారుల బ్లూ టిక్‌ను ఇటీవల తొలగించగా ఆదివారం ఆ టిక్ మళ్లీ ప్రత్యక్షమైంది. లక్షలాది మంది ఫాలోవర్లు ఉండటం వల్లే వీరందరికి బ్లూ టిక్ ఇచ్చారా ? లేక సబ్‌స్క్రైబ్ చేసుకున్నారా అనేది తెలియరాలేదు. 'చందా కట్టకున్నా ఆదివారం బ్లూ టిక్ మళ్లీ వచ్చేసింది. మిస్టర్ మస్క్ మీరే నా తరఫున చందా రుసుం కట్టేశారా? ' అంటూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆదివారం ట్వీట్‌చేశారు. అయితే లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న ఖాతాలకు మాత్రమే వెరిఫైడ్ స్టేటస్(బ్లూ టిక్) హోదా కట్టబెట్టినట్లు తెలుస్తోంది. అయితే, దివంగతుల ఖాతాలకు టిక్ ప్రత్యక్షమవడం గమనార్హం. మైఖేల్ జాక్సన్, చాడ్విక్ బోస్‌మ్యాన్, కోబె బ్రయాంట్ తదితర సెలబ్రిటీల ఖాతాలు ఇందులో ఉన్నాయి. కాగా బ్లూ టిక్ కోసం చందా కట్టే ప్రసక్తే లేదని ప్రకటించిన కొందరు ప్రముఖుల తరఫున తానే నగదు చెల్లించి టిక్ పునరుద్ధరించినట్లు ట్విట్టర్ యజమాని, కుబేరుడు ఎలాన్ మస్క్ వెల్లడించారు. దిగ్గజ నటుడు విలియం శాట్నర్ తదితరుల తరఫున మస్క్ రుసుం చెల్లించారు.

కర్ణాటకలో మాదే విజయం




- 150 స్థానాలు కచ్చితంగా గెలుచుకుంటాం: రాహుల్

సాక్షి, బళ్లారి/విజయపుర: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఘన విజయం సాధించబోతున్నామని, 224 స్థానాలకు గాను 150 స్థానాలు కచ్చితంగా గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం కర్ణాటకలోని విజయపురలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. శివాజీ సర్కిల్ నుంచి కనకదాస సర్కిల్ వరకూ జరిగిన భారీ రోడ్డు అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. '40 పర్సెంట్ బీజేపీ సర్కారు'కు ఈ ఎన్నికల్లో 40 సీట్లు మాత్రమే వస్తాయని జోస్యం చెప్పారు. ప్రధాని మోదీతోపాటు బీజేపీ నాయకులు 12వ శతాబ్దపు సంఘ సంస్కర్త బసవణ్ణ బోధనల గురించి మాట్లాడుతున్నారు గానీ వాటిని ఏమాత్రం ఆచరించడం లేదని రాహుల్ ఆక్షేపించారు.

బసవేశ్వరుడికి రాహుల్ నివాళులు

సంఘ సంస్కర్త బసవేశ్వరుడి జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ ఆదివారం కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోట జిల్లాలోని కూడల సంగమంలోని బసవణ్ణ సమాధిని దర్శించుకున్నారు. నివాళులర్పించారు. కూడల సంగమంలో సంగమనాథ దేవాలయాన్ని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నుదుటిన విభూతి ధరించారు. విశ్వగురు బసవణ్ణ సమ సమాజ స్థాపన కోసం కృషి పడ్డారని, ఆనాడే చట్టసభ ద్వారా అన్ని వర్గాల ప్రజలను అందలమెక్కించాలని తపనపడ్డారని రాహుల్ కొనియాడారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి బసవణ్ణ చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం గురించి కాంగ్రెస్ నేతలతో రాహుల్ చర్చించారు. హుబ్లీకి వెళ్లి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌తో మాట్లాడారు.

ఊరు కాదు వీధి




ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఒక ఊరు అనుకుంటే పొరపాటే. అదొక వీధి. అక్కడ ఏకంగా 6 వేల మంది నివసిస్తున్నారు. ఆ వీధి మొదలు ఎక్కడుందో, చివర ఎక్కడుంటుందో అక్కడ నివసించే వారికే సరిగ్గా తెలీదు. ఇలాంటి వీధి పోలండ్‌లో ఉంది. ఈ వీధికి సంబంధించిన ఏరియల్ వ్యూ ఫొటో ఇటీవల వైరల్‌గా మారింది. దక్షిణ పోలండ్‌లో సులోస్జోవా అనే పట్టణంలో ఈ వీధి ఉంది. దీని పొడవు ఏకంగా తొమ్మిది కిలో మీటర్లు. ప్రపంచంలోనే అతి పెద్ద వీధి ఇదే. ఇరువైపులా పచ్చని పంట పొలాలతో, పొందికగా అమర్చిన ఇళ్లతో ఈ వీధి ఫొటోలను చూసి నెటిజన్లు ఫిదా అయిపోయారు.

కలల అలలపై...



హాయిగా మనవలు, మనవరాళ్లతో కాలం గడిపే వయసు. ఏ బాదర బందీ లేకుండా ఎవరో వండిపెడితే తింటూ కాలం గడిపే వయసు. అయినా ఆమెలో ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదు. సర్వస్వతంత్రంగా వ్యవహరించే ఆమె తనకున్న ఆస్తుల్ని అమ్మకానికి పెట్టారు. ఎం.వి.జెమిని అనే నౌకలో ప్రపంచ యాత్ర చెయ్యడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆమే అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన షరాన్ లేన్. ఇప్పుడు ఆమె వయసు 75 ఏళ్లు. హైస్కూలు రిటైర్డ్ టీచర్. చిన్నప్పట్నుంచి ప్రయాణాలంటే ఆమెకు చాలా ఇష్టం. అడ్వెంచర్స్ అంటే చెప్పలేనంత థ్రిల్. స్కూల్లో విదేశీ భాషలు బోధించేవారు. స్కూలు పిల్లల్ని తీసుకొని యూరప్ దేశాలన్నీ చుట్టేసి వచ్చారు. అయినా ఆమెకు లైఫ్‌లో ఏదో అసంతృప్తి. ఇంకొన్ని దేశాలు తిరగాలి. అక్కడ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు తెలుసుకోవాలి. సరికొత్త రుచులు చవి చూడాలి. కొత్త కొత్త విషయాలు తెలుసుకోవాలి. జీవితంలో అనుక్షణం కొత్తదనం కోసం పరితపించే లేన్‌కు ఎంవి.జెమిని అనే నౌక ప్రయాణం ఒక చుక్కానిలా కనిపించింది. ఈ నౌక ప్రపంచాన్ని చుట్టి వస్తుందని సన్నిహితులు చెబితే తెలుసుకున్నారు. ఒక రోజు కాదు రెండ్రోజులు కాదు ఏకంగా మూడేళ్ల నౌక ప్రయాణం. ఆ నౌకలో అత్యంత తక్కువ ధరకి లభించే ఒక చిన్న కేబిన్‌లాంటి గదికి ఏడాదికి 30 వేల డాలర్లు చెల్లించాలి. తన ఆస్తిపాస్తుల్ని అమ్మేస్తే మూడేళ్లకి సరిపడా డబ్బులు వచ్చేస్తాయని ఆ గది బుక్ చేసుకున్నారు. ఆ చిన్న గదికి కనీసం కిటికీ కూడా ఉండదు. కానీ బయట ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఒక చిన్న స్క్రీన్ ఏర్పాటు చేస్తారు. అదే మహ



ద్భాగ్యంగా భావించారు. నవంబర్ 1 నుంచి ఈ నౌక ప్రయాణం ప్రారంభమవుతుంది. కూతురికి చెబితే ఏమంటుందోనని ఆమెకి మాట మాత్రంగానైనా చెప్పలేదు. గాలి, ఎండ సోకని ఆ గదిలో కేవలం రాత్రి పూట మాత్రమే గడిపి మిగిలిన సమయమంతా తనకెంతో ఇష్టమైన సముద్రాన్ని చూస్తూ గడిపేస్తానని చెబుతున్నారు. నౌకలో తోటి ప్రయాణికులతో మాటలు కలపడం, కొత్త స్నేహితుల్ని చేసుకోవడం కూడా ఆమెకు ఇష్టమే. మొత్తం మూడేళ్ల పాటు సాగే ప్రయాణంలో ఎంవి జెమిని నౌక 375 రేవు పట్టణాల్లో ఆగుతుంది. ఇండియా నుంచి చైనా, మాల్దీవ్స్, ఆస్ట్రేలియా ఇలా అన్ని దేశాలు తిరుగుతుంది. "నాకున్న లక్ష్యం ఒక్కటే. ప్రతీ రోజూ ఏదో ఒక కొత్త విషయం నా బ్లాగ్‌లో రాయాలి. కలం పేరుతో ఒక బ్లాగ్‌ను ఏర్పాటు చేసి అందులో నా అనుభవాలన్నీ కథలుగా రాస్తాను. ఎవరైనా నాలుగ్గోడల మధ్య మగ్గిపోతూ ఇంట్లో కూర్చుంటే ఏం వస్తుంది. పది మందిలో తిరిగితేనే జీవితంపై అవగాహన వస్తుంది. అందులోనూ సముద్రాన్ని చూస్తూ ప్రయాణమంటే అదో అవధుల్లేని అనుభూతి. ఇల్లంటే మన మనసుకి ఎంతో ఇష్టమైన ప్రదేశమే కావొచ్చు. కానీ విమానమో, పడవో, రైలో ఏదో ఒకటి ఎక్కి బయట ప్రపంచాన్ని చూడండి. అదెంత అద్భుతంగా ఉంటుందో" అని లేన్ తన మనసులో మాట వెల్లడించారు. మూడేళ్లంటే తక్కువ కాలం ఏమీ కాదు. అందులోనూ కరోనా సోకిన తర్వాత ఆమె శ్వాసకోశ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. అయినా కూడా ఆమె దేనికీ భయపడట్లేదు. ఇల్లు కంటే పడవే పదిలమంటున్నారు. తాను ప్రయాణించే పడవలో కూడా అనారోగ్యం వస్తే చికిత్స అందించే ఏర్పాట్లు కూడా ఉన్నాయని చెప్పారు. ఇలా ఒంటరి ప్రయాణం ఆమెకు కొత్తేం కాదు. చాలా కాలంగా ఆమె ఒంటరిగానే జీవిస్తున్నారు. ఇప్పుడీ ప్రయాణం ఆమెలో ఉత్సాహాన్ని నింపి వయసుని మరింత తగ్గించింది. మరి మనమూ లేన్‌కి హ్యాపీ జర్నీ చెప్పేద్దాం.

– సాక్షి, నేషనల్ డెస్క్

నేడు కేరళకు ప్రధాని మోదీ

కొచ్చిన్/తిరువనంతపురం: ప్రధాని మోదీ సోమవారం నుంచి కేరళలో రెండు రోజుల పాటు పర్యటిస్తారు. సోమవారం ఆయన కొచ్చిన్‌లో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. దేశంలో తొలి డిజిటల్ సైన్స్ పార్క్‌కు శంకుస్థాపన చేయడంతోపాటు చర్చి పెద్దలతో సమావేశమవుతారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభిస్తారు. యువజనుల కార్యక్రమం యువమ్–2023కి హాజరవుతారు. ప్రధాని పర్యటన ద్వారా రాష్ట్రంలో బీజేపీ శ్రేణుల్లో ఉత్తేజం కలిగించేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రయత్నిస్తోంది. కాగా, ప్రధాని పర్యటన బందోబస్తులో 2,060 మందిని వినియోగించనున్నారు. పర్యటన సమయంలో ప్రధాని మోదీని ఆత్మాహుతి బాంబర్‌తో చంపేస్తామంటూ బెదిరింపు లేఖ రాసిన వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పేరుతో ఆ లేఖ రాసిన కొచ్చిన్‌కు చెందిన వ్యాపారి జేవియర్‌ని అదుపులోకి తీసుకున్నామని, జానీ అనే వ్యక్తిపై కక్షతోనే అతడు ఈ పనికి పాల్పడినట్లు తేలిందని చెప్పారు.

ఏసీ అక్కర్లేదు, ఒక చెట్టున్నా చాలు

న్యూఢిల్లీ: ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపంతో ఏసీ గదుల్లోంచి బయటకు రావడానికే జనం ఇష్టం పడడం లేదు. సుభాషిణి చంద్రమణి అనే మహిళ మాత్రం ఎండ నుంచి రక్షణకి ఏసీ గదులు అక్కర్లేదని ఒక చెట్టు చాలని ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఆమె మండుటెండలో నిల్చొని ఉష్ణోగ్రతని రికార్డు చేస్తే 40 డిగ్రీల సెల్సియస్ చూపించింది. అలా నడుచుకుంటూ పక్కనే ఉన్న చెట్టు నీడలోకి వెళితే ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోయి 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అంటే ఏకంగా 13 డిగ్రీలు తేడా ఉందన్న మాట. ఆమె ఈ ప్రయోగం చేసి దానికి సంబంధించిన వీడియోను ట్విటర్‌లో పోస్టు చేస్తే అది వైరల్‌గా మారింది.

30దాకా కేదార్‌నాథ్ రిజిస్ట్రేషన్ నిలిపివేత

రిషికేశ్: ఎగువ హిమాలయాల ప్రాంతం గర్వాల్ హిమాలయాల్లో వర్షం, హిమపాతం కారణంగా కేదార్‌నాథ్ యాత్ర కోసం రిషికేశ్, హరిద్వార్‌లలో జరిగే యాత్రికుల రిజిస్ట్రేషన్‌లను ఈ నెల 30వ తేదీదాకా నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మరోవైపు కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు మంగళవారం తెరుచుకోనున్న సంగతి తెల్సిందే. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు. బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి ధామ్‌ల దర్శనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కొనసాగుతోంది.

20 రోజుల్లో షిండే సర్కార్ పతనం: సంజయ్

జల్గావ్: మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి మరణశాసనం సిద్ధమైందని శివసేన(ఉద్ధవ్ వర్గం)నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మరో 15–20 రోజుల్లో ఈ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, మరణ శాసనంపై సంతకం చేసేదెవరో ఇప్పుడు తేలాల్సి ఉందని రౌత్ జోస్యం చెప్పారు. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంపై తిరుగుబాటు చేసి షిండే వర్గంలో చేరిన 16 మంది ఎమ్మెల్యేల అనర్హత సహా పలు పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ..తీర్పు కోసం తమ పార్టీ ఎదురు చూస్తోందని, న్యాయం జరుగుతుందన్న నమ్మకం తమకుందని చెప్పారు. ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీల మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని గత ఏడాది జూన్‌లో షిండే, 39 మంది ఎమ్మెల్యేలు కూల్చి, బీజేపీ సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తెలిసిందే.

అమెరికాలో ఇద్దరు భారతీయ విద్యార్థులు మృతి

న్యూయార్క్: అమెరికాలో ఇండియానా రాష్ట్రంలో సరస్సులో ఈతకెళ్లిన ఇద్దరు భారతీయ విద్యార్థులు మృత్యువాతపడ్డారు. ఈ నెల 15వ తేదీన సిద్ధాంత్ షా(19), ఆర్యన్ వైద్య(20)లు మరికొందరితో కలిసి మొన్రో సరస్సులో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈదుతూనే ఇద్దరూ నీళ్లలో మునిగిపోయారు. అధికారులు ఎంతగా ప్రయత్నించినా వారి జాడ దొరకలేదు. ఈ నెల 18వ తేదీన ఇద్దరి మృతదేహాలు సరస్సులో తేలియాడుతూ కనిపించగా వెలికితీశారు. సిద్ధాంత్, ఆర్యన్‌లు ఇండియానా యూనివర్సిటీకి చెందిన కెల్లీ స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులని అధికారులు వెల్లడించారు. వీరిద్దరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సూడాన్ నుంచి విదేశీయుల తరలింపు షురూ

ఖార్టూమ్/వాషింగ్టన్: ఆఫ్రికాలోని మూడో అతిపెద్ద దేశం సూడాన్ వరుసగా తొమ్మిదోరోజూ తుపాకీ చప్పుళ్లు, బాంబు మోతలతో దద్దరిల్లుతోంది. అంతర్జాతీయ సమాజం చేసిన విజ్ఞప్తులను అక్కడి ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్(ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్) జనరళ్లు పట్టించుకోవడం లేదు. పరిస్థితులు ప్రమాదకరంగా మారడంతో అమెరికా సహా పలుదేశాలు అక్కడ చిక్కుకుపోయిన తమ దౌత్య సిబ్బందిని, పౌరులను బయటకు తరలించేందుకు ప్రయత్నాలను వేగవంతం చేశాయి. ఆదివారం అమెరికా ప్రత్యేక బలగాలు ఖార్టూమ్ దౌత్య కార్యాలయంలో పనిచేసే 70 మందిని పొరుగునే ఉన్న ఇథియోపియోలోని ఓ ప్రాంతానికి సురక్షితంగా తరలించాయి. సౌదీ అరేబియా శనివారమే తమ దౌత్యాధికారులు, పౌరులు కలిపి మొత్తం 157 మంది వెనక్కితీసుకొచ్చింది. వీరిలో కొందరు భారతీయులు ఉన్నట్లు సమాచారం. ఖార్టూమ్‌తోపాటు అక్కడికి సమీపంలోని ఒమ్‌దుర్మన్ నగరంలో పోరు తీవ్రమైనట్లు స్థానికులు చెబుతున్నారు.



నృసింహుని సన్నిధిలో కలెక్టర్

బుగ్గారం(ధర్మపురి) : ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం కరీంనగర్ కలెక్టర్ కర్ణన్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ దంపతులకు అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు.



శంకరజయంతి వేడుకలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న శంకర జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/24.0

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.



కులవృత్తుల్లో ఈతరం

కనుమరుగవుతున్న కళకు జీవం

- అధునికతను జోడిస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ..
- కుటుంబానికి అండగా.. ఉపాధితో ఆనందంగా..
- కులవృత్తిలో అధిక సంఖ్యలో నాయీబ్రాహ్మణులు..
- అతితక్కువగా శాలివాహనులు

అంతరించిపోతున్న కళలకు వారు జీవం పోస్తున్నారు. నాటితరం బాధ్యతను భుజాన వేసుకుని ఈ తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా.. కార్పొరేట్ ఉద్యోగాలబాట పట్టకుండా.. పుట్టిన ఊరిలో నమ్ముకున్న కులవృత్తి చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నారు. తాతలు, తండ్రులు నేర్పిన పనే ఇప్పుడు కుటుంబానికి ఆసరా అవుతోందని చెబుతున్నారు. తాము చేసే పనికి మరింత ఆధునికతను జోడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వృత్తిలో మరింత నైపుణ్యత సాధిస్తూ వచ్చిన ఆదాయంతో ఆనందంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న యువతలో ఎక్కువగా నాయీబ్రాహ్మణులు ఉండగా.. అతితక్కువ శాలివాహనులు ఉన్నట్లు సమాచారం. కనుమరుగవుతున్న కులవృత్తులకు జీవం పోస్తున్న యువ'తరం'పై ప్రత్యేక కథనం.. - సాక్షి, కరీంనగర్ డెస్క్

పోటీ ఉంది..

నేను బీకాం పూర్తిచేశాను. 12 ఏళ్లుగా మా కులవృత్తిలోనే కొనసాగుతున్నా. కొత్త ఇండ్లకు అవసరమైన మెటీరియల్, మంచాలు, సోఫాలు, తదితర ఫర్నీచర్ తయారు చేస్తుంటాను. మా కులవృత్తిలోనూ పోటీ ఉంది. బిల్డర్లు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు మెటీరియల్ తీసుకెళ్తున్నారు. ప్రభుత్వం కూడా మాకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తే బాగుంటుంది. – నూతి సంతోశ్‌కుమార్, అమర్‌నగర్, పెద్దపల్లి



ఈ యువకుడి పేరు నాగరాజు. గోల్డ్‌స్మిత్. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటాడు. నాగరాజుకు ఇద్దరు అక్కలు. తండ్రి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇంటి బాధ్యతలు తనపై వేసుకున్నాడు. పీజీ పూర్తిచేసినా.. ఉద్యోగం వైపు చూడకుండా కులవృత్తిపైనే ఆధారపడ్డాడు. బంగారు ఆభరణాల తయారీపై గోదావరిఖనిలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. తరువాత కరీంనగర్‌లో పనిచేశాడు. ఇద్దరు అక్కల వివాహాలు చేశాడు. ప్రస్తుతం ఇంటివద్దే దుకాణం నిర్వహిస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కులవృత్తి అన్నం పెడుతోందని, అందుకే వేరే ఆలోచన చేయలేదని నాగరాజు చెబుతున్నాడు.



ఈ యువకుడు ఎనగందుల రాజు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన రాజు డిగ్రీ పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో మంచి ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లలేదు. గ్రామంలోనే తండ్రి, సోదరుడితో కలిసి సెలూన్ ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం ముగ్గురు కలిసి పనిచేస్తున్నారు. ఖర్చులు పోను నిత్యం రూ.500 మిగులుతాయని రాజు చెబుతున్నాడు. తనకు కులవృత్తి చేయడం అంటే ఇష్టమని, అందుకే వేరే ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లలేదని అంటున్నాడు. అయితే.. పట్టణాల్లో వెలుస్తున్న కార్పొరేట్ సంస్థలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చిరువృత్తికారులకు అండగా ఉండి, కార్పొరేట్ సంస్థలకు అనుమతి ఇవ్వొద్దని రాజు కోరుతున్నాడు.



ఈయన తాళ్లపెల్లి మహేందర్‌గౌడ్. సొంతూరు మానకొండూర్ మండలం వెల్ది. కుటుంబ పరిస్థితులు ఉన్నత చదువులకు అడ్డంకిగా మారాయి. వ్యవసాయం, కులవృత్తే ఇతనికి ఆధారమైంది. ఉన్న భూమిని సాగుచేసుకుంటూ.. పొద్దున, సాయంత్రం తాటిచెట్లు ఎక్కుతూ కల్లు గీస్తుంటాడు. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇక్కడ విశేషం ఏంటంటే.. ఈ గ్రామంలో ఈయన తరంలో కల్లు గీత కార్మికుల్లో ఇతను ఒక్కడే ప్రస్తుతం పనిచేస్తున్నాడు. మిగతా వారందరూ ప్రత్యామ్నాయం చూసుకున్నారు. 'మేము నలుగురం అన్నదమ్ములం. కులవృత్తి చేయడంలో ఆనందం ఉంది. ఒక్కడినే ఊల్లో ఉంటున్నా. అందరూ ప్రత్యామ్నాయం వెతుకున్నారు. ప్రభుత్వం మాకు అండగా ఉండాలి' అని మహేందర్ కోరుతున్నాడు.

ఆధునికతను జోడిస్తూ..

ప్రస్తుతకాలంలో కులవృత్తి చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. డిగ్రీ పూర్తికాగానే ప్రైవేటు ఉద్యోగమో.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రిపరేషనో చేస్తున్నారు. ఇలా గత రెండు, మూడు దశాబ్దాల నుంచే కులవృత్తులు అంతరించిపోవడం కనిపిస్తోంది. అందివచ్చిన మిషనరీ చాలా కులవృత్తులను చావుదెబ్బ కొట్టగా... గ్రామాల్లోని యువతకు చేతిలో పనిలేకుండా పోయింది. కార్పొరేట్ కంపెనీలు.. రెడీమేడ్ వస్తువులు చేతివృత్తులపై ప్రభావం చూపాయి. చాలా మంది పనుల నిమిత్తం వలస వెళ్లిన సందర్భాలు అనేకం. అయితే ప్రస్తుత యువత ప్రజల అభిరుచికి అనుగుణంగా వారి కులవృత్తిలో ఆధునీకతను జోడిస్తూ ముందుకు సాగుతున్నారు. పట్టణాల్లో ఉండే సదుపాయాలను గ్రామాల్లోనూ కల్పిస్తూ కులవృత్తులకు జీవం పోస్తున్నారు.

ట్రెండ్ సెట్ చేస్తూ..

ప్రస్తుత యువత కులవృత్తిలో నయా ట్రెండ్ సెట్ చేస్తున్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా నడుచుకుంటున్నారు. నాయీబ్రాహ్మణులు పల్లెల్లోనూ పట్టణాల్లో ఉండేలా సెలూన్లు తీర్చిదిద్దుతున్నారు. కొత్త కొత్త హెయిర్‌స్టైల్స్‌తో ఆకట్టుకుంటున్నారు. గోల్డ్‌స్మిత్‌లు పెద్దపెద్ద బంగారు దుకాణాల్లో దొరికేవాటికన్నా సరికొత్త డిజైన్లు తయారు చేస్తున్నారు. వివిధ సైట్లలో సెర్చ్ చేస్తూ అందమైన పసిడి ఆభరణాలు తయారు చేస్తున్నారు. కార్పెంటర్లు కూడా కంప్యూటరైజ్డ్ డిజైన్లు తయారు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకుంటూ.. కంటికి ఇంపైన ఇంటీరియల్ తయారు చేస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు. అదే విధంగా వివిధ కులవృత్తుల యువత ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ చేతివృత్తులకు సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు.

అమ్మానాన్నకు తోడుగా..



మాది కరీంనగర్. నాన్న చిరుద్యోగి. అమ్మ కులవృత్తి చేస్తుంది. నేను డిగ్రీ పూర్తిచేశాను. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. ఇంట్లోనే లాండ్రీ షాపు నడిపిస్తాం. నాన్న డ్యూటీకి వెళ్లినప్పుడు నేనూ ఇస్త్రీ చేస్తుంటాను. పొద్దంతా ఉద్యోగానికి వెళ్లివచ్చి సాయంత్రం కులవృత్తి పని చేస్తుంటా. మా పని మేము చేసుకోవడంలో ఆనందమే వేరు. ప్రభుత్వం ఇంట్లోని లాండ్రీలకు కూడా విద్యుత్‌లో రాయితీ ఇవ్వాలి. – నరేశ్, హనుమాన్‌నగర్, కరీంనగర్

15 ఏళ్లుగా ఇదే పని..



మాది సిరిసిల్లలోని సుందరయ్యనగర్. నేను పెద్దగా చదువుకోలేదు. నాకు 17ఏళ్ల వయసు అప్పటి నుంచి మరమగ్గాల కార్మికుడిగా పనిచేస్తున్నాను. దాదాపు 15ఏళ్లకు పైగా ఇదే వృతిలో కొనసాగుతున్నాను. వారానికి రూ.2,000–2,500 వరకు సంపాదిస్తాను. నాకు ఇద్దరు పిల్లలు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకే సరిపోతోంది. – పిక్కల శేఖర్, సిరిసిల్ల

ప్రభుత్వం దయ చూపాలి



నేను 16ఏళ్లుగా పెద్దపల్లిలో దర్జీగా పనిచేస్తున్నా. మా నాన్న నుంచి పని నేర్చుకున్నాను. ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాలతో గిరాకీ తగ్గిపోయింది. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతోంది. ఇక ఈ వృత్తిలోకి మా పిల్లలను రానివ్వను. ప్రభుత్వం మాపై దయచూపాలి. స్కూల్ యూని ఫాంలు కుట్టే బాధ్యత మాకే ఇవ్వాలి. ఇతర కులస్తులకు రాయితీపై బట్టలు కుట్టే మిషనరీలు ఇస్తున్నారు. అవి మాకూ ఇస్తే బాగుంటుంది. రెడీమేడ్‌పై ట్యాక్స్ విధించాలి. – మంథని నర్సింగ్, పెద్దపల్లి

వీరు ఎక్కువ...

ఉమ్మడి జిల్లా పరిధిలో నాయీబ్రాహ్మణుల్లో ఎక్కువగా యువత కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 10వేలకు మందికి పైగా యువత పట్టణాలు, గ్రామాల్లో సెలూన్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నిత్యం రూ.500 నుంచి రూ.1000 వరకు సంపాదిస్తామని పలువురు చెబుతున్నారు. తరువాత రజకులు 5వేల మంది వరకు కులవృత్తిపై ఆధారపడ్డారు. అయితే వీరికి గ్రామాల్లో తక్కువగా ఉపాధి ఉండగా.. పట్టణాలకు వలసవెళ్తున్నారు. కరీంనగర్‌లో అత్యధిక మంది యువత లాండ్రీపై ఆధారపడి బతుకుతున్నారు. విశ్వబ్రాహ్మణుల్లోనూ చాలా మంది సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 4వేలకు పైగా మంది గోల్డ్‌స్మిత్, కార్పెంటర్, ఫర్నిచర్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. గౌడకులస్తుల్లో యువత కల్లుగీయడానికి ముందుకు రావడం లేదు. ఒక్కో గ్రామంలో ఒక్కరిద్దరు మాత్రమే కల్లుగీసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3వేల మంది వరకు యువత కల్లు గీతపై ఆధారపడి బతుకుతున్నారు. సిరిసిల్లలో బట్టల తయారీలో యువతరం తమ ప్రతిభ చాటుతోంది. మత్స్యకారుల కుటుంబాల్లోనూ యువత చేపలు పడుతూ ఉపాధి పొందుతున్నారు. ఎల్ఎండీ, మిడ్‌మానేరు, ఎగువమానేరు, కాళేశ్వరంతో ఉపాధి పెరిగిందని చెబుతున్నారు. ఇక మేరు, శాలివాహనులు తదితర కులస్తులు తమ వృత్తిలో ఉపాధి లేకపోవడంతో ప్రత్యామ్నాయ బాటపడుతున్నారు. ప్రతీ కులస్తులు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరుతున్నారు. తమ వృత్తికి సంబంధించి సబ్సిడీలు, ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతున్నారు. సర్కారు ప్రోత్సాహం ఉంటే తాము మరింత ఉత్సాహంగా పనిచేస్తామని, తమ వృత్తులను బతికించుకుంటామని చెబుతున్నారు.

ఆశలు అడియాసలు

- అన్నదాతకు దెబ్బ మీద దెబ్బ
- అకాల వర్షానికి 23,674 ఎకరాల్లో నష్టం
- 11 మండలాల్లో 17,184 మంది బాధితులు
- క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ ఆరా
- పంట కోయని వరి దిగుబడి కష్టమే



చెర్లభూత్కూర్‌లో నేలవాలిన వరి పంట

కరీంనగర్‌అర్బన్: అన్నదాత ఆశలు అడియాసలయ్యాయి.. పొలాల్లో ఎటు చూసిన అన్నదాతల ఆక్రందనే. యాసంగి సీజన్‌లో 'పులి మీద పుట్రలా' తెగుళ్లు, అకాల వర్షాలు నిండా ముంచాయి. గత నెలలోనే 22 వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లగా ప్రధానంగా వరి పంట దెబ్బతింది. తాజాగా రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో మళ్లీ తీరని నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 23,674 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అంటే రెండు నెలల్లోనే 45వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లడం కర్షకునికి కోలుకోని దెబ్బ. జిల్లాలోని 11 మండలాల్లో నష్టం వాటిల్లగా వీణవంక, హుజూరాబాద్, చొప్పదండి మండలాల్లో ఎక్కువ నష్టం వాటిల్లింది. ఒక్కో రైతు నిండా మునగగా హెచ్చు రైతులకు మిగిలేది సున్నా. పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం చాలా తక్కువ. ఈ క్రమంలో ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తేనే కొండంత అండ అంటున్నారు.

106 గ్రామాలు.. 23,674 ఎకరాల్లో నష్టం

ఈనెల 21 నుంచి జిల్లాలో అకాల వర్షాలు కురుస్తుండగా బలమైన ఈదురుగాలులు పంటలకు ప్రతికూలంగా మారాయి. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం 23,674 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా 17,184 మంది రైతులు నష్టపోయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ వివరించారు. వరి 22,120 ఎకరాల్లో దెబ్బతినగా మొక్కజొన్న 342, మామిడి, బొప్పాయి 1129, కూరగాయలు 83ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రెండు రోజుల్లో రైతు వారీగా 33శాతం పంట నష్టాన్ని పరిగణలోని తీసుకుని తుది నివేదిక రూపొందించనున్నారు. 106 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లగా హుజూరాబాద్ మండలంలో చెల్పూర్, హుజూరాబాద్, కాట్రపల్లి, కందుగుల, కనుకులగిద్ద, ధర్మరాజ్‌పల్లి, జూపాక, సింగపూర్, తుమ్మనపల్లి, బోర్నపల్లి, సిర్సపల్లి, పోతిరెడ్డిపేట, జమ్మికుంట మండలంలో జమ్మికుంట, సైదాబాద్, మడిపల్లి, ధర్మారం, బిజిగిరిషరీఫ్, కోరపల్లి, తనుగుల, విలాసాగర్, వావిలాల, ఇల్లందకుంట మండలంలో బుజునూర్, రేచపల్లి, వంతడ్పుల, ఇల్లందకుంట, టేకుర్తి, మల్యాల, పాత్రలపల్లి, వీణవంక మండలంలో గన్ముకుల, బొంతుపల్లి, రెడ్డిపల్లి, కోర్కల్, కొండపాక, చల్లూరు, ఎలబాక, మామిడాలపల్లి, బేతిగల్, కనపర్తి, వల్బపూర్, వీణవంక, పోతిరెడ్డిపల్లి, బ్రహ్మణపల్లి, మానకొండూరు మండలంలో ఊటూరు, పచ్చునూరు, వేగురుపల్లి, చెంజర్ల, ఈదులగుట్టపల్లి, వెల్ది, తిమ్మాపూర్ మండలంలో నల్లగొండ, శంకరపట్నం మండలంలో మెట్‌పల్లి, ముత్తారం, కాచాపూర్, రాజాపూర్, అంబలాపూర్, శంకరపట్నం, ఎరడపల్లి, చొప్పదండి మండలంలో అర్నకొండ, రాగంపేట, చొప్పదండి, కొలిమికుంట, చిట్యాలపల్లి, గుమ్లాపూర్, కాట్నిపల్లి, రుక్మాపూర్, భూపాలపట్నం, చాకుంట, వెదురుగట్ట, గంగాధర మండలంలో బూరుగుపల్లి, సర్వారెడ్డిపల్లి, నర్సింహులపల్లి, కొండాయిపల్లి, కాచిరెడ్డిపల్లి, వెంకటాయిపల్లి, కురిక్యాల, ఉప్పరమల్యాల, గర్శకుర్తి, గట్టుబూత్కూర్, గంగాధర, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, ర్యాలపల్లి, రామడుగు మండలం వెలిచాల, వన్నారం, గోపాల్‌రావుపేట, కిష్టాపూర్, దత్తోజీపేట, కోరటపల్లి, రామడుగు, వెదిర, షానగర్, ఫకీర్‌పేట, దేశ్‌రాజ్‌పల్లి, కొక్కెరకుంట, మోతె, గుండి, చిప్పకుర్తి, తిర్మలాపూర్, రుద్రారం, లక్ష్మీపూర్, శ్రీరాములపల్లి, కరీంనగర్‌రూరల్ మండలంలో నగునూరు, జూబ్లీనగర్, ఫకీర్‌పేట, చామనపల్లి, తాహెర్ కొండాపూర్, చర్లబూత్కూర్, మొగ్దుంపూర్, కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, నాగులమల్యాలల్లో నష్టం వాటిల్లింది.

జిల్లావ్యాప్తంగా ప్రాథమిక అంచనా ప్రకారం
మొత్తం పంట నష్టం: 23,674 ఎకరాలు
నష్టపోయిన రైతులు: 17,184

ఏయే పంటలకు ఎంత నష్టం
వరి: 22,120 ఎకరాలు
మొక్కజొన్న: 342 ఎకరాలు
మామిడి: 1,129 ఎకరాలు
కూరగాయలు: 83 ఎకరాలు

కొనుగోలు కేంద్రాల్లో కర్షకుల పాట్లు

జిల్లాలో 352 కొనుగోలు కేంద్రాలకు గానూ అరకొర కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభం కాగా అత్యధిక కేంద్రాల్లో తూకం ప్రారంభం కాలేదు. ఫలితంగా వేల క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. చాలా కేంద్రాల్లో టార్పాలిన్లు సరిపడా లేకపోవడంతో రైతులు ఇళ్ల నుంచి తీసుకెళ్లి అపసోపాలు పడ్డారు. ఈనెల 26 వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించగా ధాన్యం కాపాడుకోవడం కర్షకునికి తలకుమించిన భారమే అవుతోంది.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



పనులు పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: జిల్లాకు తలమాణికంగా నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు, జంక్షన్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు, తెలంగాణా చౌక్‌లోని జంక్షన్ నిర్మాణ పనులను మేయర్ సునీల్ రావు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. డైనమిక్ లైట్ల పనులు, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చివరిదశలో ఉన్నాయని తెలిపారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న 13 జంక్షన్లను చారిత్రక, ఆధ్యాత్మిక, ధార్మిక ఘట్టాలతో కూడిన విగ్రహాలతో పాటు ఆకట్టుకునే రీతిలో వివిధ ఆకృతులతో జంక్షన్లను సుందరీకరించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ మసూద్, ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్, కార్పొరేటర్లు వాల రమణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు తదితరులు పాల్గొన్నారు.

పలకరిస్తూ.. ముందుకు సాగుతూ

- మడిపల్లి నుంచి అంకూషాపూర్ వరకు సాగిన పీపుల్స్‌మార్చ్
- జిల్లాలో ముగిసిన 'భట్టి' పాదయాత్ర



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

జమ్మికుంట(హుజూరాబాద్): జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం ముగిసింది. జమ్మికుంట మండలం మడిపల్లి పరిధిలోని శాంతినగర్‌లో బస చేసి ఉదయం పాదయాత్ర ప్రారంభించారు. మడిపల్లి, అంకుషాపూర్‌లో మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. మడిపల్లిలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను పలకరించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేస్తున్నారని రైతులు తమ సమస్యలు విన్నవించారు. అంకుసాపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చినా ఇప్పటివరకు డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరు చేయలేదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం 9 ఏళ్లుగా మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, యువకులకు ఉద్యోగాలు, రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన స్థలాలు, వ్యవసాయ భూములు మాత్రమే దర్శనమిస్తున్నాయని తెలిపారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుంటేనే పేదల బతుకులు బాగుపడుతాయని అన్నారు. రైతుల కోసం వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా అందరూ ఆదరించి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవాలని అన్నారు. జిల్లాలో పాదయాత్ర ముగిసి హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో పాదయాత్ర కొనసాగింది. ఈ పాదయాత్రలో భట్టి సతీమణి నందిని, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు ఆది శ్రీనివాస్, పత్తి కృష్ణారెడ్డి, కసుబోజుల వెంకన్న, మొలుగూరి సదయ్య, సాయిని రవి, గూడెం సారంగపాణి, ఎగ్గెటి శంకర్, సదానందం, మ్యాకమల్ల అశోక్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

భట్టికి నాగలి బహూకరణ

ఇల్లందకుంట: పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మడిపల్లిలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కని వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి రైతు నాగలిని అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. రైతులు ఏ పంట వేసిన కల్తీ విత్తనాలు, చీడపీడలు, తెగుళ్లతో ఖర్చు పెనుభారమవుతున్నాయని తెలిపారు. పంట కోత సమయంలో అకాల వర్షాలతో పంట చేతికి రాక వచ్చిన పంటకు గిట్టుబాటు ధర లేక ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేస్తామని, వరికి రూ.2,500 గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, నాయకులు పత్తి కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రావు, సారంగపాణి, గూడెపు ఓదెలు, అరెల్లి రమేశ్, మర్రి వీరారెడ్డి, గడ్డి శ్రీనివాస్, జలేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుని సిద్ధాంతాలను అనుసరించాలి



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్

కరీంనగర్: కుల వ్యవస్థ లేని సమాజ స్థాపనకు కృషి చేసి అందరికీ సమాన అవకాశాలు ఉండాలని బోధించిన బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకొని అతడి సిద్ధాంతాలను అనుసరించాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. బసవేశ్వరుని 890వ జయంతి పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్వమానవ సమానత్వాన్ని బోధించిన విశ్వ గురువుగా అందరి హృందయాల్లో బసవేశ్వరుడు చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఆకాలంలోనే మహిళా సాధికారతకు పాటుపడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్‌రావు, ఏవో జగత్‌సింగ్, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, వసతి గృహ సంక్షేమ అధికారులు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌లకు అందిన గౌరవ వేతనం

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ నగరపాలక సంస్థ గతేడాది వేసవి సెలవుల్లో అంబేడ్కర్ స్టేడియం వేదికగా నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు గౌరవ వేతనం మంజూరైంది. 2022 మేలో 30 రోజుల పాటు నిర్వహించిన శిక్షణశిబిరాల్లో 28 క్రీడాంశాల్లో 3వేల మందిపైగా, సుమారు 71 మందిపైగా కోచ్‌లు శిక్షణ ఇచ్చారు. ఒక్కో కోచ్‌కు రూ.10వేలు ఇస్తామని నగరపాలక సంస్థ ఒప్పుకుంది. 11నెలలైనా గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఇటీవల సాక్షిలో పలు కథనాలను ప్రచురించింది. తాజాగా ఈనెల 13న మరోమారు కథనాన్ని కూడాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన నగరపాలక సంస్థ కోచ్‌లకు గౌరవ వేతనం మంజూరు చేసింది. అయితే ఇస్తామన్న రూ.10 వేలకు బదులు రూ.5వేలను డీవైఎస్‌వో రాజవీరు చేతుల మీదుగా కోచ్‌లకు అందజేశారు. దీంతో పలువురు అసహనం వ్యక్తం చేయగా మరికొందరు ఇచ్చిన కాడికి తీసుకునుడే అనుకుంటూ తీసుకున్నారు.

క్లుప్తంగా

జాతీయ రోలార్ స్కేటింగ్‌లో సత్తా చాటాలి



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో రాజవీరు

కరీంనగర్ స్పోర్ట్స్: మొహాలీలో జరగనున్న జాతీయ స్థాయి రోలార్ స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటాలని డీవైఎస్‌వో కీర్తి రాజవీరు అన్నారు. ఈ నెల 26 నుంచి మే 2 వరకు నిర్వహించే జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను ఆదివారం ఆయన అభినందించారు. రోలార్ స్కేటింగ్‌కు జిల్లాలో మంచి ఆదరణ ఉందని, క్రీడాకారులు రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ పోటీలకు జిల్లా నుంచి అద్వితి చౌహాన్, అమృత, రిషిక, శర్నిక్, వికాస్, శాలిని, విశ్వక్, రుషక్ రెడ్డి, విశృత్‌లు ఎంపికైనట్లు కోచ్ గట్టు అనిల్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని జిల్లా రోలార్ స్కేటింగ్ సంఘం అధ్యక్షుడు ఐలి విజయభాస్కర్, కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

ఎంసెట్, పాలిసెట్, ఐసెట్‌లకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న రాకేశ్

కరీంనగర్: ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంసెట్, పాలిసెట్, ఐసెట్‌లకు ఉచిత శిక్షణనిస్తున్నట్లు పరిషత్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా ఏప్రిల్ చివరి నుంచి మే నెల చివరి వరకు విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన, ఇంటర్మీడియట్, ఆపై స్థాయి విద్యార్థులు అర్హులని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. రుసుం రూ.200 ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతులు నిత్యం ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఉంటాయన్నారు. నగర కార్యదర్శి పూసాల విష్ణు, జోనల్ ఇన్‌చార్జి శివ, సంయుక్త కార్యదర్శులు వంశీ, నాగరాజు, శేషాద్రి, మధు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

తిమ్మాపూర్(మానకొండూర్): అలుగునూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిల్ల రాములు, ఉపాధ్యక్షుడిగా సిల్ల కుమార్, సెక్రటరీగా తునికి మనోహర్, కార్యవర్గ సభ్యులుగా సిల్ల రాయమల్లు, తాటికొండ కుమార్, ఎలవేని సంపత్, ఎర్రవెల్లి సంపత్, గిరవేణి తిరుపతి, తాటికొండ అంజయ్య ఎన్నికయ్యారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

హైబ్రిడ్ వరి.. అందేనా చేతికి?



ఈ రైతు పేరు వేముల గంగరాజు. వీణవంక మండలం బేతిగల్ గ్రామం. ఓ ఆసామి వద్ద ఎనిమిదెకరాల భూమి కౌలుకు తీసుకొని ఆడ, మగ వరి పంట వేశాడు. నాటు వేసిన ఆదిలోనే మొగిపురుగు ఆశించింది. పంటను కాపాడుకోవడానికి నానా తంటాలు పడ్డాడు. ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. మరో నాలుగు రోజుల్లో వరి నూర్పిడి చేయాల్సి ఉండగా శనివారం రాత్రి అకాల వర్షం, ఈదురు గాలులతో 20 శాతం గింజలు నేలరాలాయి. దిగుబడి ఆశించిన స్థాయిలో వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నాడు. మరో వారం రోజులు వర్షం పడకపోతే గట్టెక్కుతానని తెలిపాడు. ఇప్పటికే ఎకరాకు రూ.35 వేల చొప్పున రూ.2.80 లక్షల పెట్టుబడి పెట్టానన్నాడు. ఇది ఈ ఒక్క రైతు పరిస్థితి కాదు. కరీంనగర్ జిల్లాలో ఆడ, మగ వరి సాగు చేసిన రైతులందరిదీ.



శనివారం రాత్రి కురిసిన వర్షానికి నేలవాలన ఆడ, మగ వరి పైరు

- కోత దశలో ఆడ, మగ పంట
- లోకల్ వరితో పోలిస్తే రెండింతల పెట్టుబడి
- చిరుజల్లులకే గింజలు నేలరాలే స్వభావం
- ఆందోళనలో రైతులు
- జిల్లాలో 49,520 ఎకరాల్లో సాగు

వీణవంక(హుజూరాబాద్): ఆడ, మగ వరి (హైబ్రిడ్) సాగు చేసిన రైతులను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. సాధారణ వరి కంటే హైబ్రిడ్ కాలపరిమితి ఎక్కువ కావడంతో కోతలకు మరో వారం పట్టనుంది. అయితే రెండు రోజులుగా అకాల వర్షాలు, ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తుండటంతో రైతులకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. సాధారణ వరితో పోలిస్తే పెట్టుబడి రెండింతలు కావడంతో కలవరపడుతున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 49,520 ఎకరాలలో ఆడ, మగ వరి సాగు చేశారు. మగ వరి కోతలు చేపడుతున్నప్పటికీ ఆడ వరి కోతలు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం చేలో బెరుకులు తీసే పనిలో రైతులున్నారు.

రాష్ట్రంలో జిల్లాదే మొదటి స్థానం

హైబ్రిడ్ వరి సాగులో రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 45 ఏళ్లుగా ఈ రకం పంట పండిస్తున్నారు. ఇక్కడి వరికి ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. క్వింటాల్‌కు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు కంపెనీలు చెల్లిస్తున్నాయి.

మగ వడ్లను కంపెనీలు తీసుకోవు

మగ వడ్లను కంపనీలు కొనుగోలు చేయవు. ఆడ వడ్లను మాత్రమే తీసుకుంటాయి. మగ వడ్లను రైతులు ప్రైవేటుగా అమ్ముకోవాల్సిందే. ఆడ వడ్లకు చిరుజల్లులకే నేలరాలే స్వభావం ఉండటంతో అకాల వర్షాలు కొనసాగితే రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. ఈ నెల 28 వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రూ.40 వేల నుంచి రూ.50 వేల పెట్టుబడి

సాధారణ వరి సాగు చేస్తే ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు, ఆడ, మగ సాగు చేస్తే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరం నాటు(హైబ్రిడ్)కు 20 మంది, సాధారణ వరికి 12 మందితో నాటు పూర్తి చేస్తారు. జిల్లాలో శంకరపట్నం, వీణవంక, పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం మండలాల్లో ఆడ, మగ వరిని ఎక్కువగా సాగు చేస్తారు. ముత్తారం మండలంలోని ఓడెడ్ గ్రామం హైబ్రిడ్ సాగులో ఆదర్శంగా నిలుస్తోంది.

20 శాతం నేలరాలిన గింజలు..

ఎకరాకు 14 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించిన రైతులు శనివారం కురిసిన వర్షంతో నిరాశ చెందుతున్నారు. 8 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తుందని, పెట్టుబడి మీద పడనుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'హెచ్-82 చేపట్టే సమ్మెతో సంబంధం లేదు'

కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ విద్యుత్ యూనియన్ హెచ్-82 చేపట్టే సమ్మెకు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)కు ఎలాంటి సంబంధం లేదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నలువాల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టిజన్స్, అన్‌మ్యాన్డ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 5 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ యాజమాన్యాలకు తమ యూనియన్ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు ఈ నెల 21న సమ్మె నోటీసు ఇచ్చారన్నారు. వేతన ఒప్పందంలో పరిష్కారం కాని సమస్యలపై వెళ్తున్న సమ్మెకు కార్మికులు సంపూర్ణ మద్దతు తెలిపి, విజయవంతం చేయాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అర్కండ్ల శివారులో ఆదివారం ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. హార్వెస్టర్‌తో వరి కోస్తుండగా ధాన్యం తరలించేందుకు కన్నాపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మంద లింగారెడ్డి రాకేశ్ అనే యువకుడితో కలిసి, పొలంలోకి వెళ్తున్నాడు. ఆ సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రాకేశ్ క్షేమంగా బయటపడ్డాడు. డ్రైవర్ లింగారెడ్డికి స్వల్ప గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లది చీకటి ఒప్పందం

- కాంగ్రెస్ పార్టీని బలహీనం చేసేందుకే రెండు పార్టీల కుట్ర
- కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, పక్కన నాయకులు

కరీంనగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీఆర్‌ఎస్, బీజేపీలు చీకటి ఒప్పందంతో అపూర్వ స్నేహబంధం కొనసాగుతుందని కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చీకటి ఒప్పందంలో భాగంగానే బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ప్రతీ బిల్లుకు బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఇచ్చిందన్నారు. గతంలో జరిగిన మునుగోడు, దుబ్బాక, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు జరుగగా, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్‌లో బీజేపీకి రెండు నుంచి మూడు వేల ఓట్లు కూడా రాలేదన్నారు. దుబ్బాకలో ముఖ్యమంత్రి ప్రచారానికి రాకుండా స్వయంగా బీఆర్‌ఎస్ పార్టీ రఘునందన్‌రావు గెలుపునకు సహకరించిందని విమర్శించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేయాల్సిన అభ్యర్థి కాంగ్రెస్ పార్టీని మోసం చేసి టీఆర్‌ఎస్ మద్దతు తీసుకొని రహస్య ఎజెండాతో నన్ను ఓడించడానికి పనిచేశారని అన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డబ్బులు పంపించిందని ఈటల రాజేందర్ ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసినట్లుగా అమ్మవారి వద్ద ప్రమాణం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు రోహిత్‌రావు, కర్రసత్య ప్రసన్నారెడ్డి, మల్యాల సుజిత్ కుమార్, మడుపు మోహన్, కంకణాల అనిల్‌కుమార్, రమేశ్, కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై సీఎంకు చిత్తశుద్ధి లేదు

చొప్పదండి: గతనెలలో జరిగిన పంట నష్టానికి ఎకరానికి రూ.10 వేలు ఇస్తానన్న సీఎం కేసీఆర్ నెల రోజుల గడిచినా పరిహారం అందకపోవడం చూస్తుంటే రైతులపై సీఎంకు చిత్తశుద్ధి లేదని తెలుస్తోందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని చాకుంటలో వడగండ్ల వర్షానికి నష్టపోయిన పంటలను పార్టీ కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్ట పోయిన పంటలను గుర్తించాలని కోరారు. ఆయన వెంట మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, వెన్న రాజమల్లయ్య, పురం రాజేశం, రంగన్న, గంగయ్యగౌడ్, ఆంజనేయులు, రాజేందర్, రమేశ్‌గౌడ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడలో జిల్లా ముందుండాలి

- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



క్రీడాకారులకు బహుమతి అందిస్తున్న రవీందర్‌సింగ్

కరీంనగర్ స్పోర్ట్స్: చదరంగం క్రీడలో జిల్లా ముందుండాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. స్థానిక గాంధీరోడ్‌లో గల ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన స్కూల్ చిల్డ్రన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కరీంనగర్ వేదికగా మరిన్ని జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ చెస్ పోటీలకు అన్ని జిల్లాల నుంచి 80 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్నా కృష్ణ, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొడుపునూరి కరుణాకర్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శివయ్య, శంకర్, కౌశిక్‌రావు, శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ ఎంపీపీకి సన్మానం



ఎంపీపీ వనితను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

తిమ్మాపూర్(మానకొండూర్): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారం అందుకున్న తిమ్మాపూర్ ఎంపీపీ కేతిరెడ్డి వనితను కేడీఆర్ యువసేన సభ్యులు, తిమ్మాపూర్ సర్పంచ్ దుండ్ర నీలమ్మ, మండల ప్రజాప్రతినిధులు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు ఆదివారం సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దుండ్ర రాజయ్య, సర్పంచ్ మీసాల అంజయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వేల్పుల మమత, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మాదన రాజేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు పోతురాజు దేవేందర్, ఎడ్ల బుచ్చిరెడ్డి, ఉపసర్పంచ్‌లు కేతిరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం



నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు



కేసీ క్యాంపులో విరిగిన విద్యుత్ స్తంభం



కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

హుజూరాబాద్: నియోజకవర్గంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా హుజూరాబాద్ మండలంలో 82.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జమ్మికుంటలో 16.02, ఇల్లందకుంటలో 10.6, వీణవంకలో 14.04, సైదాపూర్‌లో 26.04 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అకాల వర్షం వరి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. నియోజకవర్గంలో ఇప్పటికే పలుచోట్ల పంట కోతలు ప్రారంభం కాగా, మరికొన్ని చోట్ల కోత దశలో ఉంది. ఈ సమయంలో కురిసిన వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం తడిసి, కొన్నిచోట్ల కొట్టుకుపోయింది. కోత దశలో ఉన్న వరి పైరు గింజలు రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హుజూరాబాద్ మండలంలో 3,788 ఎకరాలల్లో, ఇలదకుంటలో 25 ఎకరాల్లో, వీణవంకలో 1561 ఎకరాల్లో, జమ్మికుంట మండలంలో 281 ఎకరాల్లో మొత్తం 5,655 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు విరిగి పడటంతో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయి, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా నేలవాలని వరిని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పరిశీలించారు.

డబుల్ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి



శ్రీనివాస్‌గౌడ్

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని గుండ్లపల్లి స్టేజి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం గునుకులకొండాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు ఉన్న బీటీ రోడ్డును తొలగించి, పనులు అసంపూర్తిగా వదిలేశారని తెలిపారు. దీంతో మట్టి దారిపై ప్రయాణికులు, అలాగే గునుకుల కొండాపూర్ నుంచి చీమలకుంటపల్లె వెళ్లే రోడ్డుపై కంకర పోసి, తారు వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మే 2వ తేదీన గునుకులకొండాపూర్‌లో నిర్వహించే ఎల్లమ్మ జాతరకు గుండ్లపల్లి, చీమలకుంటపల్లి, పీచుపల్లి, జంగపల్లి, తోటపల్లి గ్రామాలకు చెందిన భక్తులు వస్తారని, రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారసురాలిగా వైఎస్ షర్మిలకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
FLAT FOR SALE
■ LAUNCHING OFFER: రూ. 3లక్షలకే 18 లక్షల విలువ గల 1050Sft. గల 2BHK Flat సొంతం చేసుకోండి. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి Temple నుండి 2కి.మీ. మాత్రమే. ఫోన్: 9948525151, 6262838353 మార్కెటింగ్ కు ఏజెంట్లు కావలెను. [HA-3176]

SERVICES
TRAINING
■ శ్రీ మా కలర్స్ బ్యూటి పార్లర్ వారి Short Term Summer Training Courses, ఫీజు: 7500/-, టవర్‌సర్కిల్, కరీంనగర్. ప్రొ॥ టి.రజిత, సెల్: 9866004268, 9502292232 [K-1219985]

ఉచిత బస్‌పాస్
■ దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్: TS RTC ఆధ్వర్యంలో సదరన్ సర్టిఫికేట్ ఉన్నవారికి మాత్రమే. సంప్ర॥ యం.శివ, సెల్: 7981736578 [K-1219818]

www.sakshi.com

WANTED
■ పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్ : 9059630792 [HA-6126]
■ HYDలో ప్రముఖ E-కామర్స్, ఫార్మా MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ, జీతం: 15000-30000. ఫోన్ : 9121989324 [HA-10735]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824


మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: అంతర్జాతీయ కార్మిక పోరాట స్ఫూర్తి దినం మేడేను వారం రోజుల పాటు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. 136 ఏళ్లుగా మేడేను ఒకరోజు మాత్రమే నిర్వహించి కార్మిక ఐక్యతను ప్రదర్శించారు కానీ చికాగో అమరవీరుల స్ఫూర్తిని కార్మికుల హక్కులను నీరుగార్చడానికి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా బహుళజాతి సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా చేసిందన్నారు. మే 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాల ద్వారా కార్మికుల్లో ప్రత్యామ్నాయ శ్రమ సంస్కృతిని పెంచేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, జిల్లా కోశాధికారి జి.రాజేశం, ఉపాధ్యక్షులు గుడికందుల సత్యం, యు.శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, మరెళ్ల శ్రీలత, కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, కదిరె రమేశ్, పులిపాక ప్రసాద్, గంగాధర్, మల్లేశం, విజయలక్ష్మి, మల్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక సాహిత్య పురస్కారానికి ఎంపిక



గండ్ర లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్: జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్రం తరఫున ఏటా అందించే జాతీయ సాహిత్య పరిషత్ వెంకటరావు పంతులు ధార్మిక సాహిత్య పురస్కారానికి 2021 సంవత్సరానికి గాను సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ఎంపికయ్యారు. ఈ మేరకు పురస్కార కమిటీ కన్వీనర్ ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ ఆయన పేరును ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నెల 30న వికారాబాద్‌లో జాతీయ సాహిత్య పరిషత్ 19వ రాష్ట్ర మహాసభల్లో అవార్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, వారాల ఆనంద్, స్తంభంకాడి గంగాధర్, శ్రీనివాస్ జీయంగార్, కేఎస్ అనంతాచార్య, వేణుశ్రీ తదితరులు లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు.

విశ్వకర్మ విశిష్ట పురస్కారం అందజేత



పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

రామడుగు(చొప్పదండి): వరంగల్‌లోని శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు-2023ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం వారు అమరశిల్పి జక్కణాచార్య విశ్వకర్మ విశిష్ట పురస్కారాన్ని రామడుగుకు చెందిన శిల్పకళాకారుడు శెకల్ల హరిహరాచారి అందించారు. ఆయన మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి చేతులమీదుగా ఆదివారం అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ డాక్టర్ లాలుకోట వెంకటాచారి, అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం అధ్యక్షుడి ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న రమేశ్

కరీంనగర్: తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాజకీయ విభాగం అధ్యక్షుడిగా వాసాల రమేశ్, ఉపాధ్యక్షుడిగా మెతుకు సత్యం, కార్యదర్శిగా వల్లాల కృష్ణహరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అల్స భద్రయ్య, కార్యవర్గ సభ్యురాలిగా రుద్ర రాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ పద్మశాలీ భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎల్.రమణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామిలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

క్లుప్తంగా

ప్రతిభకు పునాదులు పుస్తకాలే



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

కరీంనగర్‌కల్చరల్: నేటి యువతలో పుస్తక పఠనం తగ్గడంతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోలేకపోతున్నారని, ప్రతిభకు పునాదులు పుస్తకాలేనని తెలంగాణ గ్రంథాలయ వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ముదగంటి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ పుస్తకదినోత్సవం సందర్భంగా వారధి స్టడీసెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పుస్తకాల పఠనంతో అభ్యసనాశక్తి, విజ్ఞానం పెరుగుతుందని, దీంతో ఏ పోటీ పరీక్షల్లో నైనా విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శాతవాహన లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత ఉపన్యాసకుడు డాక్టర్ సంగోజు మనోహరాచారి, అభ్యర్థులు తదితరులున్నారు.

వేసవి శిక్షణా శిబిరం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో మే 1 నుంచి 31వరకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లీలా ప్రియదర్శిని తెలిపారు. నృత్యం, డ్రాయింగ్, గిటార్ ప్లేయింగ్, కీబోర్డ్ ప్లేయింగ్, మార్షల్ ఆర్ట్స్, కరాటే, బాక్సింగ్, చదరంగం, క్రికెట్ అంశాలతోపాటు బాలికలకు కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్నామని ఆసక్తిగల బాలబాలికలు ఈనెల 30లోగా స్కూల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

కరీంనగర్: ప్రశ్నపత్రాల లీకుతో ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ మండిపడ్డారు. ప్రభుత్వం ఈనెల 30న పీసీ, కమ్యూనికేషన్ పీసీ, జేఎల్ఎం, ఏఈ ఒకే రోజు నాలుగు పరీక్షలు నిర్వహిస్తుండడంతో అభ్యర్థులు అన్నిపరీక్షలు ఎలా రాస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల శ్రద్ధ చూపించి జేఎల్ఎం, ఏఈ పరీక్షలు అయినా వారం లేదా 10 రోజులు వాయిదా వేసి నిరుద్యోగులకు అండగా నిలవాలని, లేకుంటే సంబంధిత బోర్డుఆఫీసులు ముట్టడిస్తామని హెచ్చరించారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న రవీందర్‌సింగ్

కరీంనగర్: స్థానిక జ్యోతినగర్‌లోని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ తండ్రి నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పెద్దపల్లి దేవేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను, రాంనగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పరామర్శించారు. అలాగే బత్తిని శ్రీనివాస్ సోదరుడు బత్తిని కరుణాకర్‌కు ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో కాలుకు ఆపరేషన్ జరగ్గా కరుణాకర్‌ను పరామర్శించారు. మాజీ కార్పొరేటర్ పెద్దపల్లి రవీందర్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, దండబోయిన రాము, తదితరులు ఉన్నారు.

వరిగడ్డే మిగిలింది

- వడగండ్ల వానకు నేలరాలిన వడ్లు
- వరికోసిన ఖర్చులు దండుగ
- పంటనష్టం అంచనా పరిశీలనకు రాని అధికారులు



నేలవాలిన పంటను చూపుతున్న రైతు



చామనపల్లిలో వడగండ్లవానకు నేల రాలిన వరిపంట

కరీంనగర్‌రూరల్: యాసంగి పంటలు సాగుచేసిన రైతులను అకాల వర్షాలు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మార్చినెలలో కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను శనివారం కురిసిన వడగండ్లు మరింత కోలుకోకుండా చేశాయి. అరగంటలోనే చేతికొచ్చిన పంట వడగళ్లవానకు నేలవాలగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. రాళ్లవానకు వరిగింజలన్నీ నేలరాలిపోయాయి. వరికోసిన వడ్లు చేతికందే పరిస్థితి లేదని ఉత్తగడ్డి మాత్రమే మిగిలిందని రైతులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు.

వడగండ్లతో తీరని నష్టం...

కరీంనగర్ మండలంలో శనివారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులు, వడగండ్లవాన రైతాంగానికి తీరని నష్టం కలిగించింది. వరి 2902 ఎకరాలు, మొ క్కజొన్న 30 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనావేశారు. మార్చినెలలో కురిసిన అకాల వర్షాలకు వరి 365 ఎకరాలు, మొక్కజొన్న 370 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రధానంగా చామనపల్లి, చెర్లభూత్కూర్, బహదూర్‌ఖాన్‌పేట, ఫకీర్‌పేట, తాహెర్‌కొండాపూర్, మొగ్దుంపూర్, నగునూరు తదితర గ్రామాల్లోని వరి నేలవాలింది. చామనపల్లి, తాహెర్‌కొండాపూర్, చెర్లభూత్కూర్ గ్రామాల్లో వడగండ్ల వానతో వరి గింజలన్నీ నేలరాలిపోయాయి. వరికోసినప్పటికీ హార్వెస్టర్‌కు కిరాయి చెల్లించినా అవసరమైన ధాన్యం వచ్చే అవకాశం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెర్లభూత్కూర్‌లో ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్ 3 ఎకరాలు, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి 8, తాహెర్‌కొండాపూర్‌లో డైరెక్టర్ మడికంటి మారుతీ 6 ఎకరాల్లో నష్టపోయారు.

పెట్టుబడి పోయింది



నాకున్న ఐదేకరాలతో పాటు మరో ఆరేకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. ఏడాదికి ఎకరాకి రూ. 15వేల చొప్పున చెల్లిస్తున్నాను. పెట్టుబడి దాదాపు రూ. 1.50లక్షలు పెట్టాను. నాలుగైదు రోజుల్లో వరికోద్దామనుకుంటే వడగండ్ల వానకు గింజలన్నీ నేలరాలాయి. పెట్టుబడి, కౌలుడబ్బులు మీదపడడంతో అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది.

– ఈరు శ్రీనివాస్, కౌలు రైతు, చెర్లభూత్కూర్


గింజలన్నీ నేలరాలాయి..



నాకున్న రెండున్నర ఎకరాల్లో వరిసాగుచేశాను. రెండు, మూడురోజుల్లో వరికోసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా శనివారం వడగండ్ల వర్షం రావడంతో గింజలన్నీ రాలిపోయాయి. హార్వెస్టర్‌తో వరికోసినా ఒక్కగింజ వచ్చే అవకాశం లేదు. పశువులకు మేతగా విడిచిపెట్టాల్సి వస్తోంది. అధికారులు పంటనష్టం అంచనాకు రాలేదు.

– చింతల లక్ష్మణ్, రైతు, తాహెర్‌కొండాపూర్

నేటినుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు



బద్దిపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం



స్వయంభూగా వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో స్వయంభూగా వెలిసిన శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఇంటింటా కలశ స్థాపన, మహాకుంభ స్థాపన, 25న స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం 26న సాయంత్రం 6.35 గంటలకు శ్రీ అలివేలు మంగ శ్రీలక్ష్మీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 27న ఇంటింటా కలశ స్థాపన చేసి కలశాలతో ఊరేగింపుగా వచ్చి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా సాయంత్రం రథోత్సవం, పుష్కరిణి ప్రతిష్ట చక్రస్నానం, పుష్పయాగం, ఏకాంతసేవ, తీర్థ ప్రసాదవితరణతో బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు.

భక్తిభావన ముఖ్యం



ప్రసంగం చేస్తున్న పురాణం మహేశ్వర శర్మ

విద్యానగర్(కరీంనగర్): ప్రేమ విశ్వజనీనమైనదని భగవంతుడికి ప్రేమతో కూడిన భక్తిభావన ముఖ్యమని శ్రీదుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీ దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు ఆదివారం అమ్మవారికి అభిషేకం, శతచండీ యాగం, పూర్ణాహుతి, నీరాజనం, మహారుద్ర పునశ్చరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, కార్పొరేటర్లు ఆర్ష కిరణ్మయి మల్లేశం, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, కొలగాని శ్రీనివాస్, వంగళ శ్రీదేవి పవన్‌కుమార్, కోల మాలతి, ఆలయకమిటీ సభ్యులు ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, వేములవాడ ద్రోణాచారి, ముక్క ప్రభాకర్, శానగొండ మధుసూదన్, మూల ప్రభాకర్ రెడ్డి, శివరామ్, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



సదస్సులో మాట్లాడుతున్న గంట కల్యాణి

విద్యానగర్(కరీంనగర్): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కరీంనగర్ మహిళా కార్పొరేటర్లు గంట కల్యాణి, నక్క పద్మ అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మహిళా చైతన్యసదస్సుకు హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు ఎన్నోరకాలుగా వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకొని తమ హక్కులు సాధించుకోవాలన్నారు. మహిళలు ధైర్యంగా అన్నిరంగాల్లో ముందుకెళ్లాలన్నారు. ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం మహిళావిభాగం జిల్లా అధ్యక్షురాలు సుంచు లతాశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి మహేశ్, రాష్ట్రఉపాధ్యక్షుడు కల్వల రాంచందర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మొగురం రమేశ్, జిల్లా అధ్యక్షుడు సాంబరి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి గరిగే ప్రభాకర్, మహిళా ప్రధాన కార్యదర్శి కుంభాల లత, మహిళా నాయకురాలు బండ శకుంతల, న్యాయవాదులు పిట్టల కవిత, జక్కన పల్లి గణేశ్, నాయకులు గొట్టె అర్జున్, తాళ్ల వెంకటేశ్, గంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు కొదువ లేని కరీంనగర్

కరీంనగర్‌కల్చరల్: సినీ సంగీత, సాహితీ, కళలు, కవులు, కళాకారులతో కళకళలాడే కరీంనగర్‌కు కవులు, కళాకారులకు కొదవలేని జిల్లా కరీంనగర్ అని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం ఫిలింభవన్‌లో సినీదర్శక నిర్మాత కె.విశ్వనాథ్, రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, సింగర్ వాణీ జయరాంల స్మృతిలో భాగంగా సంగీత సాహితీ కళాకారులతో నిర్వహించిన కిట్ల స్వర నీరాజనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సినారె లాంటి ఎంతోమంది కవులు, రచయితలు, సినీ సంగీత, సాహిత్య కళాకారులు ప్రపంచ నలుమూలలకు కరీంనగర్ జిల్లా ఖ్యాతిని చాటి చెప్పారన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అమృతవర్షిణి ఆడిటోరియం కూడా నిర్మిస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని తె లిపారు. చిన్నారులను ప్రోత్సహించేలా ప్రత్యేక నూతన బాలభవన్ కూడా నిర్మిస్తున్నామని అన్నారు. కళాకారుల వెంట మా పాలకవర్గం ఉండి పలుకార్యక్రమాల్లో సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో కళాకారులు, గాయకులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న తిరుపతి

కరీంనగర్: ప్రభుత్వాస్పత్రిలో నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్‌చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో అర్హులైన అభ్యర్థులు ఉద్యోగ నియామక ప్రక్రియలో అన్యాయం జరిగిందని అభ్యర్థులతో డీవైఎఫ్ఐ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాతా చిల్డ్రన్ ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల భర్తీపై నోటిఫికేషన్‌లో లోకల్, నాన్‌లోకల్ మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి దరఖాస్తు చేసుకున్న వారిని మెరిట్ ప్రకారం కాకుండా ప్రభుత్వాస్పత్రి సిబ్బంది కొంతమంది కిందిస్థాయి అధికారులు పైస్థాయి అధికారులను పక్కదారి పట్టించి ఎంపికప్రక్రియలో అర్హులైన అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి 2020 నుంచి నేటివరకు ప్రతీ నోటిఫికేషన్లలో మెరిట్ జాబితాలు, సెలక్షన్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి స్పందించి న్యాయవిచారణ జరిపించాలని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో న్యాయ విచారణ చేసేంత వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఉద్యోగంలో అర్హత కోల్పోయిన అభ్యర్థి గంగాధర్ శేఖర్ మాట్లాడుతూ.. న్యాయంచేయాలని మంత్రి, కలెక్టర్‌ను సంప్రదిస్తే స్పందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా న్యాయవిచారణ జరిపించాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు నరేశ్, లక్‌పతి, శేఖర్, నవీన్, విజయ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

డెయిరీలో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కరీంనగర్ క్రైం: నగరంలోని కరీంనగర్ డెయిరీలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. డెయిరీ ఆవరణలో పశువుల కోసం ఉంచిన ఎండుగడ్డికి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని, మంటలు చెలరేగాయి. డెయిరీ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. నీళ్లు చల్లి, మంటలను ఆర్పినట్లు కరీంనగర్ స్టేషన్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

మహాత్మ బసవేశ్వర విగ్రహం ఏర్పాటుకు కృషి



పూజలు చేసున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కల్చరల్: వీరశైవుల ఆరాధ్య దైవం మహాత్మ బసవేశ్వర విగ్రహం నగరంలో ఏర్పాటుకు కృషి చేస్తానని మేయర్ సునీల్‌రావు హామీ ఇచ్చారు. ఆదివారం బసవేశ్వర జయంతి సందర్భంగా వీరశైవ మహాసభ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సుభాశ్‌నగర్‌లోని సంఘం స్థలంలో ఏర్పాటుచేసిన బసవేశ్వర జయంతి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషిచేస్తానన్నారు. అంతకు ముందు బసవేశ్వర విగ్రహం వద్ద పూజలుచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థచైర్మన్ అనిల్, కార్పొరేటర్ ఆర్షకిరణ్మయి మల్లేశం, అధ్యక్ష ఉపాధ్యక్షులు శంకరయ్య, నాగరాజు, ప్రధాన కార్యదర్శి అంజనీకుమార్, కోశాధికారి చంద్రమౌళి, మహిళాఅధ్యక్షురాలు ఉమారాజేశ్, యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు కరుణకర్, సంతోష్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు కోటకుమార్, నాగేంద్రప్రసాద్, సత్తయ్య, మహేశ్, శంకర్, వీరశైవ లింగాయత్‌లు తదితరులున్నారు.

జిల్లాలో నేడు నిర్వహించే 'కంటివెలుగు' శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సోమవారం 44 ప్రాంతాల్లో 'కంటివెలుగు' వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 2, 3, 9, 19, 24, 25, 29, 34, 48, 50, 52, 59వ డివిజన్‌లలో హుజూరా బాద్ పట్టణంలో 20వ వార్డులో మండలంలోని సింగపూర్, రాంపూర్ గ్రామాల్లో జమ్మికుంట పట్టణంలోని 14 వార్డులో, పాపయ్యపల్లి, మాచినపల్లి గ్రా మాల్లో వీణవంక మండలంలోని గన్ముక్కుల, వల్బ పూర్ గ్రామాల్లో, చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి, నవాబుపేటగ్రామాల్లో, చొప్పదండి మండలంలోని ఆర్నకొండ, చిట్యాలపల్లి గ్రామాల్లో, ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామంలో గంగాధర మండలంలోని నాగిరెడ్డిపూర్, గట్టు బూ త్కూర్ గ్రామాల్లో, రామడుగు మండలంలోని వెలి చాల, దత్తోజీపేట గ్రామాల్లో కొత్తపల్లి మండలంలో నిచింతకుంట, ఖాజీపూర్ గ్రామాల్లో, కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో, మానకొ ండూరు మండలంలోని శంషాబాద్, అన్నారం, రంగంపేట, దేవంపల్లి గ్రామాల్లో, సైదాపూర్ మండల లోని జాగీర్‌పల్లి, రాయికల్ గ్రామాల్లో, శేషపట్నం మండలంలోని గద్దపాక, ఇప్పలపల్లి గ్రామాల్లో తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం, పోలంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో, గన్నేరువరం మండలంలోని పారువెల్ల గ్రామంలో కంటివెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు



పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



మొక్కులు చెల్లించుకుంటున్న గౌడ కులస్తులు

కరీంనగర్‌కల్చరల్: గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని అన్ని డివిజన్లు ప్రాంతాల నుంచి హాజరైన గౌడకులస్తులు ఇంటికో బోనంతో కోతిరాంపూర్‌లోని పోచమ్మ ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, సుడా డైరెక్టర్ శ్రీనివాసగౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మాచర్ల ప్రసాద్, కోడూరి మహేందర్‌గౌడ్, నాగుల కిరణ్ గౌడ్ తదితరులున్నారు.

వర్ష బీభత్సం



నేలరాలిన మామిడి కాయలు



జూబ్లీనగర్‌లో పడిపోయిన విద్యుత్‌స్తంభం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలో శనివారం కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. అరగంట పాటు ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానకు వరిపంట, మొక్కజొన్న పంట నేలవాలింది. మామిడికాయలు నేలరాలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


ట్రాన్స్‌కోకు రూ.30లక్షల నష్టం

చామనపల్లి, జూబ్లీనగర్, చెర్లభూత్కూర్, దుబ్బపల్లి, బహదూర్‌ఖాన్‌పేట, ఇరుకుల్ల, ఎలబోతారం, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లో చెట్లు విరిగిపడడంతోపాటు ఈదురుగాలులకు విద్యుత్‌స్తంభాలు 31, ట్రాన్స్‌ఫార్మర్లు 3 దెబ్బతిన్నాయి. దీంతో శనివారం రాత్రంతా చామనపల్లి, కొండాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు చీకట్లోనే కాలం గడిపారు. ఆదివారం రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అకాల వర్షంతో దాదాపు రూ. 30లక్షల వరకు నష్టం జరిగినట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏడీఈ కె.రాజు తెలిపారు.

54 ఎకరాల్లో కూరగాయలకు నష్టం

ఎలబోతారంలో గాలివానకు దారం జగన్నాథరెడ్డికి చెందిన కోళ్లఫారం షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈదురుగాలులకు రేకులు విరిగిపడడంతోపాటు కొట్టుకుపోయాయి. దాదాపు రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. అంతేకాకుండా రెండెకరాల్లో సాగుచేసిన వరిపంట నేలవాలింది. చామనపల్లి, ఫకీర్‌పేట, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లో 40 మంది రైతులకు సంబంధించిన 54 ఎకరాల్లో కూరగాయలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన అధికారి స్వాతి తెలిపారు. ఇరుకుల్ల, దుర్శేడ్, చేగుర్తి, మొగ్దుంపూర్ తదితర గ్రామాల్లో 170 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు వివరించారు.

అన్నదాతలను ఆదుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కరీంనగర్: జిల్లాలో పలుచోట్ల కురిసిన వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో అధికారులు సర్వేచేసి పంటనష్టం అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం డిమాండ్ చేశారు. చొప్పదండి మండలం కాట్నపల్లి, మల్లన్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాలను ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్ సందర్శించి పరిశీలించారు. కరీంనగర్ రూరల్ ,చొప్పదండి, రామడుగు, వీణవంక, జమ్మికుంట, శంకరపట్నం, గంగాధర, సైదాపూర్, తదితర మండలాల్లో కురిసిన అకాల వర్షానికి కోతకు వచ్చిన వరి దెబ్బతినగా, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యంపై వడగళ్లతో పూర్తిగా తడిసిపోయిందన్నారు. మొక్కజొన్న పంటలు, మామిడి తోటలు ఈదురుగాలులకు నేలరాలాయన్నారు. మల్లన్నపల్లిలో గోల్లె లక్ష్మయ్యకు చెందిన 10 ఎకరాలతో పాటు మరో 30 ఎకరాలు వడగళ్ల వానకు పూర్తిగా నేలమట్టమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలుకేంద్రాలు ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మరిన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. మార్చిలో కురిసిన వర్షానికి జిల్లాలో 10వేల ఎకరాలకు పైగా పంటనష్టం వాటిల్లిందని నేటికీ రైతులకు నష్టపరిహారం అందకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో అధికారులు పంటనష్టం అంచనా వేసి ఎకరానికి రూ.20వేలు పరిహారం ఇవ్వాల ని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని, కాంటావేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్‌టౌన్: శ్రీరాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సరళ, ఉపాధ్యక్షులుగా నరహరి లక్ష్మారెడ్డి, శశికళ, కోశాధికారిగా డి.స్వాతి, క్లబ్ చైర్‌పర్సన్‌గా రాళ్లబండి శంకర్ ప్రసాద్‌రెడ్డి, క్లబ్ కో ఆర్డినేటర్‌గా ఊకంటి సంపతి కుమారి, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా ఎం.రాజశేఖర్‌రెడ్డి, క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా ఆర్. శశికళ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్‌గా సీహెచ్. మల్లారెడ్డి, కే.విద్యాసాగర్‌రెడ్డి, క్లబ్ ఫ్యామిలీ ఉమెన్ చైర్‌పర్సన్‌గా ఎం.ఉషావాణితో పాటు 8 మందిని డైరెక్టర్లను ఎన్నుకున్నారు.

నియామకం

గన్నేరువరం: భీమ్ ఆర్మీ గన్నేరువరం మండల అధ్యక్షుడిగా హన్మాజిపల్లెకుచెందిన రాధారం రమేశ్ నియామకమయ్యారు. ఈమేరకు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎలగందుల అనిల్ ఉత్తర్వులు జారీ చేశారు. మహనీయుల ఆశయాలను అనుగుణంగా బహుజనులను చైతన్యం పరుస్తూ బాధ్యతలను నిర్వహిస్తానని రమేశ్ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్: రాజశేఖర్ - 9618304759
చొప్పదండి: ముండయ్య - 7997958217
మానకొండూర్: మహేశ్ - 9573106760
హుజూరాబాద్: ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

క్లుప్తంగా...

వివేకా కేసులో ఐదో రోజూ కొనసాగిన విచారణ

- భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా వరుసగా ఐదో రోజు కూడా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. వారిని ఆదివారం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు నుంచి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. సాయంత్రం 4.20 గంటలకల్లా విచారణను పూర్తి చేసి.. వారిద్దరినీ తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పులివెందులలో సీబీఐ విచారణ

- పలు ప్రాంతాలను పరిశీలించిన దర్యాప్తు అధికారులు


వైఎస్ వివేకా ఇంటి వద్ద కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాతో సీబీఐ అధికారులు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం సాయంత్రం సీబీఐ అధికారులు వైఎస్సార్ జిల్లా పులివెందులకు వచ్చారు. తొలుత వివేకా ఇంటి వద్దకు వెళ్లి.. బయటి నుంచే పరిసరాలను పరిశీలించారు. ఆ తర్వాత వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. అక్కడ ఉన్న పీఏ రమణారెడ్డితో మాట్లాడారు. అనంతరం మళ్లీ వివేకా ఇంటికి వచ్చి.. కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాను తమ వాహనంలో ఎక్కించుకుని కొద్దిసేపు అక్కడే విచారించారు. ఆ తర్వాత ఇనయతుల్లాను తీసుకొని మళ్లీ భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జమ్మలమడుగు ప్రచారానికి వెళుతూ ఘటన గురించి తెలిసిన వెంటనే తిరిగొచ్చిన స్థలాన్ని చూపించాలని పీఏ రమణారెడ్డిని సీబీఐ అధికారులు కోరారు. దీంతో రమణారెడ్డి రింగ్ రోడ్డులోని కృష్ణ టెంపుల్ సమీపంలో ఉన్న ప్రాంతాన్ని సీబీఐ అధికారులకు చూపించాడు. ఆ ప్రాంతాన్ని చూసిన అనంతరం సీబీఐ అధికారులు వివేకానందరెడ్డి ఇంటి లోపలికి వెళ్లి పరిశీలించారు. ఇనయతుల్లాను అక్కడే వదిలేసి కడపకు వెళ్లిపోయారు.

తప్పు ఒప్పుకున్నా ఇంకా సమర్థిస్తారా?

రామోజీ నిర్వాకాలపై నిలదీసిన న్యాయ కోవిదులు, ప్రముఖులు

- మార్గదర్శి అక్రమాలు–నిజానిజాలపై విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక సదస్సు

సాక్షి, అమరావతి: మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్లు విచారణలో రామోజీరావే అంగీకరించాక కొందరు ఇంకా ఆయన్ను సమర్థించేందుకు ప్రయత్నించడం అసంబద్ధమని న్యాయ నిపుణులు స్పష్టం చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్ట విరుద్ధంగా చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా తమ అనుబంధ సంస్థలు, ఇతర చోట్ల పెట్టుబడిగా పెట్టినట్లు రామోజీనే అంగీకరించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమాలకు పాల్పడుతుంటే చట్టం కళ్లు మూసుకుని చూస్తూ ఊరుకోదని తేల్చి చెబుతున్నారు. 'రామోజీరావు మార్గదర్శి అక్రమాలు – నిజానిజాలు' అనే అంశంపై ఆదివారం విజయవాడలో స్వర్ణాంధ్ర పత్రిక నిర్వహించిన సదస్సులో పలువురు ప్రముఖులు, న్యాయ కోవిదులు పాల్గొని మాట్లాడారు.

ఉపేక్షిస్తే మాఫియా సామ్రాజ్యమే: ఉండవల్లి

రామోజీరావు ఆగ్రహిస్తేనో, ఈనాడు పత్రికల్లో వ్యతిరేకంగా రాస్తేనో ఏదో జరిగిపోయే రోజులు పోయాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గతంలో రాజమండ్రిలో తనను ఓడించేందుకు రామోజీ ఎంతో ప్రయత్నించినా తాను గెలిచానని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల కూడా ఈనాడు అలాగే వ్యవహరిస్తోందన్నారు. అయితే అప్పుడు జరిగిందే రేపు కూడా జరుగుతుందని వ్యాఖ్యానించారు. 'రామోజీరావు తాను చట్టాలను పట్టించుకోనంటారు. చట్టాలకు అతీతమన్నట్లుగా వ్యవహరిస్తారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని వాదిస్తారు. తాను ఆర్థిక అక్రమాలకు పాల్పడినా అడగకూడదని వితండవాదం చేస్తారు. 60 ఏళ్లుగా తన అక్రమాలను ఎవరూ ప్రశ్నించలేదు కాబట్టి ఇప్పుడూ అడగడానికి వీల్లేదని చెబుతారు. రామోజీరావు లాంటి వారిని వదిలేస్తే దేశంలో అతిపెద్ద మాఫియా సామ్రాజ్యం తయారవుతుంది' అని ఉండవల్లి అరుణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.

నాడు మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు

'మార్గదర్శి ఫైనాన్సియర్స్ విషయంలోనూ 2006లో రామోజీరావు అడ్డగోలుగా వాదించారు. హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చన్న రామోజీ వాదనను ఆర్బీఐ సమ్మతించలేదు. ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. దీంతో తాము ప్రజల నుంచి రూ.2,600 కోట్లు డిపాజిట్లు సేకరించడం తప్పని రామోజీరావు ఆర్బీఐ వద్ద అంగీకరించారు. ఆ డిపాజిట్లను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. కానీ ఎవరెవరి నుంచి డిపాజిట్లు వసూలు చేశారో చెప్పమంటే వెల్లడించలేదు. ఆ డిపాజిట్‌దారుల వివరాలు తెలియచేయాలని ఇటీవలే సుప్రీం కోర్టు ఆదేశించింది.

హాయిగా మంచంపై పడుకుని..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను నిర్వహిస్తున్న రామోజీరావు అసలు తాను కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని పట్టించుకోనని సీఐడీ విచారణలో వాదించడం బరితెగింపే. చిట్‌ఫండ్ సంస్థలు తమ చందాదారుల నుంచి వసూలు చేసే సొమ్మును జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చట్టంలో ఉంది. కానీ ఆ నిధులను రామోజీరావు తన సొంత సంస్థల్లో పెట్టుబడిగా పెట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై రామోజీరావు, ఆయన కోడలిని విచారించేందుకు సీఐడీ అధికారులే వారి ఇంటికే వెళ్లాల్సి వచ్చింది. రామోజీరావు హాయిగా మంచంపై పడుకుని ఉంటే సీఐడీ అధికారులు ఏవో ప్రశ్నలు అడిగి వచ్చారు. దేశంలో ఇతరులకు అలా సాధ్యం అవుతుందా? పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తారు. రామోజీరావు కాబట్టి ఏదైనా చెల్లుతుంది.


సదస్సులో ప్రముఖులు, న్యాయ కోవిదులు

అక్రమాలను ప్రశ్నిస్తే కక్షగట్టడమా?

మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి రూ.2,600 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేస్తే రామోజీరావు గ్రూపు సంస్థలు రూ.1,850 కోట్లు నష్టం చూపించాయి. మరి రామోజీరావు బోర్డు తిప్పేస్తే డిపాజిట్‌దారుల పరిస్థితి ఏమిటని నేను అడగడం తప్పా? మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అక్రమాలను నేను ప్రశ్నిస్తే రామోజీపై కక్ష గట్టానని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు వాదిస్తుండటం విడ్డూరం. రామోజీరావుకు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు అసలు సంబంధం లేదంటూ రాజాజీ అనే వ్యక్తితో నాపై పరువునష్టం దావా వేయించారు. అప్పుడు ఈ ఆడిటర్లు, లాయర్లు ఒక్కరైనా మాట్లాడారా?

బాబు – రామోజీ క్విడ్ ప్రోకో

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా సరే అన్ని పార్టీలు రామోజీరావును కీర్తిస్తూ పోటీలు పడి మరీ ప్రకటనలు ఇస్తున్నాయి. చంద్రబాబు – రామోజీరావుకు మధ్య క్విడ్ ప్రోకో ఉంది. తన మాట వినలేదు కాబట్టే ఎన్టీఆర్‌ను ఈనాడు దించేసింది. ప్రస్తుతం చంద్రబాబు రామోజీ చెప్పినట్లే నడుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్న వారంతా పోటీలు పడి మరీ రామోజీని సమర్థిస్తూ మాట్లాడుతున్నారు.


మాట్లాడుతున్న ఉండవల్లి

రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్ స్పందించారు

ఏపీ విభజన చట్టమే తప్పు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నేను సుప్రీంకోర్టులో కేసు వేశా. దానిపై ఏపీ ప్రభుత్వం తరఫున ఇంప్లీడ్ కావాలని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఆయన్ను కలసి మరీ అభ్యర్థిస్తే పట్టించుకోలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని ఓ ప్రెస్‌మీట్‌లో కోరా. వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ కేసులో ఇంప్లీడ్ అవుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం వైఎస్ జగన్ స్పందించారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమాల కేసులో సుప్రీంకోర్టులో నేను వేసిన కేసులో ఏపీ ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యింది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం ఇంప్లీడ్ కాలేదు. ఎక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఇంప్లీడ్ అవుతుందో అనే భయంతో రామోజీరావు ఈనాడులో టీఆర్‌ఎస్‌కు భజన చేస్తున్నారు. సచివాలయాన్ని నిర్మిస్తే మయసభ నిర్మించినట్టుగా పెద్ద పెద్ద వార్తలు వేసి కేసీఆర్‌ను ఖుషీ చేయడానికి ప్రయత్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సక్రమంగా వ్యవహరిస్తోంది. మార్గదర్శి అక్రమాల కేసును సమగ్రంగా విచారించి సరైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంది.

టీడీపీతో చర్చకు సిద్ధంగా ఉన్నా

చంద్రబాబు, మార్గదర్శి వ్యవహారాలపై చర్చకు నేను సిద్ధంగా ఉన్నా. టీడీపీ అధికార ప్రతినిధి హోదాలో చంద్రబాబు ఎవరినైనా చర్చకు పంపాలి. సింగపూర్, దుబాయిలో చంద్రబాబు ఆస్తులు లాంటి కష్టమైన ప్రశ్నలు ఏవీ నేను అడగను. టీడీపీ ప్రభుత్వంలో వ్యవహారాలపైనే అడుగుతా. అని మాజీ ఎంపీ ఉండవల్లి అన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించామని అంగీకరించిన రామోజీ

మార్గదర్శి సంస్థ వ్యవహారాల విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్టు రామోజీరావే అంగీకరించాక ఆయన తప్పు చేయలేదని ఇతరులు ఎవరో మాట్లాడటం అసంబద్ధమని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్. సత్యనారాయణ ప్రసాద్ పేర్కొన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ చట్టాన్ని ఉల్లంఘించి చందాదారుల సొమ్మును జాతీయ బ్యాంకుల్లో కాకుండా ఇతర సంస్థల్లో పెట్టుబడి పెట్టినట్టు రామోజీరావే అంగీకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు సెక్షన్ 160 కింద నోటీసులు ఇవ్వడాన్ని కొందరు ఆడిటర్లు, న్యాయవాదులు ప్రశ్నించడం సరికాదని సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్.సత్యన్నారాయణ ప్రసాద్ స్పష్టం చేశారు. తమకు ఎవిడెన్స్ చట్టం 126 కింద మాత్రమే నోటీసులు ఇవ్వాలన్న వారి వాదన పూర్తిగా సత్యదూరమన్నారు. సెక్షన్ 126 అన్నది కేవలం ఒక అర్జిదారు, అతడి న్యాయవాదికి సంబంధించిన వ్యవహారాలకే వర్తిస్తుందన్నారు. కేసు అంశాలపై మాట్లాడినవారికి సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంటుందని సోదాహరణంగా వివరించారు. ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని మార్గదర్శి ఫైనాన్షియర్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడతామంటే ఎలా? అని సదస్సు నిర్వాహకుడు, ప్రముఖ పాత్రికేయుడు కేజీబీ తిలక్ ప్రశ్నించారు. చట్టాలు సక్రమంగా అమలయ్యేలా వాచ్‌డాగ్‌గా ఉండాల్సిన మీడియా కొందరి పెంపుడు కుక్కగా మారుతుండటం విషాదకరమన్నారు. సమాచార హక్కు చట్టం పూర్వపు కమిషన్ అంబటి సుబ్బారావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్వ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డితోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.

ఇళ్ల నిర్మాణంలో ఏపీ భేష్

- పేదల ఇళ్ల కోసం ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ
- దేశంలో ఇంత పెద్ద ఎత్తున మరే రాష్ట్రంలోనూ ఇళ్ల స్థలాలివ్వలేదు
- కేంద్ర హౌసింగ్ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసలు

సాక్షి, అమరావతి : పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని కేంద్ర గృహ నిర్మాణ–పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 30 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్ భూములను సేకరించి.. ఏకంగా 68,677 ఎకరాలు పంపిణీ చేసిందని కొనియాడింది. ఇళ్ల స్థలాల పట్టాలన్నీ మహిళల పేరుపై మంజూరు చేయడం ద్వారా వారి సాధికారతకు తోడ్పడుతోందని మెచ్చుకుంది. దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోనూ ఇంత పెద్ద ఎత్తున పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ జరగలేదని, వారందరికీ ఇళ్ల నిర్మాణం కోసం కొత్తగా ఏకంగా 17,005 జగనన్న కాలనీలను నిర్మిస్తోందని వివరించింది. దేశంలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో 'సరసమైన గృహాలు – ఉత్తమ పద్ధతులు' అంశంపై అధ్యయనం చేసిన కేంద్ర గృహ నిర్మాణ – పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. ఇటీవల నివేదికను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అనుసంధానం చేసి, లబ్ధిదారులకు ప్రయోజనాలు అందిస్తోందని ఆ నివేదికలో పేర్కొంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజనతో గృహాలకు ఎల్‌పీజీని, ప్రధానమంత్రి సహజ బిజిలీ హర్ ఘర్ యోజన కింద విద్యుత్, జలజీవన్ మిషన్ కింద తాగునీరు, జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అండగా నిలిచిందని వెల్లడించింది. వీటితో పాటు మహిళా సాధికారతలో భాగంగా అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా ఆర్థిక సాయం చేస్తూ.. పిల్లలను చదివించేందుకు తల్లులకు అధికారం కల్పించే పథకాన్ని అమలు చేస్తోందని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

తెలంగాణ హెల్త్ ప్రొఫైల్ ఓ వరం

- కేన్సర్ నియంత్రణకు చర్యలు.. చికిత్సకు రూ.800 కోట్లు ఖర్చు
- రూ.2 కోట్లతో కార్మిక భవన్: హరీశ్


దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్/హుస్నాబాద్: ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హెల్త్ ప్రొఫైల్ వరం లాంటిదని, నిర్ధారణ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించే అవకాశం ఉంటుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆదివారం డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...రాష్ట్రంలో మొట్టమొదటి డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రారంభించుకున్నామని, ఖమ్మం, కరీంనగర్, సిరిసిల్ల, వనపర్తిలో థెరపీ యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో ఎనిమిది వైద్య కళాశాలల్లో, అనంతరం 33 జిల్లాల్లో యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

50మందికి ట్రై మోటార్ సైకిళ్లు...

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని మంత్రి హరీశ్‌రావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో 50 మంది దివ్యాంగులకు ట్రై మోటార్ సైకిళ్లు పంపిణీ చేశారు. సిద్దిపేటలో కార్మిక దినోత్సవం రోజున రూ.3కోట్లతో కార్మిక భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల్లో ఆయన పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 1,002 రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పామని, ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని తెలిపారు.


ఎడ్లబండితో సామగ్రి దాటిస్తూ..


ప్రాణహితలో కాలినడక దాటుతున్న ప్రయాణికులు

నది పొడవునా... నడక

తెలంగాణ జలప్రదాయని ప్రాణహిత నదికి వరద తీవ్రత గణనీయంగా తగ్గుతోంది. దీంతో నదిలో పలు చోట్ల కాలినడక సాచ్చి రేవులు మొదలయ్యాయి. నదిపై వంతెనలు లేకపోగా సాచ్చిరేవులతో రాకపోకలు కొనసాగిస్తున్నారు. వార్ధా, పైన్‌గంగా సంగమంతో కౌటాల మండలం తుమ్మిడి హెట్టి పైభాగంలో ప్రాణహిత నది ఆవిర్భవించింది. ఈ నదికి సుమారు 120 కిలోమీటర్ల మధ్య ప్రవహిస్తున్న ప్రాణహితలో వంతెనలు లేవు. దీంతో ఈ సరిహద్దు గ్రామాలకు ఏడాదిలో ఎనిమిది నెలలు పడవ ప్రయాణం, నాలుగు నెలలు కాలినడకన సాచ్చి రేవుల ద్వారానే రాకపోకలు కొనసాగుతాయి. ప్రతి ఏటా డిసెంబర్, జనవరి నెలల్లోనే సాచ్చి రేవులు ఏర్పడతాయి. - వేమనపల్లి



బైక్‌ను నది దాటిస్తూ..

బాసరలో భక్తుల రద్దీ


బాసర ఆలయంలో భక్తుల సందడి

భైంసా(ముథోల్): చదువులతల్లి నిలయమైన బాసరలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. బాసరకు వచ్చిన భక్తులు ముందుగా గోదావరిలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం గంగమ్మతల్లికి, గోదావరినది ఒడ్డున ఉన్న సూర్యేశ్వరస్వామికి పూజలు చేశారు. అనంతరం వ్యాసగుహ వద్దకు వెళ్లి పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు తరలిరావడంతో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో రద్దీగా కనిపించింది. సాయంత్రం హారతి ఘాట్ వద్ద హోమ పూజల్లోనూ పాల్గొన్నారు.

బాసరలో అన్యమత ప్రచారం!


అన్యమత గ్రంథ పుస్తకాలు పరిశీలిస్తున్న స్థానికులు

భైంసా(ముథోల్): బాసరలో ఆదివారం అన్యమత ప్రచారం కలకలం రేపింది. గ్రామంలోని పోచమ్మగల్లిలో గీతా పఠనం ముసుగులో బైబిల్ పఠనం చేస్తున్నారని తెలియడంతో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్నాల సాయినాథ్‌తోపాటు స్థానిక యువకులు వారి బ్యాగులు పరిశీలించగా అన్యమత గ్రంథాలు లభించాయి. పోలీసులకు సమాచారం అందించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

నిర్మల్: ఆత్మహత్యలకు అడ్డగా మారుతున్న బాసరలో మరో వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి సూసైడ్‌కు యత్నించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ముథోల్ నియోజకవర్గంలోని వట్టోలి గ్రామానికి చెందిన బండారి కళావతి, మహారాష్ట్రకు చెందిన లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. ఒక్కసారిగా ఆదివారం కళావతి తన ఇద్దరు చిన్నపిల్లలను తీసుకుని బాసర్ చేరుకుంది. ఆత్మహత్య చేసుకునేందుకు ఇక్కడి రైల్వేట్రాక్‌పై పిల్లలను పడుకోబెట్టి తానూ పడుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెనువెంటనే అక్కడికి చేరుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. అనంతరం మహిళ భర్త, తండ్రిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. కుటుంబ, వ్యక్తిగత కారణాలతోనే క్షణికావేశంలో ఆమె ఆత్మహత్యకు యత్నించి ఉండవచ్చని ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.


ఆత్మహత్యకు యత్నించిన వివాహిత

అమిత్‌షాను కలిసిన 'ఏలేటి'


హోంమంత్రిని కలిసిన మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: చేవెళ్ల సభలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కలిశారు. ఇటీవల బీజేపీలో చేరిన ఏలేటి తొలిసారి అమిత్‌షాను కలుసుకున్నారు. నోవాటెల్ హోటల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఏలేటిని అమిత్‌షాకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి కండువా వేసి హోంమంత్రిని సాదరంగా సత్కరించారు. వారివెంట పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, ఈటల రాజేందర్ తదితరులు ఉన్నారు.

మాతృప్రేమను చాటిన వరాహం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఆదివారం ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. ఆకలితో ఉన్న కుక్క పిల్లలకు వరాహం(పంది) పాలిచ్చి తన మాతృప్రేమను చాటుకుంది. జాతి వైరం లేకుండా వరాహం పాలిచ్చిన తీరును చూసిన పలువురు అబ్బురపడుతున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


కుక్క పిల్లలకు పాలిస్తున్న వరాహం

బీజేపీని గద్దె దించేందుకు ఏకమవ్వాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి, పక్కన నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్): బీజేపీని గద్దె దించేందుకు ప్రజాస్వామికవాదులు ఏకమవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ ప్రజాపోరు యాత్ర ఆదివారం కొత్తపల్లి(హెచ్) మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని మండిపడ్డారు. నిత్యావసరాల ధరలు నానాటికీ పెరిగిపోతున్నాయని, వాటిని అదుపు చేయడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని ఆరోపించారు. కార్మిక చట్టాలను కాలరాసి, లేబర్ కోడ్‌లు మార్చడం దుర్మార్గమన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, గిరిజన, గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆత్మీయ సమ్మేళనాలతో ఒరిగేదేమీ లేదన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

రామడుగు(చొప్పదండి): కేంద్రం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. రామడుగులో ఆదివారం సీపీఐ ప్రచార యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రూ.లక్షల కోట్ల అప్పులు చేశారనిన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలను పెంచి, పేదల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డా రు. బీజేపీకి రాబోయే ఎన్నికల్లో పతనం తప్పదన్నారు.

సంపన్న వర్గాలకు కొమ్ముకాస్తున్న బీజేపీ

చొప్పదండి: ఎన్నికల హామీలను మరిచి, సంపన్న వర్గాలకు కొమ్ముకాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ తలపెట్టిన ప్రజా చైతన్య యాత్ర ఆదివారం రాత్రి చొప్పదండికి చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్. పార్టీ సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మంద పవన్, గుంటి వేణు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాళ్లు గూడెం లక్ష్మి, కిన్నెర మల్లవ్వ, యాద పద్మ, నాయకులు పొనగంటి కేదారి, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బుచ్చన్న యాదవ్, మచ్చ రమేశ్, వెంకటేశ్, మల్లేశం, రాజు, సదానందం తదితరులున్నారు.

ఈటల రాజేందర్ సీఎం కేసీఆర్ కోవర్టు

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సంపత్



మాట్లాడుతున్న సంపత్

హుజూరాబాద్: హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సీఎం కేసీఆర్ కోవర్టు అని, ఇందుకు తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సంపత్ అన్నారు. హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈటలతో కేసీఆర్‌కు విరోధమే ఉంటే.. దళితుల భూములు, దేవుళ్లకు చెందిన వందలాది ఎకరాలు కబ్జా చేశాడని తెల్సినా ఈటలను ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని, అందులో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పదో తరగతి పేపర్ లీకేజీలో వ్యవహారంలో బండి సంజయ్‌ను మాత్రమే అరెస్ట్ చేయించి.. ఈటలను ఎందుకు వదిలిపెట్టారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేసీఆర్ ఈటలను పొగడ్తలతో ముంచెత్తారని, కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడానికి ఈటల రాజేందర్‌ను కోవర్టుగా మార్చుకుని రూ.150కోట్లు ఇచ్చి కేసీఆర్ కొన్నాడని ఆరోపించారు. ఈటల పీడీఎస్‌యూలో పని చేస్తున్నప్పుడు ఓ మావోయిస్టు నేత తలదాచుకుందామని వస్తే.. అతడిని ఎన్‌కౌంటర్ చేయించి.. అతడి వద్ద ఉన్న డబ్బులడంపు తీసుకున్న నీచ చరిత్ర ఈటల రాజేందర్‌దని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఎక్కడికక్కడ అడ్డుకుంటారని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీడీ.రవితేజ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చల్లూరి రాహుల్, నాయకులు వడ్లకొండ అరవింద్, రవీందర్, రాము, లింబాజీ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సేవలు సమాజానికి తెలియజేస్తాం

- జూలై 9న హైదరాబాద్‌లో బ్రహ్మ గర్జన
- టీబీఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ

కమాన్‌పూర్(మంథని): సమాజంలో బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులు, విమర్శలను తిప్పికొట్టి, బ్రాహ్మణుల సేవలను సమాజానికి తెలియజేయడానికి జూలై 9న హైదరబాద్‌లో బ్రహ్మ గర్జన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య(టీబీఎస్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని పన్నూర్‌లో సమాఖ్య రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సమాజహితం కోసం పాటుపడే బ్రాహ్మణ సమాజం సత్తా చూపించడానికి బ్రహ్మ గర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం నుంచి బ్రాహ్మణులు హాజరయ్యేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. బ్రాహ్మణులందరూ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అర్చకుల వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, జాతీయ కోశాధికారి కొండపల్లి కేశవరావు, జంట నగరాల కన్వీనర్ మునిపల్లి శ్రీనివాస్, గ్రేటర్ హైదరబాద్ అధ్యక్షుడు తులసి శ్రీనివాస్, మహిళా ప్రధాన కార్యదర్శి గాయత్రి కులకర్ణి, వాణీదేవి, జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు, శశిభూషన్‌కాచే తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్మోహన్ శర్మ



మంచి మాట

సన్నిధి

జీవన చలనం

చలనం ఉండాలి; మనకు చలనం అన్నది కావాలి. చలనంతో మనం సాగుతూ ఉండాలి. మనలోని రక్తంలో చలనం లేకపోతే మనం ఉండం. మన రక్తంలో ఉన్న చలనం మన తీరులోనూ ఉండాలి. చలనం లేకుండా ఆగిపోయిన నీరు బురద అయిపోతుంది. చలనం లేకపోతే ఎవరి జీవనం అయినా ఎందుకూ పనికి రాకుండా పోవడమే కాదు హానికరం అయిపోతుంది కూడా.

చలనం పరంగా ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు మనకు తొలిపాఠాలు. ఉచ్ఛ్వాస నిశ్వాసాల చలనం లేకపోతే మనం మనకే చెందం కదా? శ్వాసకు చలనం ఉండడంవల్లే మనం బతుకుతూ ఉన్నాం; మనకు ఉన్నవి ఉండడానికి కారణం శ్వాసకు చలనం ఉండడమే. మనం చలనంతో ఉండాలి అన్న ఆలోచన శ్వాసలాగా మనకు ఎప్పుడూ ఉంటూనే ఉండాలి.

మనిషికి ప్రధానమైన వ్యాధి స్తబ్దత. ఈ స్తబ్దతకు వైద్యం, విరుగుడు చలనం. అడుగు వేస్తే పడిపోతాం అనుకుని స్తబ్దతలో ఉండిపోవడం సరికాదు. భద్రత కోసం అనో, జరిగిపోతోంది కదా అనో స్తబ్దతలో, స్తబ్దతతో ఉండిపోవడం పెనుదోషం. ఆ దోషం ముదిరితే అది పాపంగా కూడా పరిణమిస్తుంది.

'జీవితం వెనక్కు వెళ్లదు; అది నిన్నటితో ఉండిపోదు' అని కవి–తాత్త్వికుడు ఖలీల్ జిబ్రాన్ ఒక సందర్భంలో అంటారు. చలనం అన్నది ఉంటుంది, ఉండాలి కాబట్టి ఆయన అలా అన్నారు. చలనం లేకుండా స్తబ్దతలో ఉండిపోతే జీవితం వెనక్కు, ఆ వెనక్కు పడిపోతుంది, జీవితం నిన్నటితో ఉండిపోవడం కాదు మొన్నటికీ, అటు మొన్నటికీ జారిపోతుంది.

> జీవనం అంటేనే గమనం. గమనానికి ఆరంభం చలనం. గమనానికి మాత్రమే కాదు ఏ గమ్యానికైనా తొలి చుక్క చలనమే.

జీవితం నుంచి జీవనం జారిపోకూడదు; జీవనానికి జీవితం లేకుండా పోకూడదు. అందుకు స్తబ్దత కాదు చలనం కావాలి; చలనం ఉండాలి. సేద తీరచ్చు కానీ స్తబ్దతలో ఉండిపోకూడదు. అలిసిపోవడం సహజమైందే కానీ బిగుసుకుపోవడం అసహజమైంది. స్తబ్దతకు మలిదశ బిగుసుకుపోవడం. స్తబ్దత, బిగుసుకుపోవడం మనుగడలో ఉన్న మనిషి లక్షణాలు కావు, కాకూడదు.

మరణించిన వ్యక్తి లక్షణాలు స్తబ్దత, బిగుసుకుపోవడం. మరణించాక తప్పనిసరిగా వచ్చేవి అవి. కాబట్టి మరణం రానంత వరకూ అవి మన దగ్గరకు రాకూడదు. మనుగడ ఉన్నంతవరకూ మనం వాటిని రానివ్వకూడదు. స్తబ్దత కారణంగా మనుగడలో ఉన్న మనం మరణించిన వ్యక్తులంలాగా మారిపోకూడదు. మరణించాక కూడా జీవించి ఉండేందుకు మనం చలనాన్ని ఒంటపట్టించుకోవాలి.

మెరుపు మెరుపయింది చలనం వల్లే. గాలికి చలనం లేకపోతే మన పరిస్థితి ఏమిటి? మేఘాలకు, భూమికి చలనం అన్నది లేకపోతే మనకు ఉండేది ఏమిటి? మనకు మనగడే ఉండదు. చలనం అన్నది లేకపోతే మనం ప్రపంచానికి ఉండం; మనకు ప్రపంచం ఉండదు. చలనం లేకపోతే గమనం ఉంటుందా? ఉండదు. జీవనం అంటేనే గమనం. గమనానికి ఆరంభం చలనం. గమనానికి మాత్రమే కాదు ఏ గమ్యానికైనా తొలిచుక్క చలనమే.

జీవితానికి జీవనం ఉన్నప్పుడు జీవనానికి చలనం ఉండాలి. స్తబ్దతలో మనల్ని మనం మోసుకుంటూ ఉండిపోవడం జీవనం కాదు; స్తబ్దతతో మనం మనకే బరువైపోవడం జీవితం కాదు.

చలనం ఇంధనం కాగా జీవితం పండాలి. జీవితానికి జ్వలనం కావాలంటే జీవనానికి చలనం కావాలి.

నది నది అయ్యేది చలనం వల్లే. చలనమే లేకపోతే నది అన్నదే లేదు; నది లేకపోతే జరగాల్సిన మేలు జరగదు. చలనం వల్ల ఏం మేలు జరుగుతుందో, ఎంత మేలు జరుగుతుందో నది మనకు తెలియజెబుతునే ఉంది. నదిని మనం స్ఫూర్తిగానూ, ఆదర్శంగానూ తీసుకోవాలి. మనం చలనంతో నదిలాగా బతకాలి; బతుకే గెలుపై మనం మునుముందుకు నడుస్తూ ఉండాలి.

– రోచిష్మాన్

ఆ నాలుగు = గెలుపు



మనిషి విజయం సాధించాలంటే పవిత్రత, ఓర్పు, పట్టుదల, ప్రేమ ఉండాలంటారు స్వామి వివేకానంద. ఇవి మనిషికి ఉండాల్సిన లక్షణాలు. పవిత్రత మొదట ఆలోచనలో ఉండాలి. మనిషి మనసు ఎప్పుడూ ప్రశాంతంగా, నిశ్చలంగా, ఏ విధమైన సంకల్పవికల్పాలు లేకుండా ఉండదు. అందులోంచి ఏవో ఆలోచనలు వస్తూనే ఉంటాయి. అలాకాక అవి పవిత్రమై, నలుగురికీ ఉపకరించేలా ఉండాలంటే... దానికి తగిన ఆలంబనం ఉండాలి. పసిపిల్లవాడికి బొమ్మ ఇస్తే క్షేమంగా ఆడుకుంటాడు. కత్తి ఇస్తే ఏ కాలో వేలో కోసుకుంటాడు. అలా మన మనసుకు మనం ఏమి ఇస్తున్నామనే దానినిబట్టి అది ఆధారపడి ఉంటుంది.

మంచి గ్రంథాలు, మహాత్ముల జీవిత చరిత్రలు, మంచి కీర్తనలు మనసుకు అలవాటు చేస్తే మనసు పవిత్రత పొందుతుంది. ఇది మనం తలపెట్టిన ఏ కార్యాన్నయినా విజయంవైపు నడిపిస్తుంది. మాట అగ్నిహోత్రంతో సమానం. అగ్ని ఎలా వస్తువును కాలుస్తుందో మంచి మాట అవతలివారి అజ్ఞానాన్ని అలా దహించి వేస్తుంది. పవిత్రమైన ఆలోచనలు చేసేటప్పుడు మంచి మాటలే వస్తాయి. మంచి సంస్కారాన్ని, సంస్కృతిని ఏర్పరుస్తాయి.

దాని తరువాత క్షమ. అంటే ఓర్పు. శక్తి ఉన్నవాళ్ళందరూ శక్తి లేనివాళ్లను అణచివేసే ప్రయత్నం చేస్తే ప్రపంచం నిలబడదు. మనిషికి అలంకారం ఓర్పు అంటుంది రామాయణం. క్షమాదానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః / క్షమా యశః క్షమా ధర్మః క్షమయా విష్ఠితం జగత్... ఆ ఓర్పే దానం, అదే యజ్ఞం, సత్యం, కీర్తి, ధర్మం, ఈ జగత్తంతా ఆ ఓర్పుమీదే ఆధారపడి ఉంది. అది లేకపోతే ఎక్కడా ఎప్పుడూ ఏ ఇద్దరూ కలిసి ఉండలేరు.. అప్పుడు ఎక్కడా ఏ కార్యం ఫలప్రదం కాదు. తరువాత పట్టుదల ఉండాలి. మనిషికి మొక్కవోని ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడే పట్టుదల వస్తుంది. అది ఉంటే ఎన్ని పరిమితులున్నా మనిషి దాటుకొని వెళ్ళగలడు. కర్ణాటకలో మాలతీ కృష్ణమూర్తి అని ఒకామె ఉంది. పుట్టిన కొన్ని నెలలకే పోలియో వచ్చి రెండు కాళ్ళ కింది భాగం చచ్చుబడిపోయాయి. తరువాతి కాలంలో 15 ఏళ్ళ ఫిజియో థెరపీ, 34 శస్త్ర చికిత్సలు జరిగాయి. అయినా తనకిష్టమైన క్రీడారంగంలో ప్రవేశించి 389 స్వర్ణపతకాలు, 27 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు, చివరకు అర్జున అవార్డు, పద్మశ్రీ కూడా పొందింది. అదీ పట్టుదల అంటే. అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రేమ. ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రేమించ గలగడం. ప్రతిఫలం ఆశిస్తే అది కామం. తల్లిదండ్రులు పిల్లలమీద, భార్యాభర్తలు పరస్పరం చూపే ప్రేమ.. ఫలితం ఆశించని ప్రేమ. దానికి కారణాలుండవు. మిగిలిన ప్రాణులలో ప్రేమ కొద్దికాలమే. కానీ మనుషుల్లో అది చివరి ఊపిరివరకు ఉంటుంది. అందువల్ల విజయ సాధనకు పవిత్రత, ఓర్పు, పట్టుదల, ప్రేమ ఉండాలంటారు స్వామి వివేకానంద.

గురువాణి




బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ధర్మరక్షకుడు

బౌద్ధవాణి

పెద్దల, అనుభవజ్ఞుల మార్గంలో నడవడం మనుషుల్లోనే కాదు, పశు, పక్ష్యాదుల్లోనూ కనిపిస్తూ ఉంటుంది. అలా పెద్దల మాటలు వినని పశువులు కూడా ప్రమాదాల్లో పడతాయి. ప్రాణాల మీదకు తెచ్చుకుంటాయి. ఇలా పశువులు తమకు తామే కాదు, తమను కాచే కాపరుల వల్ల కూడా ఆపదల్లో పడతాయి.

అది గంగాతీరంలోని వజ్జిదేశం. వర్షాకాలం ముగిసి, శరద్కాలం మొదలయ్యింది. నది నిండుగా పారుతోంది. తెల్లని మేఘాలు బారులు తీరి నదిమీద మెల్లగా కదులుతున్నాయి. నీటి ఉరవడి ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం దాటి పొద్దు పడమరకి వాలింది. పచ్చిక మైదానంలో మేస్తున్న పశువుల్ని తోలుకొస్తున్నారు కాపర్లు. మందకు ముందు ఒక కాపరి వేగంగా నడుస్తూ దారితీస్తున్నాడు. మంద వెనుక ఇద్దరు కాపర్లు అదిలిస్తూ ఉన్నారు.



అంతలో నీటిలో పెద్ద శబ్దం వచ్చింది. కాపర్లు అటుకేసి పరుగు తీశారు. చిన్న ఆవుదూడ ఎగిరి నీటిలో దూకింది. అది చెంగు చెంగున ఎగురుతూ ఉల్లాసంతో దూకింది. కానీ, అది రేవు తీరం కాదు. లోతైన ప్రాంతం. నీటి ఉరవడి సుడులు తిరుగుతోంది. నీటిలో మునిగి తేలుతున్న దూడ ఆర్తనాదం విన్న తల్లి ఆవు పరుగు పరుగున వచ్చి, తానూ దూకింది. కాపర్లు వేగంగా వచ్చి, మిగిలిన మందను దూరంగా తోలారు. లేకపోతే వాటి వెనుకే మరికొన్ని దూకేసేవి. సుడిలో దూకిన తల్లి ఆవు తేరుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరింది. దూడ పెయ్యి మాత్రం నీటి ప్రవాహంలో పడి ఏటి మధ్యలోకి కొట్టుకుపోయింది.

పశువులు దిగాల్సిన రేవు అక్కడికి కొద్దిదూరంలోనే ఉంది. మిగిలిన మందను ఎక్కడ దిగాలో అక్కడే దించాడు ముందున్న కాపరి. అవి అక్కడే దిగి, సురక్షితంగా అవతలి ఒడ్డుకు చేరాయి. అవతలి తీరంలో నది రేవుకి చాలా దిగువ నుండి నదీతీరాన భిక్షుసంఘంతో కలిసి నడిచి వస్తున్నాడు బుద్ధుడు. నదిలో కొట్టుకు వస్తున్న ఆవుదూడను చూశాడు. అది ఈదలేక బాధపడుతూ ఏదోవిధంగా అవతలి తీరం వెంటే కొట్టుకుపోతోంది. బుద్ధుడు ఆగాడు. భిక్షుసంఘం ఆగిపోయింది.

వెంటనే ఈత తెలిసిన ఒక భిక్షువు నీటిలో దిగి, ఆవుదూడ మెడకు కట్టిన తాడు పట్టుకుని భద్రంగా ఒడ్డుకు చేర్చాడు. అది బాగా అలసిపోయి ఉంది. నిలబడలేకపోతోంది. బుద్ధుడు వచ్చి దాని వెన్ను నిమిరాడు. ఒక భిక్షువు లేత పచ్చిక పరకలు నోటికి అందించాడు.

కొద్దిసేపటికి అది తేరుకుంది. మెల్లగా నడక ప్రారంభించారు. అది బుద్ధుని వెనుక వస్తూ ఉంది. ప్రశాంతంగా ఉన్నారు అందరూ!

''భిక్షువులారా!'' అన్నాడు బుద్ధుడు. ''భంతే..!'' అన్నారు.

''అప్రమత్తత చాలా అవసరం. మనల్ని సరైన దారిలో నడిపించే పెద్దల మాటలు వినాలి. వారు చూపిన ఉన్నతమైన మార్గంలో నడవాలి. అలా నడచిన వారు ప్రమాదాలకు లోను కారు. అజ్ఞానంతో, రాగ ద్వేష మోహాలకు లోనై తనని తాను అదుపు చేసుకోలేని వారు ఈ లేగ దూడలా దుఃఖమనే నదీప్రవాహంలో పడిపోతారు. వారిని ఎల్లవేళలా కాచి కాపాడే వారు ఉండరు. కాబట్టి ప్రతి మనిషీ తనని తాను నియంత్రించుకోవాలి. ధర్మాన్ని గ్రహించాలి. ఆచరణలో పెట్టాలి. ఈ ఆచరణ అనే అభ్యాసం వల్ల దుఃఖమనే నదిని ఈది అవతలి ఒడ్డుకు సులభంగా చేరే శక్తి వస్తుంది. బలం చేకూరుతుంది.

సరైన గురువుని ఎంచుకుని, సరైన మార్గంలో నడిస్తే, దుఃఖమనే ప్రవాహాన్ని దాటి దుఃఖ రహిత తీరం చేరగలం. దీనికి శ్రద్ధ, సాధన అవసరం. శ్రద్ధ, సాధన వల్లే పశువులు నీటిలో ఈదగలిగాయి.'' అంటూ, తన పక్కనే నడుస్తున్న ఆవుదూడ తల నిమిరాడు.

''దుఃఖ సాగరాన్నుండి మనల్ని కాపాడే రక్షకుడు ఈ తథాగతుడే'' అనుకొని భిక్షువులందరూ వంగి–''బుద్ధం శరణం గచ్ఛామి'' అంటూ నమస్కరించారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

వారి ప్రేమ, అభిమానం గొప్పవి

– నాగార్జున



● అనిల్ సుంకర, సాక్షీ వైద్య, నాగార్జున, అఖిల్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆరూరి రమేష్, సురేందర్ రెడ్డి

''అక్కినేని ఫ్యాన్స్ ప్రేమ, ప్రేక్షకుల అభిమానం ఎంతో గొప్పవి. అభిమానుల ఆదరణ లేకుంటే సినిమాలు హిట్ కావు. అఖిల్‌కి చిన్నప్పటి నుంచి కష్టపడే స్వభావం ఉంది. తనలో ఎంతో ఎనర్జీ ఉంది.. 'ఏజెంట్' సినిమాతో ఆ ఎనర్జీని సురేందర్ రెడ్డి బయటకు తీశాడు. ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది'' అని హీరో నాగార్జున అన్నారు. అఖిల్, సాక్షీ వైద్య జంటగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏజెంట్'. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్ రెడ్డి 2 పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన 'ఏజెంట్' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా నాగార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–''పోరాటాలకు అడ్డా... వీరత్వానికి ఇంటి పేరు వరంగల్. ఓ సినిమా బ్లాక్ బస్టర్ కావాలంటే ఏం కావాలో అవి సమకూర్చుకోవడంలో దర్శకుడు సురేందర్ రెడ్డి పేరు పొందారు. ఈ సినిమాను ఇంత గ్రాండ్‌గా తెరకెక్కించడంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర రాజీ పడలేదు. 'ఏజెంట్' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమవుతున్న సాక్షీ వైద్యకు మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ మూవీలో నటించేందుకు నటుడు మమ్ముట్టి ఒప్పుకోవడం గొప్ప విషయం. మా చిత్రం హిట్ చేస్తే మంత్రి దయాకర్‌రావుగారు చెప్పినట్లు మా ప్రతి సినిమా వేడుకకు తప్పకుండా వరంగల్‌కు వస్తాం. తెలుగు ప్రేక్షకులు గొప్పవాళ్లు.. మంచి సినిమాలను తప్పకుండా హిట్ చేస్తారు'' అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ – ''షూటింగ్.. ఆడియో రిలీజ్.. ప్రీ రిలీజ్.. ఇలా ఏదో ఒక కార్యక్రమం వరంగల్‌లో నిర్వహించిన సినిమాలన్నీ హిట్ అయ్యాయి. ప్రీ రిలీజ్ వేడుక జరుపుకుంటున్న 'ఏజెంట్' కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు. అఖిల్ మాట్లాడుతూ– ''నా మైండ్‌లో ఒకటే ఉంది. 'ఏజెంట్' ని ఇంత హైలో పనిచేసిన తర్వాత నెక్ట్స్ ఏం చేయాలనే ప్రశ్న నాలో కలుగుతోంది'' అన్నారు. ఈ వేడుకలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, సాక్షీ వైద్య, సురేందర్ రెడ్డి, అనిల్ సుంకర, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పాల్గొన్నారు.

రాజమౌళి ఆ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు: మణిరత్నం



● 'దిల్' రాజు, విజయేంద్ర ప్రసాద్, విక్రమ్, కుమరన్, సుభాస్కరన్, కార్తీ, 'జయం' రవి, త్రిష, శోభిత, ఐశ్వర్యలక్ష్మి

''నేను ఇదివరకే చెప్పాను. మళ్లీ చెబుతున్నాను. రాజమౌళికి థ్యాంక్స్. ఎందుకంటే 'బాహుబలి' రెండు భాగాలుగా రాకపోయిఉంటే 'పొన్నియిన్ సెల్వన్'(పీఎస్)తెరకెక్కేది కాదు. ఈ విషయాన్ని రాజమౌళితో కూడా చెప్పాను.'పొన్నియిన్ సెల్వన్'ను రెండు భాగాలుగా తీసే దారిని తను చూపించాడు. చారిత్రాత్మక సినిమాలను తీసే ఆత్మవిశ్వాసాన్ని సినిమా ఇండస్ట్రీకి రాజమౌళి ఇచ్చా రు. భారదేశ చరిత్ర ఆధారంగా చాలామంది ఇప్పుడు సినిమాలు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు'' అన్నారు డైరెక్టర్ మణిరత్నం. విక్రమ్, కార్తీ, 'జయం' రవి, ఐశ్వర్యారాయ్, త్రిష, ఐశ్వర్యలక్ష్మి ప్రధాన పాత్రల్లో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్'. సుభాస్కరన్, మణిరత్నం నిర్మించిన ఈ చిత్రంలోని రెండో భాగం 'పొన్నియిన్ సెల్వన్ 2' ఈ నెల 28న రిలీజ్ కానుంది. నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌లు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో మణిరత్నం మాట్లాడుతూ– ''పొన్నియిన్ సెల్వన్' తీయడానికి కారణమైన సుభాస్కరన్, వాయిస్ ఓవర్ ఇచ్చిన చిరంజీవి, తెలుగులో సినిమాను రిలీజ్ చేస్తున్న 'దిల్'రాజుగార్లకు థ్యాంక్స్'' అన్నారు. ''నా గురువు మణిరత్నంతో మరో అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్. 'ఆర్ఆర్ఆర్'కు ఆస్కార్ వచ్చినందుకు టీమ్‌కు శుభాకాంక్షలు'' అన్నారు విక్రమ్. ''ఒకేసారి రెండు విభాగాలు చిత్రీకరించి, తొలి భాగం రిలీజ్ చేసిన ఆరు నెలల తర్వాత రెండో భాగాన్ని రిలీజ్ చేస్తానన్న గుండె ధైర్యం ప్రపంచంలో ఎవరికీ లేదు. ఎవరూ రెండు విభాగాలను ఒకేసారి చిత్రీకరించలేదు. మణిరత్నంగారి ధైర్యానికి హ్యాట్సాఫ్'' అన్నారు 'జయం' రవి. ''భారతదేశ చరిత్ర తెలియాలని మణిరత్నంగారు ఈ సినిమా తీశారు''అన్నారు కార్తీ. ''పొన్నియిన్ సెల్వన్' మ్యాజికల్ వరల్డ్'' అన్నారు ఐశ్వర్యారాయ్. ''హైదరాబాద్ నాకు రెండో ఇల్లు'' అన్నారు త్రిష. ''పొన్నియిన్ సెల్వన్ పార్టు 2'లో అద్భుతం చూడబోతున్నాం'' అన్నారు 'దిల్' రాజు. ఈ కార్యక్రమంలో శోభిత, ఐశ్వర్యాలక్ష్మీ, ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్, సుహాసినీ మణిరత్నం, లైకా ప్రొడక్షన్స్ హెడ్ తమిళ కుమరన్, లైకా డిప్యూటీ చైర్మన్ ప్రేమ్ పాల్గొన్నారు.



● ఐశ్వర్యారాయ్

ప్రేక్షకుల సవాల్‌కి జవాబే విరూపాక్ష

– సాయిధరమ్ తేజ్

''గత ఏడాది కొన్ని సినిమాలకు ప్రేక్షకులు సరిగ్గా రాలేదు. మమ్మల్ని థియేటర్స్‌కు రప్పించే సినిమాలు తీస్తేనే వస్తామంటూ ఆడియన్స్ ఓ చాలెంజ్ విసిరారు. ఆ సవాల్‌కి జవాబే 'విరూపాక్ష'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'విరూపాక్ష'.



● కార్తీక్, బీవీఎస్ఎన్ ప్రసాద్, సాయిధరమ్ తేజ్, సంయుక్త

బాపినీడు బి.సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు. డైరెక్టర్ సుకుమార్ స్క్రీన్ ప్లే అందించిన ఈ సినిమా గత శుక్రవారం (ఏప్రిల్ 21) విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ–''విరూపాక్ష' విజయం నాదో, మా టీమ్‌దో కాదు.. మన ప్రేక్షకులది. మన ఇండస్ట్రీకి ఈ చిత్రం బ్లాక్ బస్టర్ సక్సెస్ ఇచ్చింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తీసుకెళ్లటానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''విరూపాక్ష'ని హిట్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు కార్తీక్ దండు. ''ఈ మూవీలో నా పాత్రకి వస్తున్న స్పందనకు కారణం కార్తీక్‌గారే'' అన్నారు సంయుక్తా మీనన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు డైరెక్టర్ మారుతి. ''విరూపాక్ష' ని అందరూ థియేటర్‌లోనే చూడండి.. గొప్ప అనుభూతి వస్తుంది'' అన్నారు దర్శకుడు గోపీచంద్ మలినేని. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్, కెమెరామేన్ శ్యామ్ దత్, నటీనటులు సోనియా సింగ్, సాయిచంద్, అజయ్, కమల్ కామరాజు బ్రహ్మాజీ, రవికృష్ణ పాల్గొన్నారు.

మూడోసారి



● విశాల్, హరి

హీరో విశాల్, దర్శకుడు హరి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా షురూ అయింది. 'పూజై'(2014), 'తామిరభరణి' (2017) వంటి హిట్ చిత్రాల తర్వాత వీరి కాంబినేషన్‌లో రూపొందుతోన్న సినిమా ప్రారంభోత్సవం చెన్నైలో జరిగింది. కార్తికేయన్ సతానం, జీ స్టూడియోస్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందనుంది. విశాల్ కెరీర్‌లో ఇది 34వ సినిమా. త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది'' అన్నారు.

టీజర్ ఆసక్తిగా ఉంది

– సురేశ్ బాబు



● విజయ్, సప్తగిరి, జీవన్, సురేశ్‌బాబు, సోముసుందరం

''మన్యంరాజు' టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. సినిమా చూడాలనే కుతూహలాన్ని రేపుతోంది. ఈ చిత్రం హిట్ అయి, యూనిట్‌కి మరిన్ని అవకాశాలు తీసుకురావాలి'' అని నిర్మాత డి.సురేశ్ బాబు అన్నారు. జీవన్, బేబీ పరిణిక జంటగా బీయమ్ సోము సుందరం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మన్యంరాజు'. వాయుపుత్ర ఆర్ట్స్‌పై విజయ్ బాబు, వై.ప్రవీణ్, పుష్పలత.బి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని సురేశ్ బాబు రిలీజ్ చేశారు. బీయమ్ సోము సుందరం మాట్లాడుతూ–''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం ఇది'' అన్నారు. ''నాకు అవకాశం ఇచ్చిన డైరెక్టర్, నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు జీవన్. ''మే లో సినిమా విడుదలకి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో పరిపూర్ణానంద స్వామి, ఎంపీ, నిర్మాత ఎంవీవీ సత్యనారాయణ, నటుడు సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

తలరాతను మార్చే విద్యార్థి



● వెంకట్, చేతన్ చీను, ఏఎస్ రవికుమార్, మధు మాదాసు

చేతన్ చీను, బన్నీవోక్స్ జంటగా మధు మాదాసు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విద్యార్థి'. మహాస్ క్రియేషన్స్ పతాకంపై ఆళ్ల వెంకట్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను నిర్మాత డీఎస్ రావు విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఆద్యంతం ఉత్కంఠగా సాగే చిత్రం ఇది. ఈ సినిమాపై నమ్మకంతో విడుదల చేస్తున్నాను'' అన్నారు. మధు మాదాసు మాట్లాడుతూ– ''దర్శకుడిగా నా తొలి చిత్రం 'విద్యార్థి'. సింగిల్ షెడ్యూల్‌లో సినిమా పూర్తి చేశాం. అయితే కరోనా వల్ల సినిమా విడుదల ఆలస్యమైంది'' అన్నారు. ''ప్రతి ప్రాంతంలో జరిగే ఓ అంశాన్ని తీసుకుని ఈ చిత్ర కథ రాశారు మధు మాదాసు. మా యూనిట్ అందరి తలరాతను 'విద్యార్థి' మారుస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు చేతన్ చీను. డైరెక్టర్ ఏఎస్ రవికుమార్ చౌదరి పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కన్న పీసీ, సహ నిర్మాత: రామకృష్ణ రాజేటి, లైన్ ప్రొడ్యూసర్: వంశీ తాడికొండ.

యాక్షన్ డ్రామా



● శేఖర్, వైభవి

శేఖర్ అయాన్ వర్మ, వైభవి రావ్ జంటగా ఓ.సాయి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కళ్యాణమస్తు'. బోయపాటి రఘుబాబు నిర్మించిన ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మే 12న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని 'వేసవి కాలం..' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ఆర్.ఆర్.ధ్రువన్ సంగీతం అందించారు. అలరాజు సాహిత్యం అందించిన ఈ పాటను యాజిన్ నజీర్, అదితి భావరాజు పాడారు. ఈ సినిమాకు కెమెరా: మల్లికార్జున్ నారగని.



సచిన్ టెండూల్కర్ 'ఫిఫ్టీ'

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నేడు 50వ పడిలోకి అడుగుపెట్టాడు. పదేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న సచిన్ ప్రస్తుతం ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. ప్లేయర్ హోదాలో ఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సచిన్ ఆటకు వీడ్కోలు పలికాక అదే జట్టుతో కొనసాగుతున్నాడు. 1989లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సచిన్ ఎన్నో రికార్డులు సృష్టించాడు. 200 టెస్టులు ఆడిన ఈ ముంబైకర్ 51 సెంచరీలు, 68 అర్ధ సెంచరీలతో 15,921 పరుగులు చేశాడు. 463 వన్డేలు ఆడిన సచిన్ 49 సెంచరీలు, 96 అర్ధ సెంచరీలతో 18,426 పరుగులు సాధించాడు. కెరీర్‌లో ఒకే ఒక టి20 మ్యాచ్ ఆడిన సచిన్ పది పరుగులు చేసి అవుటయ్యాడు. టెస్టుల్లో 46 వికెట్లు, వన్డేల్లో 154 వికెట్లు, టి20ల్లో ఒక వికెట్ పడగొట్టిన సచిన్ కెరీర్ మొత్తంలో 20 సార్లు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు గెల్చుకున్నాడు. వన్డేల్లో ఒకే ఏడాది అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ రికార్డు కూడా సచిన్ పేరిటే ఉంది. 1998లో 34 వన్డేలు ఆడి 9 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలతో కలిపి 1894 పరుగులు చేశాడు.

ధీరజ్ గురి అదిరె...

- రజత, కాంస్య పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్
- ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీ



అంటాల్యా (తుర్కియే): అంచనాలకు మించి రాణించిన ఆంధ్రప్రదేశ్ యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–1 టోర్నీలో రెండు పతకాలతో మెరిశాడు. తొలిసారి ప్రపంచ కప్ టోర్నీలో ఆడుతున్న 21 ఏళ్ల ధీరజ్ పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి రజత పతకం ... వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. పురుషుల టీమ్ ఫైనల్లో ధీరజ్, అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్ బృందం 4–5తో లీ జాంగ్‌యువాన్, కి జింగ్‌షువో, వె షావోజువాన్‌లతో కూడిన చైనా జట్టు చేతిలో ఓడింది. వ్యక్తిగత విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్ 7–3తో ఇల్ఫాత్ అబ్దులిన్ (కజకిస్తాన్)పై గెలిచాడు. సెమీఫైనల్లో ధీరజ్ 4–6తో డాన్ ఒలారు (మాల్డోవా) చేతిలో ఓడిపోయాడు.

మళ్లీ రెజ్లర్ల ధర్నా

న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ మళ్లీ ధర్నాకు దిగారు. మేరీకోమ్ కమిటీ నివేదిక బహిర్గతం చేయాలని, లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని 'జంతర్ మంతర్' వద్ద చేపట్టిన ధర్నాలో డిమాండ్ చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ గత జనవరిలో రెజ్లర్లు కొన్ని రోజులపాటు ధర్నాకు దిగారు. కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ వారితో చర్చలు జరిపి మేరీకోమ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీతో విచారణ జరిపించింది. ఇటీవల కమిటీ నివేదిక క్రీడాశాఖకు సమర్పించినా దీన్ని బహిర్గతం చేయకపోవడం, చర్యలు తీసుకోకపోవడంతో రెజ్లర్లు మళ్లీ రోడ్డెక్కారు.

భళా బెంగళూరు

వీకెండ్ మ్యాచ్‌లు 'ఎండ్'దాకా వచ్చి అమాంతం ఉత్కంఠ రేపుతున్నాయి. బెంగళూరు, రాజస్తాన్‌లు కూడా ఆఖరిదాకా పోరాడాయి. కానీ హర్షల్ పటేల్ తొలి మూడు బంతులు రాయల్ చాలెంజర్స్ శిబిరాన్ని డీలా పరిస్తే... తర్వాతి మూడు బంతులు విజయానికి ఊపిరి పోశాయి.

- రాజస్తాన్‌పై 7 పరుగులతో గెలుపు
- ఉత్కంఠభరిత పోరులో ఆర్‌సీబీదే విక్టరీ
- డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్ మెరుపులు
- హర్షల్ పటేల్‌కు మూడు వికెట్లు



మ్యాక్స్‌వెల్

బెంగళూరు: ఐపీఎల్‌లో విరాట్ కోహ్లి జట్టు గర్జిస్తోంది. బ్యాటింగ్‌లో మెరుపులకు బౌలింగ్‌లో నిప్పులు చెరిగే బంతులు జతవడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 7 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు చేసింది. గత మ్యాచ్ ఫార్ములాతోనే రెగ్యులర్ కెప్టెన్ డుప్లెసిస్ (39 బంతుల్లో 62; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) 'ఇంపాక్ట్' చూపాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్‌వెల్ (44 బంతుల్లో 77; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) తన శైలి ధాటి కొనసాగించాడు. బౌల్ట్, సందీప్ శర్మ చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత గెలుపు తీరందాకా వచ్చిన రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులే చేసి ఓడింది. డుప్లెసిస్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన బౌలర్ హర్షల్ పటేల్ (3/32) బెంగళూరు జట్టుకు ఉపయోగపడ్డాడు.

ఇద్దరి తీరు దంచికొట్టుడే!



డుప్లెసిస్

ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌ను నడిపించింది... మెరిపించింది... మురిపించింది ఇద్దరే! ఓపెనర్ డుప్లెసిస్, మిడిలార్డర్‌లో మ్యాక్స్‌వెల్ కలిసి మెలిసి దంచేశారు. జట్టు ఖాతా తెరవకముందే కెప్టెన్‌గా కోహ్లి (0) డకౌటైతే... డుప్లెసిస్ 'ఇంపాక్ట్'కు మ్యాక్సీ డబుల్ డోసు ఇచ్చాడు. వన్‌డౌన్‌లో దిగిన షహబాజ్ (2) కూడా నిరాశపరిచిన బెంగళూరు ఇన్నింగ్స్ 12 పరుగులకే 2 వికెట్లను కోల్పోయింది. కానీ ఆ తర్వాత 11 ఓవర్ల పైచిలుకు వరకు కూడా వారిద్దరి ప్రతాపమే స్కోరును హోరెత్తించింది. మ్యాక్సీ 27 బంతుల్లో ఫిఫ్టీ కొడితే, డుప్లెసిస్ 31 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 127 పరుగులు జతచేశారు. ఆ తర్వాత వచ్చినవారెవరూ పెద్దగా ఆడలేదు. కాసేపైన నిలువలేదు.

పడిక్కల్ రాణించినా... అశ్విన్ వణికించినా...



హర్షల్

భారీలక్ష్యం ముందుంటే 'హిట్టర్' బట్లర్ (0) సిరాజ్ బౌలింగ్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. యశస్వి, ఇంపాక్ట్ ప్లేయర్ దేవదత్ పడిక్కల్ లక్ష్యానికి తగ్గ జోరుతో స్కోరును పెంచారు. పడిక్కల్ 30 బంతుల్లో అర్ధ సెంచరీ చేసుకున్నాక... జట్టు స్కోరు వందకు ముందు అతను, వంద పరుగుల తర్వాత యశస్వి అవుటయ్యారు. అయితే సంజూ సామ్సన్ (15 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), ధ్రువ్ జురెల్ (16 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆడిన ఆటతో పోటీ ఆఖరిదాకా వచ్చింది. చివరి ఓవర్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా.. అశ్విన్ (12) తొలి మూడు బంతుల్లో 4, 2, 4తో 10 పరుగులతో వణికించాడు. అయితే తర్వాతి మూడు బంతుల్లో హర్షల్... అశ్విన్ వికెట్, 1, 1తో ముగించడంతో ఆర్‌సీబీ ఊపిరి పీల్చుకుంది.

స్కోరు వివరాలు



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) బౌల్ట్ 0; డుప్లెసిస్ (రనౌట్) 62; షహబాజ్ (సి) యశస్వి (బి) బౌల్ట్ 2; మ్యాక్స్‌వెల్ (సి) హోల్డర్ (బి) అశ్విన్ 77; మహిపాల్ (సి) పడిక్కల్ (బి) చహల్ 8; దినేశ్ కార్తీక్ (సి) బట్లర్ (బి) సందీప్ శర్మ 16; సుయశ్ ప్రభుదేశాయ్ (రనౌట్) 0; హసరంగ (రనౌట్) 6; విల్లీ (నాటౌట్) 4; వైశాక్ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ శర్మ 0; సిరాజ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 189.** **వికెట్ల పతనం:** 1–0, 2–12, 3–139, 4–156, 5–163, 6–163, 7–180, 8–184, 9–184. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–41–2, సందీప్ శర్మ 4–0–49–2, అశ్విన్ 4–0–36–1, చహల్ 4–0–28–1, హోల్డర్ 4–0–32–0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) కోహ్లి (బి) హర్షల్ పటేల్ 47; జోస్ బట్లర్ (బి) సిరాజ్ 0; దేవ్‌దత్ పడిక్కల్ (సి) కోహ్లి (బి) విల్లీ 52; సంజూ సామ్సన్ (సి) షహబాజ్ (బి) హర్షల్ పటేల్ 22; హెట్‌మైర్ (రనౌట్) 3; ధ్రువ్ జురెల్ (నాటౌట్) 34; అశ్విన్ (సి) ప్రభుదేశాయ్ (బి) హర్షల్ పటేల్ 12; అబ్దుల్ బాసిత్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1–1, 2–99, 3–108, 4–125, 5–155, 6–180. **బౌలింగ్:** సిరాజ్ 4–0–39–1, విల్లీ 4–0–26–1, వైశాక్ 2–0–24–0, మ్యాక్స్‌వెల్ 2–0–25–0, హర్షల్ పటేల్ 4–0–32–3, హసరంగ 4–0–32–0.

రఫ్ఫాడించిన రహానే...

- 29 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 71 నాటౌట్
- కాన్వే, శివమ్ దూబే అర్ధ సెంచరీలు
- కోల్‌కతాపై చెన్నై ఘనవిజయం



'ప్లేయర్ ఆఫ్‌ద మ్యాచ్' రహానే

కోల్‌కతా: సాధారణంగా టీవీ బ్రాడ్‌కాస్టర్లు ఒక ఇన్నింగ్స్ ముగిశాక, లేదంటే మ్యాచ్ పూర్తయ్యాక మొత్తమ్మీద ఐదారు నిమిషాలు హైలైట్స్ చూపిస్తారు. కానీ ఈ మ్యాచ్‌లో అజింక్య రహానే తను ఆడుతున్నంతసేపూ హైలైట్స్ చూపాడు. వన్నె తగ్గిన ఈ వెటరన్ తనలో దంచేసే సత్తా ఇంకా తగ్గలేదని సుడిగాలి ఇన్నింగ్స్ (29 బంతుల్లో 71 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో నిరూపించాడు. దీంతో చెన్నై సూపర్‌కింగ్స్ 49 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది. ముందుగా సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 235 పరుగుల భారీస్కోరు చేసింది. శివమ్ దూబే (21 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), కాన్వే (40 బంతుల్లో 56; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. కష్టమైన లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులే చేయగలిగింది. జట్టు స్కోరు 1 పరుగుకే ఓపెనర్లు నరైన్ (0), జగదీశన్ (1)లు... కాసేపటికి వెంకటేశ్ (20), నితీశ్ రాణా (27) అవుటవడంతో నైట్‌రైడర్స్ లక్ష్యానికి దూరమైంది. జేసన్ రాయ్ (26 బంతుల్లో 61; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), రింకూ సింగ్ (33 బంతుల్లో 53 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) భారీ షాట్లతో అలరించారు. చెన్నై బౌలర్లలో తుషార్, తీక్షణలకు రెండేసి వికెట్లు దక్కాయి.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (బి) సుయశ్ శర్మ 35; కాన్వే (సి) వీస్ (బి) వరుణ్ చక్రవర్తి 56; రహానే (నాటౌట్) 71; శివమ్ దూబే (సి) జేసన్ రాయ్ (బి) ఖెజ్రోలియా 50; జడేజా (సి) రింకూ సింగ్ (బి) ఖెజ్రోలియా 18; ధోని (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235. వికెట్ల పతనం:** 1–73, 2–109, 3–194, 4–232. **బౌలింగ్:** ఉమేశ్ 3–0–35–0, వీస్ 3–0–38–0, వరుణ్ 4–0–49–1, కుల్వంత్ ఖెజ్రోలియా 3–0–44–2, నరైన్ 2–0–23–0, సుయశ్ శర్మ 4–0–29–1, రసెల్ 1–0–17–0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జగదీశన్ (సి) జడేజా (బి) తుషార్ 1; నరైన్ (బి) ఆకాశ్ సింగ్ 0; వెంకటేశ్ అయ్యర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మొయిన్ అలీ 20; నితీశ్ రాణా (సి) రుతురాజ్ (బి) జడేజా 27; జేసన్ రాయ్ (బి) తీక్షణ 61; రింకూ సింగ్ (నాటౌట్) 53; రసెల్ (సి) శివమ్ దూబే (బి) పతిరణ 9; వీస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తుషార్ 1; ఉమేశ్ (సి) కాన్వే (బి) తీక్షణ 4; వరుణ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1–1, 2–1, 3–46, 4–70, 5–135, 6–162, 7–171, 8–180. **బౌలింగ్:** ఆకాశ్ 4–0–29–1, తుషార్ 4–0–43–2, తీక్షణ 4–0–32–2, మొయిన్ అలీ 1–0–20–1, జడేజా 3–0–34–1, పతిరణ 4–0–27–1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
చెన్నై	7	5	2	10	0.662
రాజస్తాన్	7	4	3	8	0.844
లక్నో	7	4	3	8	0.547
గుజరాత్	6	4	2	8	0.212
బెంగళూరు	7	4	3	8	-0.008
పంజాబ్	7	4	3	8	-0.162
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	7	2	5	4	-0.186
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ x ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఉజ్వల కెరీర్‌కు కళాత్మక కోర్సులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(డా.వైఎస్‌ఆర్‌ఏఎఫ్‌యూ).. వివిధ ఫైన్ ఆర్ట్స్, డిజైన్ కోర్సులను అందిస్తోంది. వీటిల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం ఏపీ ఉన్నత విద్యామండలి.. ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏడీసెట్)–2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు..

- **అందించే కోర్సులు:** బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(ఇంటీరియర్ డిజైన్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ) ఇన్ పెయింటింగ్/స్కల్ప్చర్/యానిమేషన్/అప్లయిడ్ ఆర్ట్స్/ఫోటోగ్రఫీ.
- **అర్హత:** 10+2 లేదా ఇంటర్మీడియేట్(ఎంపీసీ/ఎంఈసీ/బైపీసీ/ఎంబైపీసీ/సీఈసీ/హెచ్ఈసీ) లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- **రాత పరీక్ష ఇలా:** ఏడీసెట్‌లో పొందిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఒకే ఉమ్మడి ప్రశ్నపత్రం ఉంటుంది. ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్షను నిర్వహిస్తారు. 100 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు. తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.
- **సిలబస్:** జనరల్ నాలెడ్జ్, ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, అప్లయిడ్ ఆర్ట్స్‌లో టెక్నికల్ డిటైల్స్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్, ఫోటోగ్రఫీ, ఆర్ట్ హిస్టరీ, డిజైన్ స్కిల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **కెరీర్:** ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఆర్ట్ స్టూడియోలు, అడ్వర్టైజింగ్ కంపెనీలు, గ్రాఫిక్, ప్రింటింగ్, పబ్లిషింగ్, ఫ్యాషన్ సంస్థలు, ఎల్రక్టానిక్ ఇండస్ట్రీ, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, ఫిల్మ్ అండ్ థియేటర్, మల్టీమీడియా, యానిమేషన్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలను సొంతం చేసుకోవచ్చు. ఆర్ట్ గ్యాలరీల్లో వీరు తమ ప్రతిభను చాటవచ్చు. ఫ్రీలాన్సింగ్, స్వయం ఉపాధి(వర్క్‌షాపు నడపడం) ద్వారా ఎక్కువ మొత్తంలో సంపాదించుకునే అవకాశముంది. ఎండోమెంట్, ఆర్కియాలజికల్ విభాగాల్లోనూ అవకాశాలు దక్కించుకోవచ్చు.

ముఖ్యసమాచారం — ఏడీసెట్-2023

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 20.05.2023
- **ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ:** 28.05.2023
- **హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్:** 31.05.2023
- **వెబ్‌సైట్ :** https://cets.apsche.ap.gov.in/ADCET

విద్య, ఉద్యోగ సమాచారం

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్ష-2023

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో పోస్టుల భర్తీకి సంబంధించి కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1261

పోస్టుల వివరాలు

» **కేటగిరీ–1:** మెడికల్ ఆఫీసర్స్ గ్రేడ్(జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్–క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్)–584.
» **కేటగిరీ–2:** అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వే)–300, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్)–01, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్–2(ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్)–376.
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.08.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(500 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(100 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 09.05.2023.
» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ-2023 పరీక్ష

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. ఎకనామిక్స్ /స్టాటిస్టికల్ సర్వీసుల్లో జూనియర్ టైం స్కేల్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇండియన్ ఎకనామిక్ సర్వీస్(ఐఈఎస్)/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్ (ఐఎస్ఎస్ఈ)–2023 నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 51
» **పోస్టుల వివరాలు:** ఇండియన్ ఎకనామిక్ సర్వీస్–18, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్–33.
» **అర్హత:** ఎకనామిక్ సర్వీసుకు పీజీ(ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్), స్టాటిస్టికల్ సర్వీసుకు డిగ్రీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(100 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(200 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్.
» **ఆన్‌లైన్‌దరఖాస్తులకు చివరితేదీ:** 09.05.2023.
» **వెబ్‌సైట్:** www.upsc.gov.in

కటాఫ్ అంచనా.. 88-100!

జేఈఈ మెయిన్–2023.. నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని.. ఇతర సాంకేతిక ఇన్‌స్టిట్యూట్స్‌లో.. ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! ఐఐటీల్లో అడుగు పెట్టేందుకు కూడా జేఈఈ–మెయిన్‌లో అర్హత సాధించడం తప్పనిసరి! 2023 సంవత్సరానికి సంబంధించి.. జేఈఈ–మెయిన్ రెండు సెషన్ల పరీక్షలు ముగిశాయి! ఈ నేపథ్యంలో.. జేఈఈ–మెయిన్‌కు హాజరైన విద్యార్థుల తదుపరి కర్తవ్యం ఏంటి? ఈ ఏడాది కటాఫ్ అంచనా, ఉమ్మడి కౌన్సెలింగ్ తదితర వివరాలు..

» జేఈఈ–మెయిన్–2023.. ముగిసిన రెండు సెషన్లు
» దాదాపు 10 లక్షల మంది హాజరైనట్లు అంచనా
» జేఈఈ–మెయిన్ 2023 కటాఫ్ అంచనా 88–100
» మెయిన్ స్కోర్‌తో నిట్‌లు, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలు
» ఐఐటీల్లో అడుగు పెట్టాలనుకుంటే అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత తప్పనిసరి



జేఈఈ-మెయిన్-2023

ఈ ఏడాది రెండు దశలుగా నిర్వహించిన జేఈఈ–మెయిన్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్య దాదాపు పది లక్షలుగా ఉంటుందని అంచనా. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించిన తొలి సెషన్‌కు 8,23,967 మంది హాజరయ్యారు. తాజాగా ఏప్రిల్ 6 నుంచి 13 వరకు నిర్వహించిన పరీక్షలకు కూడా దాదాపు ఇదే సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్లు అంచనా. వీరిలో తొలి సెషన్‌కు కూడా హాజరైన వారి సంఖ్య 30 నుంచి 40 శాతం మేరకు ఉంటుందని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే దాదాపు పది లక్షల మందికిపైగా జేఈఈ–మెయిన్ పరీక్షలు రాసినట్లు పేర్కొంటున్నారు.

జనరల్ కటాఫ్ ఎంత?

రెండు సెషన్లుగా, పలు స్లాట్లలో నిర్వహించిన జేఈఈ–మెయిన్–2023కు కటాఫ్ జనరల్ కేటగిరీలో 88–100, ఓబీసీ(ఎన్‌సీఎల్) కేటగిరీలో 74–90, ఎస్సీ కేటగిరీలో 54–80; ఎస్టీ కేటగిరీలో 45–90 మధ్యలో ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ కటాఫ్ శ్రేణుల మధ్యలో నిలుస్తామని భావించే విద్యార్థులు తదుపరి దశలకు సన్నద్ధమవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ దిశగా

జేఈఈ–మెయిన్ ర్యాంకుతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) క్యాంపస్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. జేఈఈ–మెయిన్ స్కోర్ ఆధారంగా 2.5 లక్షల మందికి ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. దీంతో.. జేఈఈ–మెయిన్‌లో కటాఫ్ అంచనాల కంటే ఎక్కువ స్కోర్ సాధిస్తామనే ధీమా ఉన్న విద్యార్థులు.. అడ్వాన్స్‌డ్ ప్రిపరేషన్‌ను ముమ్మరం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఐఐటీలు.. కొందరికే అవకాశం

ఐఐటీలో అడుగు పెట్టే అవకాశం కొద్ది మందికే లభిస్తుంది. ఎందుకంటే.. దేశంలోని 23 ఐఐటీల్లో మొత్తంగా అందుబాటులో ఉన్న సీట్ల సంఖ్య 16,598 మాత్రమే. అంటే.. జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మందికి అర్హత కల్పించినా.. ప్రవేశం లభించేది కేవలం 16,598 మందికే! దీంతో మిగతా విద్యార్థులకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐలే ప్రధాన గమ్యాలుగా నిలుస్తున్నాయి.

మొత్తం సీట్లు 37,879

- జాతీయ స్థాయిలో 32 ఎన్‌ఐటీ క్యాంపస్‌లలో 23,994 సీట్లు; 26 ట్రిపుల్ ఐటీల్లో 7,126 సీట్లు, సెంట్రల్ యూనివర్సిటీలు సహా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 6,759 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- మొత్తంగా జేఈఈ–మెయిన్ స్కోర్ ఆధారంగా 37, 879 సీట్లు కేటాయిస్తారు.

ఉమ్మడి కౌన్సెలింగ్ జోసా

- ఐఐటీలు, నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు తదితర ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాల కోసం జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.
- జేఈఈ–మెయిన్ ర్యాంకర్లకు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్ఐటీలనే ప్రాథమ్యాలుగా ఎంచుకునే అవకాశం ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు మాత్రం ఐఐటీలతో సహా అన్ని ఇన్‌స్టిట్యూట్‌లను ప్రాథమ్యాలుగా ఎంచుకోవచ్చు.
- విద్యార్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది.
- సీట్ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి.. సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలి. నిర్దేశిత తేదీలోపు తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆరు రౌండ్లలో జోసా

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరగనుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం–జోసా 2023 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 19న ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వచ్చు.

సీఎస్ఏబీ కౌన్సెలింగ్

జోసా అన్ని దశలు పూర్తయిన తర్వాత కూడా ఎన్‌ఐటీల్లో సీట్లు మిగిలితే.. వాటి భర్తీ కోసం ప్రత్యేకంగా ఎన్‌ఐటీ ప్లస్ సిస్టమ్ పేరుతో సీఎస్ఏబీ(సెంట్రల్ సీట్ అలొకేషన్ బోర్డ్) ఆధ్వర్యంలో ఎన్‌ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సాధారణంగా ఇది రెండు దశల్లో ఉంటుంది. దీనికోసం అభ్యర్థులు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నిట్‌లు.. హోమ్ స్టేట్ కోటా

- నిట్‌ల్లో హోమ్ స్టేట్ కోటా విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం–నిట్ ఏర్పాటైన రాష్ట్ర విద్యార్థులకు హోమ్ స్టేట్ కోటా కింద 50 శాతం సీట్లు కేటాయిస్తారు. ఉదాహరణకు.. నిట్–వరంగల్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ఇందులో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇలా దేశంలోని మొత్తం 31 నిట్‌లలోనూ ఈ విధానంతో సంబంధిత రాష్ట్రాల విద్యార్థులు సీట్లు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రస్తుతం రెండు నిట్ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. అవి..ఎన్‌ఐటీ–వరంగల్ (తెలంగాణ), ఎన్‌ఐటీ–ఆంధ్రప్రదేశ్ (తాడేపల్లిగూడెం).
- నిట్ క్యాంపస్‌లలో హోమ్ స్టేట్ కోటా అమలవుతున్న నేపథ్యంలో 15 వేల లోపు ర్యాంకుతో విద్యార్థులు తమ సొంత రాష్ట్రంలోని నిట్ క్యాంపస్‌లో సీటు పొందే అవకాశం ఉంది. సీఎస్ఈ, ఈసీఈ వంటి క్రేజీ కోర్సుల విషయంలో ఆరు వేల లోపు ర్యాంకుతో సులభంగా సీటు పొందే వీలుంది. అదర్ స్టేట్ కోటాలో సీటు సొంతం చేసుకోవాలంటే.. పదివేల లోపు ర్యాంకుతోనే సాధ్యమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఫీజుల్లోనూ రాయితీ

- గత ఏడాది గణాంకాల ప్రకారం–ప్రతి సెమిస్టర్‌కు రూ.62,500 ఫీజుగా నిర్ణయించారు. ప్రభుత్వ విధానాల ప్రకారం–ఆయా వర్గాల వారికి ట్యూషన్ ఫీజు నుంచి నిర్దేశిత మొత్తాల్లో మినహాయింపు కూడా లభిస్తోంది.
- కుటుంబ వార్షికాదాయం రూ.లక్షలోపు ఉన్న విద్యార్థులకు, ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వర్గాల కేటగిరీలో ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు కల్పిస్తున్నారు.
- కుటుంబ వార్షికాదాయం రూ.లక్ష నుంచి రూ.అయిదు లక్షల లోపు ఉన్న విద్యార్థులకు మొత్తం ట్యూషన్ ఫీజులో మూడింట రెండొంతుల ఫీజును మినహాయిస్తున్నారు.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు చెందిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు మినహాయింపు లభిస్తోంది.
- ఈ మినహాయింపులు కోరుకునే అభ్యర్థులు సంబంధిత ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

జోసా ప్రక్రియకు సిద్ధంగా

జేఈఈ–మెయిన్ స్కోర్‌తో నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో చేరాలనుకునే వారు..జోసా–2023 ప్రక్రియకు సన్నద్ధమవ్వాలి. ఇందుకోసం.. జోసా ఆన్‌లైన్ ఛాయిస్ ఫిల్లింగ్‌కు అవసరమైన అన్ని ధ్రువ పత్రాలను సిద్ధం చేసుకోవాలి. మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోగ్రాఫ్స్; ఫొటో ఐడెంటిటీ కార్డ్; జేఈఈ–మెయిన్ అడ్మిట్ కార్డ్; జేఈఈ–మెయిన్ స్కోర్ కార్డ్; జనన ధ్రువీకరణ పత్రం (పదో తరగతి మార్క్స్ షీట్); ఇంటర్మీడియెట్ మార్క్స్ షీట్; మెడికల్ సర్టిఫికెట్; కుల ధ్రువీకరణ పత్రం; ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)


దేశీ సూచీలు		విదేశీ సూచీలు			
సెన్సెక్స్ ▲	నిఫ్టీ	నాస్‌డాక్	12,072	▲	22
23	0	డోజోన్స్	33,809	▲	13
59,655	17,624	ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
		డాక్స్	15,882	▲	86
		షాంఘై	3,301	▽	66
		నికాయ్	28,564	▲	93

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

ఐటీ రిటర్నులు సరే.. ఆ తర్వాత?



- జూలై 31లోపు ఐటీఆర్‌ల దాఖలు
- అనంతరం వాటిని వెరిఫై చేయాల్సిందే
- లేదంటే చెల్లుబాటు కావు
- అలాంటప్పుడు ఆలస్యపు రిటర్నులు
- తప్పులు గుర్తిస్తే సవరణలతో దాఖలు
- లెక్కలు సరిపోలకపోతే డిమాండ్ నోటీస్

గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నులు దాఖలు చేసే సమయం వచ్చేసింది. సాధారణంగా జూలై 31లోపు రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఎన్నో వివరాలను సిద్ధం చేసుకోవాలి. ఆదాయం, పెట్టుబడులు, గృహ రుణం చెల్లింపులు, అద్దె చెల్లింపులు, ఈపీఎఫ్, పీపీఎఫ్, బీమా ప్రీమియం చెల్లింపులు, మూలధన లాభాలు అన్నింటినీ ఒక పేపర్‌పై రాసి పెట్టుకుంటే రిటర్నులను సులభంగా దాఖలు చేయవచ్చు. పాత, కొత్త విధానాల్లో ఏది అనుకూలమో కూడా మదింపు వేసుకోవాలి. అయితే, రిటర్నులు సమర్పించడంతోనే పని పూర్తయినట్టు అనుకోవద్దు. రిటర్నులు దాఖలు తర్వాత చేయాల్సిన ముఖ్యమైన పనులు కొన్ని ఉన్నాయి. వాటి గురించి తెలియజేసేదే ఈ కథనం.

రిటర్నుల ధ్రువీకరణ

రిటర్నులు దాఖలు చేసిన ప్రతి ఒక్కరూ వాటిని వెరిఫై చేయాల్సి ఉంటుంది. అప్పుడే రిటర్నులు విజయవంతంగా సమర్పించినట్టు అవుతుంది. ధ్రువీకరించకపోతే అవి మదింపునకు వెళ్లవన్న విషయాన్ని గుర్తు పెట్టుకోండి. రిటర్నులు చెల్లుబాటు కూడా కావు. రిటర్నులు దాఖలు చేసిన తర్వాత వాటిని ధ్రువీకరించేందుకు 120 రోజుల గడువు ఉంటుంది. ఆలోపు ఎప్పుడైనా చేయవచ్చు. రిటర్నులు దాఖలు చేసిన తర్వాత వచ్చే అక్‌నాలెడ్జ్‌మెంట్ కాపీని ప్రింట్ తీసుకుని, దానిపై సంతకం చేసి లేదంటే ఇన్‌కమ్‌ట్యాక్స్ వెబ్‌సైట్ నుంచి ఫామ్ 5ను డౌన్లోడ్ చేసుకుని బెంగళూరులోని ఆదాయపన్ను శాఖ కార్యాలయానికి పోస్ట్ చేయాల్సి ఉంటుంది. ఆర్డినరీ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ చేయవచ్చు. కొరియర్ ద్వారా చేయకూడదు. ఆన్‌లైన్‌లోనూ వెరిఫై చేయవచ్చు. పోస్ట్ ద్వారా పంపించడం కంటే ఇది ఎంతో సులభ విధానం. నెట్‌బ్యాంకింగ్ అకౌంట్ లేదంటే ఆధార్ ఆధారిత ఓటీపీ లేదా డీమ్యాట్ అకౌంట్ ద్వారా చేసేందుకు అవకాశం ఉంటుంది. వీటిల్లో ఏది ఎంపిక చేసుకుంటే ఆ రూపంలో మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఆదాయపన్ను శాఖ పోర్టల్‌పై నమోదు చేయడం ద్వారా రిటర్నులను వెరిఫై చేయవచ్చు. వెరిఫికేషన్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్ కోడ్‌ను బ్యాంకు ఏటీఎంల ద్వారా కూడా పొందొచ్చు. ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఈ సేవలను అందిస్తున్నాయి. ఏటీఎంలో డెబిట్ కార్డును స్వైప్ చేసి, పిన్ నంబర్ ఇచ్చి లాగిన్ అయిన తర్వాత 'జనరేట్ ఈవీసీ ఫర్ ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్'ను ఎంపిక చేసుకోవాలి. ఆయా బ్యాంకుల్లో ఖాతాదారులై, పాన్ నంబర్ ఇచ్చి ఉన్న వారికే ఇది సాధ్యపడుతుంది. ఒకవేళ ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 44ఏబీ కింద పుస్తకాలను ఆడిట్ చేయించుకోవాల్సిన వారు రిటర్నులు దాఖలు చేసిన వెంటనే డిజిటల్ సిగ్నేచర్



సర్టిఫికెట్ ద్వారా వాటిని వెరిఫై చేయాల్సి ఉంటుంది. వ్యక్తులు రిటర్నులు వేసి, 120 రోజులు అయినా వాటిని వెరిఫై చేయలేదనుకుంటే.. అప్పుడు కండోనేషన్ ఆఫ్ డిలే సర్వీస్ రిక్వెస్ట్ సమర్పించాలి. తగిన కారణాన్ని పేర్కొనాలి. ఆదాయ పన్ను శాఖ కండోనేషన్ రిక్వెస్ట్‌ను ఆమోదిస్తే అప్పుడు రిటర్నులను వెరిఫై చేయవచ్చు. లేదంటే రిటర్నులు దాఖలు చేయనట్టుగానే ఆదాయపన్ను శాఖ పరిగణిస్తుంది. తిరిగి రిటర్నులను దాఖలు చేయాల్సిందే. లేట్ ఫీజు చెల్లించి దాఖలు చేయాల్సి ఉంటుంది. పన్ను చెల్లించాల్సి ఉంటే, దానిపై వడ్డీ కూడా పడుతుంది.

ఆదాయ పన్ను రిటర్నులను గడువులోపు సమర్పించిన వారు, అందులో తప్పులు దొర్లితే సవరించిన రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. దాఖలు చేసిన రిటర్నులు ఇంకా ప్రాసెస్ చేయకపోతే రివైజ్డ్ రిటర్నులు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సవరించిన రిటర్నులు దాఖలు చేయడానికి ప్రత్యేకమైన ప్రక్రియ అంటూ ఏదీ లేదు. ఈఫైలింగ్ పోర్టల్‌కు వెళ్లి 'రివైజ్డ్ రిటర్న్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తాజా రిటర్నులు దాఖలు చేసే ప్రక్రియనే అనుసరించాల్సి ఉంటుంది. సవరించిన రిటర్నుల పత్రంలో మొదటిసారి దాఖలు చేసిన అసలు రిటర్నుల అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్, డేట్ కూడా ఇవ్వాలి. అసెస్‌మెంట్ సంవత్సరం ముగియడానికి

తప్పులు దొర్లితే..?

మూడు నెలల ముందు వరకు రివైజ్డ్ రిటర్నులు సమర్పించొచ్చు. పన్ను చెల్లింపుదారు దాఖలు చేసిన రిటర్నుల పత్రాన్ని ఆదాయపన్ను శాఖ ప్రాసెస్ చేసినట్టయితే సెక్షన్ 143 (1) కింద ఇంటిమేషన్ పంపిస్తుంది. ఇది వచ్చిన తర్వాత రివైజ్డ్ రిటర్నులు వేయడానికి అనుమతి ఉండదు. ఆలస్యపు రిటర్నులు దాఖలు చేయడానికి తుది గడువు అసెస్‌మెంట్ సంవత్సరంగా గుర్తించాలి. రిటర్నులు దాఖలు చేసి, దాన్ని ఆదాయపన్ను శాఖ ఇంకా ప్రాసెస్ చేయనట్టయితే గడువులోపు ఎన్ని సార్లు అయినా సవరణలు దాఖలు చేసుకోవచ్చు. ఈ విషయంలో పరిమితి లేదు. ఒక్కసారి సవరించిన రిటర్నులు సమర్పించగానే, ముందు దాఖలు చేసినది చెల్లకుండా పోతుంది. తాజా రిటర్నుల పత్రాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అవకాశం ఉంది కదా అని చాలా పర్యాయాలు సవరించిన రిటర్నులు సమర్పిస్తే అది పన్ను శాఖ అధికారుల దృష్టిలో పడుతుంది. దాంతో ప్రత్యేక స్క్రూటినీ చేయవచ్చు. ముఖ్యంగా సవరించిన రిటర్నుల్లో పెద్ద మార్పులు ఉంటే తప్పకుండా విస్తృత పరిశీలన ఉంటుంది. మొదటిసారి దాఖలు చేసిన పత్రాల మాదిరిగానే, సవరించిన రిటర్నులనూ వెరిఫై చేయడం మర్చిపోవద్దు. అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకోండి.

దాఖలు చేసిన రిటర్నుల్లో వివరాల ఆధారంగా చెల్లించాల్సిన పన్నులో వ్యత్యాసం ఉంటే, ఆదాయ పన్ను శాఖ పంపించే 143 (1) ఇంటిమేషన్‌లో ఆ వివరాలు ఉంటాయి. పన్ను లెక్కల్లో పొరపాట్లు ఉంటే, అదనంగా పన్ను చెల్లించాల్సి ఉంటే, ఆదాయపన్ను శాఖ ఈ ఇంటిమేషన్‌లో పేర్కొంటుంది. ఆదాయపన్ను శాఖ వివరాలతో, పన్ను లెక్కలతో ఏకీభవిస్తే అప్పుడు పన్ను చెల్లింపుదారు ఆ మేరకు అదనపు పన్ను చెల్లిస్తే సరిపోతుంది. కొన్ని సందర్భాల్లో పన్ను మినహాయింపులు పేర్కొనడం మర్చిపోయినా.. పన్ను అదనంగా చెల్లించాల్సిన బాధ్యత ఏర్పడుతుంది. లేదంటే ఆదాయ పన్ను శాఖ అసెసింగ్ ఆఫీసర్ అయినా పొరపాటు పడొచ్చు.

సరిపోలకపోతే..?

లేదా ఎర్రర్ చోటు చేసుకోవచ్చు. అప్పుడు యూజర్ రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ సమర్పించాలి. అంటే దాన్ని సరిదిద్దాలని కోరడం. ఇంటిమేషన్ పంపించిన నాటి నుంచి నాలుగేళ్ల వ్యవధిలో ఎప్పుడైనా కానీ దీన్ని దాఖలు చేయవచ్చు. ఆదాయపన్ను శాఖ గుర్తించిన వాటితో మీరు ఏకీభవించకపోవచ్చు. లేదా మీరు పేర్కొన్న వివరాల పరంగానూ ఆదాయపన్ను శాఖ లేవనెత్తిన తాజా డిమాండ్ సమ్మతం కాకపోయినా రెక్టిఫికేషన్ రిక్వెస్ట్ దాఖలు చేయవచ్చు. ఇలా దాఖలు చేసిన నాటి నుంచి ఆరు నెలల్లోపు ఆదాయపన్ను శాఖ స్పందిస్తుంది. పన్ను చెల్లింపుదారులు సాధారణంగా నాలుగు రకాల రెక్టిఫికేషన్ రిక్వెస్ట్‌లు సమర్పించొచ్చు. పన్ను చెల్లింపుదారు తనవైపు నుంచి అన్ని రకాల వివరాలు సమర్పించినప్పటికీ, పన్ను శాఖ ఏదైనా సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోనట్టయితే అప్పుడు 'రీ ప్రాసెస్ ద రిటర్న్'ను ఎంపిక చేసుకోవాలి. టీడీఎస్/టీసీఎస్ లేదా ఐటీ చలాన్లలో దిద్దుబాటు చేయాల్సి ఉంటే అప్పుడు 'ట్యాక్స్ క్రెడిట్ మిస్‌మ్యాచ్ కరెక్షన్' రిక్వెస్ట్‌ను ఎంపిక చేసుకోవాలి. సెక్షన్ 234సీ కింద వడ్డీ లెక్కలను సరిదిద్దాల్సి ఉంటే 'అడిషనల్ ఇన్ఫర్మేషన్ ఫర్ 234సీ ఇంటరెస్ట్'ను ఎంపిక చేసుకోవాలి. వాస్తవ రిటర్నుల్లో ఇతర వివరాలను సరిదిద్దాలంటే అప్పుడు 'రిటర్న్ డేటా కరెక్షన్'ను ఎంపిక చేసుకోవాలి.

రిఫండ్‌ల సంగతి ఇదీ..

దాఖలు చేసిన రిటర్నుల్లో ఎలాంటి తప్పులు లేకపోతే అప్పుడు నిశ్చింతగా ఉండొచ్చు. ఒకవేళ చెల్లించాల్సిన మొత్తానికంటే అదనంగా పన్ను చెల్లించినట్టయితే అప్పుడు రిఫండ్ కోరడం ఒక్కటే మార్గం. యూజర్లు ఆదాయ పన్ను శాఖ పోర్టల్‌లో లాగిన్ అయిన తర్వాత డ్యాష్‌బోర్డులో ఇది కనిపిస్తుంది. పన్ను చెల్లింపుదారులు ఎన్ఎస్‌డీఎల్ పోర్టల్‌లోనూ పాన్ నంబర్ సమర్పించడం ద్వారా దీన్ని చెక్ చేసుకోవచ్చు. ఇప్పుడు ఫేస్‌లెస్ ప్రాసెసింగ్ నడుస్తోంది. రిఫండ్‌లు పన్ను చెల్లింపుదారు బ్యాంకు ఖాతాకు జమ అవుతాయి. ఇంటిమేషన్ అందుకున్న 15 రోజుల్లోగా ఇది సాధ్యపడుతుంది. బ్యాంకు వివరాలు సరిగ్గా లేకపోవడం వల్ల రిఫండ్‌లు నిలిచిపోతుంటాయి. అకౌంట్ నంబర్ లేదా ఐఎఫ్ఎస్‌సీ నంబర్‌లో తప్పులు ఉన్నాయేమో చెక్ చేసుకోవాలి. సర్వీస్ రిక్వెస్ట్ ఆప్షన్ ద్వారా దీన్ని చెక్ చేసుకోవచ్చు. పన్ను చెల్లింపుదారుడికి రావాల్సిన రిఫండ్‌లు ఆలస్యం అయితే ఒక్కో నెలకు అర శాతం చొప్పున వడ్డీని చెల్లిస్తారు. టీడీఎస్ లేదా టీసీఎస్ రూపంలో పన్నును మినహాయించి ఉంటే లేదా ముందస్తు పన్ను చెల్లించి ఉండి, చివర్లో పన్ను బాధ్యత తగ్గడం వల్ల వెనక్కి తిరిగి రావాల్సి ఉంటే.. అప్పుడు ఏప్రిల్ 1 నుంచి చెల్లించే నాటి వరకు వడ్డీ కూడా లభిస్తుంది. ఐటీఆర్‌లను గడువు తర్వాత దాఖలు చేసిన వారు, ఆ తేదీ నుంచే రిఫండ్‌పై వడ్డీ చెల్లింపులకు అర్హులవుతారు. రిఫండ్‌పై వచ్చే వడ్డీ సంబంధిత ఆర్థిక సంవత్సరం అదనపు ఆదాయం కింద చూపించాలి.



పోంజీ యాప్‌లపై ఉక్కుపాదం: సీతారామన్



న్యూఢిల్లీ: పోంజీ యాప్‌ల విషయంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. పెట్టుబడిదారుల కష్టార్జితాన్ని దోచేస్తున్న పోంజీ యాప్‌లపై ఉక్కుపాదం మోపేందుకు మైటీ, ఆర్‌బీఐతో కలసి పనిచేస్తున్నట్టు తెలిపారు. పెట్టుబడులు పెట్టేముందు తగినంత శ్రద్ధ చూపించాలని, అద్భుతమైన రాబడులు ఇస్తామంటూ చేసే ప్రకటనలకు ఆకర్షితులు కావద్దని కోరారు. ఇలాంటి వాటిల్లో ఎక్కువగా పోంజీ యాప్‌లు ఉంటున్నట్టు చెప్పారు. పోంజీ యాప్‌లను బ్లాక్ చేసేందుకు ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ (మైటీ), ఆర్‌బీఐతో కలసి ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా చర్యలు చేపడుతున్నట్టు మంత్రి వివరించారు. కర్ణాటకలోని తుమకూరులో జరిగిన థింకర్స్ ఫోరమ్ కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. సామాజిక ప్రభావ శీలురు, ఆర్థిక ప్రభావ శీలురను నియంత్రించే ప్రతిపాదన ఏదీ లేదంటూ.. మనలో ప్రతి ఒక్కరి పట్ల జాగ్రత్తగా మసులుకోవాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రతి దానినీ ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలన్నారు. ప్రతి 10 మందిలో ముగ్గురు మంచి సూచనలే చేస్తున్నారంటూ, మిగిలిన ఏడుగురిని ఇతర ప్రభావాలు నడిపిస్తుండొచ్చన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-4-2023	
విశాఖ	425-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	60.00
23-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

గోద్రెజ్ ప్రాపర్టీస్ | మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్స్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,272 **టార్గెట్:** రూ. 1,575

ఎందుకంటే: గతించిన ఐదేళ్ల కాలం(2017-22)లో కంపెనీ అమ్మకాల బుకింగ్స్ నాలుగు రెట్లు ఎగసి రూ. 8,000 కోట్లను తాకాయి. ఇందుకు 10 కోట్ల చదరపు అడుగుల ప్రాజెక్టులు జత కలవడం దోహదం చేసింది. 2016 కేలండర్ ఏడాదిలో 2 శాతంగా నమోదైన గోద్రెజ్ ప్రాపర్టీస్ మార్కెట్ వాటా 2022కల్లా 8 శాతానికి బలపడింది. వెరసి దేశీ రియల్టీ రంగంలో ఏర్పడిన కన్సాలిడేషన్‌లో అత్యధికంగా లాభపడిన కంపెనీలలో ఒకటిగా నిలిచింది. 2019-21 మధ్య రియల్టీ రంగ ఏకీకృత పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ రూ. 6,800 కోట్ల నిధులను సమీకరించింది. అయితే 2022 వరకూ వీటిని వినియోగించనే లేదు. కంపెనీ ప్రాజెక్టులు, అమ్మకాల పైప్‌లైన్ ఊపందుకున్నప్పటికీ అంతంతమాత్ర లాభదాయకత, తగ్గుతున్న నిర్వహణా క్యాష్ ఫ్లో కారణంగా



కంపెనీ షేరు దిద్దుబాట పట్టింది. 2022 తదుపరి షేరు 40 శాతంవరకూ క్షీణించింది. అయితే 2023లో రికార్డు స్థాయిలో ప్రాజెక్టులను జత చేసుకోవడంతోపాటు.. రూ. 30,000 కోట్ల స్థూల డెవలప్‌మెంట్ విలువ(జీడీవీ)ను సాధించడంతో కంపెనీ షేరు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇటీవల కంపెనీ యాజమాన్యం సైతం బిజినెస్ పటిష్ట పురోభివృద్ధి బాటలో ఉన్నట్లు తెలియజేసింది. 2024లోనూ ఇది కొనసాగే వీలున్నట్లు అంచనా వేసింది. వెరసి మెరుగైన లాభదాయకతను సాధించనున్నట్లు అభిప్రాయపడింది.

అమీ ఆర్గానిక్స్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,060 **టార్గెట్:** రూ. 1,335

ఎందుకంటే: మొత్తం 380కుపైగా ఫార్మా ఇంటర్మీడియెట్స్‌కు అనుమతి పొందింది. కంపెనీ ఔషధాలలో 90 శాతం క్రానిక్ విభాగంలోనివేకాగా.. 2037 వరకూ కొన్ని ప్రొడక్టులు దశలవారీగా ఆఫ్‌పేటెంట్‌లోకి ప్రవేశించనున్నాయి. వెరసి కంపెనీ భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉండటంతో 2022-2030 మధ్య కాలంలో వార్షికంగా 25 శాతం పురోగతిని సాధించవచ్చని అంచనా. ఈ కాలంలో ఏక్యూట్ విభాగం(5.6 శాతం)తో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన క్రానిక్ వ్యాధులు(7.1 శాతం) అధిక వృద్ధిని అందుకోనున్నాయి. ఇది కంపెనీకి ప్రోత్సాహాన్నిస్తోంది. రానున్న రెండేళ్ల కాలంలో ఆదాయం, నికర లాభాల్లో వార్షికంగా 27 శాతం వృద్ధికి అవకాశముంది. ఇందుకు గతేడాది ఫార్మా ఇంటర్మీడియెట్స్‌లో నమోదైన 31 శాతం పురోగతి సహకరించనుంది. మొత్తం ఆదాయంలో వీటి వాటా 79 శాతంకాగా.. మరోవైపు అంకలేశ్వర్ ప్లాంటు ప్రారంభంకావడంతో స్పెషాలిటీ కెమికల్స్ 29 శాతం వార్షిక వృద్ధికి వీలుంది. 2023-25 మధ్య ఇబిటా మార్జిన్లు సగటున 20.6 శాతంగా ఉండొచ్చు. 2026-33 మధ్య మరింత అధికంగా 22.9 శాతం స్థాయిలో ఇబిటా మార్జిన్లకు అవకాశముంది. ఎలక్ట్రోలైట్ బిజినెస్‌ను పరిగణనలోకి తీసుకోకుండానే టార్గెట్ ధరను నిర్ణయించాం. అయితే అధిక ముడి సరుకుల వ్యయాలు, వీటిని వినియోగదారులకు బదిలీ చేయలేకపోవడం, నియంత్రణ సంస్థల నిబంధనలు, మారుతున్న టెక్నాలజీ వంటి అంశాలను కీలక రిస్కులుగా పేర్కొనవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

వర్తకులకు ప్రమాద బీమా

త్వరలో జాతీయ రిటైల్ వర్తక విధానం



న్యూఢిల్లీ: కేంద్ర సర్కారు జాతీయ రిటైల్ వర్తక విధానాన్ని, వర్తకులకు ప్రమాద బీమా సదుపాయాన్ని త్వరలోనే ప్రకటించనుంది. జీఎస్‌టీ నమోదిత వర్తకులకు మద్దతుగా నిలవడమే ఈ విధానం లక్ష్యమని ఆర్థికశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. నూతన విధానం మెరుగైన సదుపాయాల కల్పనకు తోడు వర్తకులకు రుణ లభ్యతను పెంచే విధంగా ఉంటుందని చెప్పారు. అందుబాటు రేట్లకే సత్వర రుణ సదుపాయం, రిటైల్ వాణిజ్యాన్ని మరింత ఆధునికీకరించడం, డిజిటైజ్ చేయడం, సరఫరా చైన్, నైపుణ్యాల అభివృద్ధి, కార్మిక ఉత్పాదకత పెంచడం, ప్రభావవంతమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఏర్పాటు చేయడం నూతన రిటైల్ వర్తక విధానం లక్ష్యాలని వివరించారు. ప్రపంచంలో మన దేశం రిటైల్ వాణిజ్య పరంగా ఐదో స్థానంలో ఉంది.

ఫండ్స్‌ను మనవళ్లకు గిఫ్ట్ ఇవ్వొచ్చా?

నేను గ్రోత్ ఆప్షన్ బదులు ఐడీసీడబ్ల్యూ (నెలవారీ) ప్లాన్‌ను ఎంపిక చేసుకుంటే, ఈ రెండింటి మధ్య వ్యత్యాసాలు ఎలా ఉంటాయి? ఈ విషయంలో పన్ను బాధ్యతలు ఎలా ఉంటాయి? – అభినవశ్రీ

మీరు మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటుంటే ఇనకమ్ ఇన్‌స్ట్రిబ్యూషన్ కమ్ క్యాపిటల్ విత్‌డ్రాయల్ (ఐడీసీడబ్ల్యూ) ప్లాన్‌కు దూరంగా ఉండండి. దీనికి బదులు గ్రోత్ ప్లాన్ ఎంపిక చేసుకోండి. ఐడీసీడబ్ల్యూ ప్లాన్ పన్ను పరంగా మెరుగైనది కాదు. గ్రోత్ ప్లాన్ పన్ను పరంగా మెరుగైన సాధనం. గ్రోత్ ప్లాన్‌లో పెట్టుబడులపై రాబడులు అన్నీ ఫండ్ వద్దే ఉంటాయి. దీంతో వాటిపైనా రాబడితో కాంపౌండింగ్ ప్రయోజనాన్ని పూర్తిగా పొందుతారు. అదే ఐడీసీడబ్ల్యూ ప్లాన్‌లో డివిడెండ్ అన్నది పెట్టుబడి, రాబడుల్లో కొంత భాగాన్ని ఫండ్ సంస్థ తిరిగి చెల్లించడం. స్టాక్స్‌లో అయితే డివిడెండ్ వరకే ఇన్వెస్టర్లకు నేరుగా చెల్లిచడం ఉంటుంది. మ్యూచువల్ ఫండ్స్‌లో డివిడెండ్‌లు అన్నవి తప్పుడు పదంతో ఇంత కాలం కొనసాగాయి. అందుకే ఇటీవలే డివిడెండ్ పేరును ఐడీసీడబ్ల్యూగా మార్చారు. డివిడెండ్‌లు చెల్లించిన వెంటనే ఫండ్ ఎన్ఏవీ అంతే మేర తగ్గుతుంది. ఐడీసీడబ్ల్యూ ప్లాన్‌లో డివిడెండ్‌లు మీ పన్ను ఆదాయానికి తోడవుతాయి. మీ శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాలి. ఒక ఏడాదిలో డివిడెండ్ ద్వారా రూ.5,000కు మించి ఆదాయం లభిస్తే టీడీఎస్ కింద 10 శాతాన్ని మినహాయిస్తారు. డివిడెండ్‌ను ఇన్వెస్టర్‌కు చెల్లించినా, లేక దాన్ని తిరిగి ఇన్వెస్ట్ చేసినా కానీ ఈ 10 శాతం టీడీఎస్ అమలవుతుంది. సాంకేతికంగా చూస్తే ఐడీసీడబ్ల్యూ ప్లాన్‌లో మీ పెట్టుబడి ఫండ్ సంస్థతోనే ఉంటుంది. కానీ, వాస్తవంగా చూస్తే చెల్లించే డివిడెండ్‌పై పన్ను పడుతుంది. కనుక పన్ను పరంగా అంత సమర్థమైనది కాదు. ఐడీసీడబ్ల్యూ ప్లాన్‌లో డివిడెండ్ ఎంత చెల్లించాలన్నది ఫండ్ సంస్థలు నిర్ణయిస్తాయి. ఇందులో ఇన్వెస్టర్లకు పాత్రకు ఉండదు. మీకు క్రమం తప్పకుండా ఫండ్స్ పెట్టుబడుల నుంచి ఆదాయం రావాలని కోరుకుంటే, అందుకు గ్రోత్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేసి, సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ఎంపిక చేసుకోవడం మెరుగైనది. దీనివల్ల ఎంత కాలానికి ఎంత చొప్పున కావాలన్నది మీరే నిర్ణయించుకోవచ్చు. కనుక ఐడీసీడబ్ల్యూ ప్లాన్‌తో పోలిస్తే గ్రోత్ ప్లాన్ చాలా మెరుగైనది. మీ పెట్టుబడులపై మీరు నియంత్రణ కలిగి ఉంటారు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా కుమారుడు మరణించాడు. జాయింట్ హోల్డర్‌గా ఉండడంతో ఫండ్స్ యూనిట్లు నాకు సంక్రమించాయి. వీటిని నా కుమారుడి పిల్లలకు బదిలీ చేయాలని అనుకుంటున్నాను. సాధ్యపడుతుందా? – విష్ణు కుమార్

మీ పేరుతో ఉన్న ఫండ్ యూనిట్లను మీ మనవళ్లు, మనవరాళ్లకు ఇవ్వడానికి లేదు. ఎందుకంటే ఫండ్స్ యూనిట్లు అనేవి గిఫ్ట్‌గా ఇవ్వడానికి, మరొకరికి బదిలీ చేయడానికి అవకాశం లేదు. అయితే మీ మనవళ్ల పేరిట ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి అవకాశం ఉంది. ఇందుకు మీరు ముందుగా మీ పేరుతో ఉన్న ఫండ్స్ పెట్టుబడులు మొత్తాన్ని వెనక్కి తీసుకోండి. మీ మనవళ్ల వయసు 18 ఏళ్లు నిండి ఉంటే ప్రస్తుత పెట్టుబడులను వెనక్కి తీసుకుని, వచ్చిన మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయండి. అప్పుడు మీ మనవళ్లు, మనవరాళ్లే స్వయంగా వారి బ్యాంకు ఖాతా నుంచి ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ విషయంలో మీరు వారికి సాయం అందించొచ్చు. ఒకవేళ మీ మనవళ్ల వయసు 18 ఏళ్లలోపు ఉంటే వారి తల్లి లేదంటే కోర్టు నియమించిన గార్డియన్‌కు పెట్టుబడులు బదలాయించొచ్చు. ఆ పని వారే చేస్తారు. మరో మార్గంలో ప్రస్తుతం మీ పేరుతో ఉన్న పెట్టుబడులను కొనసాగిస్తూ, నామినీగా మీ మనవళ్లు, మనవరాళ్లను పేర్కొనాలి. ఎవరికి ఎంత శాతం అనేది నిర్ణయించొచ్చు. అప్పుడు యూనిట్ హోల్డర్‌కు ఏదైనా జరిగితే అవి వారి పేరిట బదిలీ అవుతాయి.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ4లో రూ. 9,853 కోట్లు

ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 27 శాతం ఎగసి రూ. 9,853 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 30 శాతం జంప్‌చేసి రూ. 9,122 కోట్లకు చేరింది. ఇందుకు రుణాలపై పెరిగిన వడ్డీ రేట్లు సహకరించాయి. సమీక్షా కాలంలో నికర వడ్డీ ఆదాయం 40 శాతం దూసుకెళ్లి రూ. 17,667 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4 శాతం నుంచి 4.9 శాతానికి బలపడ్డాయి. రుణాల్లో 19 శాతం వృద్ధి ఇందుకు దోహదపడింది.

ఆదాయం సైతం అప్

గతేడాది క్యూ4లో ఐసీఐసీఐ బ్యాంక్ మొత్తం ఆదాయం రూ. 27,412 కోట్ల నుంచి రూ. 36,109 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 17,119 కోట్ల నుంచి రూ. 22,283 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు 3.6 శాతం నుంచి 2.81 శాతానికి దిగివచ్చాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 1,068 కోట్ల నుంచి రూ. 1,619 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.34 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థలలో లైఫ్ ఇన్సూరెన్స్ నికర లాభం రూ. 185 కోట్ల నుంచి రూ. 235 కోట్లకు, సాధారణ బీమా లాభం రూ. 313 కోట్ల నుంచి రూ. 437 కోట్లకు జంప్‌చేశాయి.



యస్ బ్యాంక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 202 కోట్లకు పరిమితం

ముంబై: యస్ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర లాభం 45 శాతం క్షీణించి రూ. 202 కోట్లకు పరిమితమైంది. ప్రొవిజన్లు రెట్టింపుకావడం లాభాలను దెబ్బతీసింది. అయితే నికర వడ్డీ ఆదాయం 15 శాతం పుంజుకుని రూ. 2,105 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 23 శాతం ఎగసి రూ. 1,082 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.3 శాతం బలపడి 2.8 శాతానికి చేరాయి. రుణాల్లో 12 శాతం వృద్ధి ఇందుకు దోహదపడింది. మొత్తం ప్రొవిజన్లు 127 శాతం పెరిగి రూ. 618 కోట్లను తాకాయి. మార్చితో ముగిసిన పూర్తిఏడాదికి నికర లాభం 33 శాతం నీరసించి రూ. 717 కోట్లకు పరిమితమైంది. గతేడాది 3,000 మందికి ఉపాధి కల్పించింది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 27,517కు చేరింది.




క్లుప్తంగా...

మే 4 నుంచి ఢిల్లీలో వెంకన్న బ్రహ్మోత్సవాలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మే 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. మే 3న సాయంత్రం అంకురార్పణం జరగనుంది. బ్రహ్మోత్సవాలకు ముందు ఏప్రిల్ 25వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహిస్తారు. మే 4వ తేదీ ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు, రాత్రి 7.30 గంటల నుండి 8.30 గంటల వరకు వాహన సేవలు జరగనున్నాయి. మే 13వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు.

మే రెండో వారంలో వీటీజీసెట్-23 ఫలితాలు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి ప్రవేశాలకు సంబంధించి వీటీజీసెట్-2023 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 638 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు.గురుకులాల్లో మొత్తం 51,524 సీట్లు ఖాళీగా ఉండగా, 12,1826 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా..11,3211 మంది పరీక్షకు హాజరయ్యారు. మే రెండో వారంలో పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

విషమంగానే శరత్‌బాబు ఆరోగ్యం



సాక్షి, హైదరాబాద్: సీనియర్ నటుడు శరత్‌బాబు ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న శరత్‌బాబు ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యులు కృషి చేస్తున్నప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి వెంటిలేటర్‌పైనే ఉన్న శరత్‌బాబు అంతర్గత అవయవాలు పూర్తిగా పనిచేయడం లేదని సమాచారం.

కమెడియన్ చలాకీ చంటికి గుండెపోటు



గచ్చిబౌలి: బుల్లితెరలో ప్రసారమయ్యే జబర్దస్త్ కమెడియన్ చలాకీ చంటి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈనెల 21వ తేదీన ఆయనకు తీవ్రమైన ఛాతీనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతన్ని గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని పరిశీలించిన వైద్యులు గుండెపోటుగా గుర్తించారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నాళాల్లో పూడికలను గుర్తించి, స్టంట్ వేసినట్టు తెలిసింది. ప్రస్తుతం అతని ఆరోగ్యం కొంత నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి




సాక్షి, హైదరాబాద్: భవన నిర్మాణ కార్మికుల్లాగే.. మోటారు కార్మికులకు కూడా సమగ్ర సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు ఆయన సీఎంకు రాసిన లేఖను ఆదివారం విడుదల చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఏపీ నుంచి రౌండ్ ట్రిప్‌ల పేరుతో హైదరాబాద్‌కు వస్తున్న టాక్సీ వాహనాలను నియంత్రించి, తెలంగాణలోని ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 55 ఏళ్లు నిండాక పెన్షన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుమలలో పీఏసీ-1 వద్ద ఫుడ్ కౌంటర్ ప్రారంభం



తిరుమల: తిరుమలలో పీఏసీ-1 వద్ద ఆదివారం ఫుడ్ కౌంటర్‌ను టీటీడీ ప్రారంభించింది. ఇక్కడ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తుంది. పీఏసీ-1లో బసచేసే భక్తులకు ఈ కౌంటర్ సౌకర్యవంతంగా ఉంటుంది. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు పాత అన్నదానం కాంప్లెక్స్, పీఏసీ-2లో అన్నప్రసాద వితరణ జరుగుతోంది. వీటితోపాటు రాంభగీచా బస్టాండ్, కేంద్రీయ విచారణ కార్యాలయం వద్ద ఫుడ్ కౌంటర్లున్నాయి.

చేతిలో ఫోన్.. వెన్నెముక డౌన్!



ఒకప్పుడు రైల్లోనో, బస్సులోనో కూర్చునే చోటు దొరక్క నిలబడాల్సి వచ్చిందని మాత్రమే చింతించేవారు.. మరి ఇప్పుడు మనం మొబైల్‌ను మిస్ అవుతున్నామని అంతకు మించి చింతిస్తున్న పరిస్థితి. (నిలబడి మొబైల్ వాడేవాళ్లు ఎక్కువే ఉన్నారనుకోండి). కూర్చునేందుకు కాస్త చోటు దొరికితే చాలు.. టక్కున ఫోన్‌లో తలదూర్చేస్తున్నారు. ఇదొక్కటే కాదు.. కూర్చున్నా, బెడ్‌పై ఉన్నా, బయట ఎక్కడైనా తిరుగుతున్నా, నడుస్తూ వెళుతున్నా మొబైల్ ఫోన్ చేతిలోనే ఉంటోంది. కానీ ఇదే అతిపెద్ద సమస్యను తెచ్చిపెడుతోంది. ఫోన్ చూడటం కోసం మెడ వంచడం, చేతులను ఎక్కువ సేపు పైకెత్తి ఉంచడం, కూర్చున్నా, పడుకున్నా ఫోన్ చూడటం కోసం ఏదో ఓవైపు వంగిపోతుండటం, స్క్రోలింగ్, టైపింగ్ కోసం వేళ్లను విపరీతంగా వినియోగిస్తుండటం వంటి వాటితో ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

– సాక్షి, హైదరాబాద్

ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయాలి



ఇటీవల భుజాల నొప్పులు, మణికట్టు బాధలు చాలా మందిలో గమనిస్తున్నాం. మొబైల్స్‌ని ప్రొఫెషనల్‌గా వాడేవారిలో బొటనవేలు మొద్దు బారడం సహా మరిన్ని సమస్యలు కనపడుతున్నాయి. పడుకునే భంగిమలో పుస్తకం చదివినట్టు ఫోన్ చూడడం సరికాదు. అలాగే వాష్‌రూమ్స్, టాయిలెట్స్‌లో కూడా వాడొద్దు. ఎలాపడితే అలా వాడటం వల్ల భుజాల కండరాలు, చేతులు, మణికట్టు ఒత్తిడికి గురవుతాయి. అయితే ఏది సరైన భంగిమ అనేది ఇప్పటివరకు స్పష్టత లేదు. కాబట్టి వీలైనంత వరకూ ఫోన్ వాడేటప్పుడు మధ్యలో విరామాలు తీసుకోవడం, ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయడం తప్పనిసరి.

– డాక్టర్ శివరాజు, జనరల్ ఫిజీషియన్, కిమ్స్ ఆస్పత్రి

అతిగా మొబైల్ వాడకం.. నిలబడే, కూర్చునే తీరులో లోపాలు


శారీరక భంగిమ సరిగా లేక మెడ, వెన్నెముక, కీళ్ల సమస్యలు	• మెడపై భారం పెరిగి లిగమెంట్లు, కండరాలపై ప్రభావం • కోలుకోలేని స్థాయిలో దెబ్బతింటున్న 'జాయింట్లు' • ఫోన్ చూసేటప్పుడు.. వెన్ను, మెడ నిటారుగా ఉంచడం మంచిదని నిపుణుల సూచనలు • వీలైనంత వరకు మొబైల్ వినియోగాన్ని తగ్గించుకోవడమే మేలని స్పష్టీకరణ
'టెక్ నెక్'సమస్య బారిన పడుతున్న టీనేజర్లు	

టెక్ నెక్.. సమస్యతో..

స్మార్ట్‌ఫోన్‌తో గంటల కొద్దీ గడిపేవారు, ఇందులో ముఖ్యంగా టీనేజర్లు 'టెక్ నెక్', లేదా 'న్యూ కార్పల్ టన్నెల్ సిండ్రోమ్'తో బాధపడుతున్నారని తాజా పరిశోధనలు గుర్తించాయి. దీని ద్వారా మెడ, వెన్నునొప్పితోపాటు తలనొప్పి, భుజాల నొప్పులు, చేతుల్లో జలదరింపు, కండరాలు పటుత్వం కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. చాలాసేపు మెడ వంచి చూడటం వల్ల.. మెడలోని స్నాయువులు, కండరాలు, కీళ్లపై ఒత్తిడి పడుతోందని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్ (ఐఎస్ఐఈ) మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ ఎస్ ఛబ్రా హెచ్చరించారు. దీర్ఘకాలికంగా, మెడ కండరాలు అపసవ్యంగా సంకోచించడం వల్ల పుర్రెతో అనుసంధానమైన ఉన్నచోట మంట, నొప్పిని కలిగిస్తుందని.. ఈ నొప్పి ఫాసియా ద్వారా మెడ నుంచి తలకు వ్యాపిస్తుందని వివరించారు.

భంగిమ సరిగా లేక.. భారంగా..

మొబైల్‌ను చేతిలో పట్టుకున్నప్పుడు కేవలం వేళ్లు మాత్రమే ఉపయోగిస్తున్నామని అనుకుంటాం. కానీ మన చేతులు, మోచేయి, కండరం, మెడ ఇవన్నీ వినియోగిస్తాం. మొబైల్‌ను చూస్తున్నప్పుడు మెడను కిందకు వంచుతాం. దీని వల్ల మెడ, వెన్నెముకపై ఒత్తిడి పడుతుంది. 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ అండ్ పబ్లిక్ హెల్త్'కథనం ప్రకారం.. ఇలా మెడ వంచి చూసే భంగిమ వల్ల వెన్నెముకపై తల బరువు పెరుగుతుంది. ''వాస్తవానికి తల నిటారుగా ఉన్న స్థితిలో దాదాపు 5–8 కిలోల బరువుపడుతుంది. తల వంగుతున్నప్పుడు 15 డిగ్రీల దగ్గర.. మెడపై భారం సుమారు 12 కిలోలు, 30 డిగ్రీల దగ్గర 18.14 కిలోలకు 45 డిగ్రీల దగ్గర 22.23 కిలోలకు 60డిగ్రీల దగ్గర 27.22 కిలోలకు పెరుగుతుంది. ఇలా మెడ అతిగా వంగడంతో వెన్నెముక, సపోర్టింగ్ లిగమెంట్లు, కండరాలపై ప్రభావం పడుతుంది..''అని ఆ కథనం స్పష్టం చేసింది.



నిపుణులు ఏమంటున్నారంటే?



హైదరాబాద్ మెట్రోలో సెల్ ఫోన్ చూస్తూ ఇలా..

- మెడ భుజం ముందుకు సాగినప్పుడు.. ముందువైపు కండరాలు బిగుతుగా మారుతూ, వెనుక వైపు బలహీనపడతాయి. కండరాల అసమతుల్యత ఏర్పడుతుంది. కాబట్టి మొబైల్ ఉపయోగిస్తున్నప్పుడు భంగిమపై శ్రద్ధ చూపడం తప్పనిసరి.
- శరీర భంగిమ అనేది ఫిట్‌నెస్‌కు కీలకం. ట్రెడ్‌మిల్, క్రాస్ ట్రైనర్ వంటివాటి మీద ఉండగా.. మొబైల్ ఫోన్ వినియోగించడం వంటివి చేయవద్దు.
- నిలబడి ఉన్నప్పుడు, ఎవరికైనా మెసేజీలు పంపుతున్నప్పుడు తల పైకి, భుజాలు కిందకు ఉంచాలి. వీలైనంత వరకు మొబైల్‌ను కళ్లకు సమాంతరంగా ఉంచడం సరైన భంగిమ.
- కుర్చీలో లేదా సోఫాలో కూర్చున్నప్పుడు ఫోన్ చూస్తూ వంగిపోవడం ఏ విధంగానూ ఆరోగ్యకరం కాదు. వెన్ను నిటారుగా ఉంచి కూర్చోవాలి. ఫోన్ చూడటానికి లేదా టెక్స్ట్ చేయడానికిగానీ మెడ ఎక్కువగా వంచకూడదు.
- పడుకున్నప్పుడు ఫోన్ పట్టుకోవడానికి.. మోచేతికి దిండు లేదా మరేదైనా మెత్తని దాన్ని ఆసరాగా తీసుకోవాలి.
- భోజనం చేసేటప్పుడు, టీవీ చూస్తున్నప్పుడు, కంప్యూటర్ వినియోగిస్తూ, డ్రైవ్ చేస్తూ.. ఇలా పలు సందర్భాల్లో ఫోన్‌ను కూడా ఉపయోగించడమనే మల్టీ టాస్కింగ్ అటు శారీరకంగా, ఇటు మానసికంగా కూడా ఆరోగ్యానికి చేటు తెస్తుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

కీళ్లు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం

ఫోన్ మాట్లాడే సమయంలో నిలబడే, కూర్చునే భంగిమలో లోపాలు మస్క్యులోస్కెలెటల్ సమస్యలకు కారణం అవుతున్నాయని.. గర్భాశయ, థొరాసిక్, నడుము ప్రాంతాలలో వెన్నెముక దెబ్బతినడంతో అనేక మంది ఇబ్బందిపడుతున్నారని వైద్యులు చెప్తున్నారు. సాధారణంగా కీళ్ల పనితీరు బాగున్నప్పుడు ఒత్తిడికి గురైనా, విశ్రాంతి సమయంలో మరమ్మతు అవుతాయని వివరిస్తున్నారు. కానీ కీళ్లను అసాధారణ భంగిమలో ఎక్కువసేపు ఉంచడం, ఒకే భంగిమలో ఎక్కువసేపు ఉంచడం వల్ల తీవ్రమైన ఒత్తిడి పడి.. అరిగిపోయి, తిరిగి బాగయ్యేందుకు అవకాశం లేనంతగా దెబ్బతింటున్నాయని స్పష్టం చేస్తున్నారు.

బఫెలో హంప్ కనిపిస్తోంది



టెక్స్ట్ నెక్ సిండ్రోమ్, స్పైన్ పెయిన్ వంటివన్నీ మనం నిలబడే, కూర్చునే, శరీరాన్ని ఉంచే తీరులో సమస్య వల్లే తలెత్తుతున్నాయి. దీర్ఘకాలంపాటు తప్పుడు భంగిమ వల్ల మెడ అలైన్‌మెంట్ సాగిపోతుంది. దాదాపు 60, 70ఏళ్ల వయసులో సంభవించే మెడలు సాగిపోవడం, ఫ్రోజెన్ షోల్డర్, రౌండెడ్ షోల్డర్ వంటివి 40 ఏళ్ల వయసులోనే వచ్చేస్తున్నాయి. మొత్తంగా సహజమైన శరీర నిర్మాణాన్ని ఈ భంగిమ లోపాలు దెబ్బతీస్తున్నాయి. ఒకప్పుడు బాగా తలవంచుకుని పనిచేసే కొందరు బ్యాంకు ఉద్యోగులు వంటివారిలో ఎక్కువగా కనిపించే మెడ వెనకాల సెమీ సర్కిల్ ఇప్పుడు చాలామందిలో కనిపిస్తోంది. బఫెలో హంప్‌గా పేర్కొనే దీన్ని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర సమస్యలు తప్పవు. ఏదేమైనా భంగిమ లోపాలు సరిచేసుకుంటూనే ఫోన్ వాడకాన్ని వీలైనంత తగ్గించుకోవడమే ఉత్తమం.

– డాక్టర్ విజయ్ బత్తిన, ఉథ్వాస్ ట్రాన్సిషనల్ కేర్

నిర్ణయాత్మక శక్తి ఏపీ మహిళ

ఆ రాష్ట్రంలో 43.4 శాతం వారిదే నాయకత్వం ● దేశం మొత్తంలో అది 22.2 శాతమే


- సీనియర్ అధికారులు, మేనేజర్లు, ఎమ్మెల్యేలు వంటి నిర్ణయాత్మక పదవుల్లో ఏపీలో మహిళలదే హవా
- దేశ సగటుతో పాటు పెద్ద రాష్ట్రాల్లో కన్నా ఏపీలో వారిదే పైచేయి
- సీనియర్, మిడిల్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో దేశ సగటు 18.1 శాతమే
- అదే ఆంధ్రప్రదేశ్‌లో అది 30.3%..
- దేశంలో పురుషులు, మహిళలు–2022 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తిరుగులేని శక్తిగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతానికి పైగా వారికే పదవులు ఇస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. నిర్ణయాత్మక స్థానాలు, కీలకమైన పదవుల్లో ఏపీ మహిళలది దేశంలోనే అగ్రస్థానం. కేంద్ర కార్యక్రమాల అమలు,గణాంకాల మంత్రిత్వశాఖ 'భారతదేశంలో వివిధ రంగాల్లో మహిళలు, పురుషులు–2022'అనే నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది.నివేదిక ముఖ్యాంశాలు ఇవే..

నివేదిక ముఖ్యాంశాలు



- సాధారణ హోదా, సీనియర్ అధికారులు, మేనేజర్లు, శాసనసభ్యుల హోదాల్లో నిర్ణయాలు తీసుకోవడంతో దేశ సగటుతో పాటు దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు.
- సీనియర్ అధికారులు, మేనేజర్లు, ఎమ్మెల్యేల వంటి నిర్ణయాత్మక పదవుల్లో ఆ రాష్ట్ర మహిళల హవా కొనసాగుతోంది.
- శాసనసభ్యులు, సీనియర్ అధికారులు, మేనేజర్ల హోదాల్లో మహిళల భాగస్వామ్యం దేశ సగటు 22.2 శాతం ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో అది అత్యధికంగా 43.4 శాతం ఉంది.
- సీనియర్, మిడిల్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో మహిళల భాగస్వామ్యం దేశ సగటు 18.1% ఉండగా ఏపీలో 30.3 శాతం ఉంది. మరే ఇతర పెద్ద రాష్ట్రాల్లో కూడా మహిళల భాగస్వామ్యం ఏపీలో ఉన్నంత స్థాయిలో లేదు.
- మొత్తం కార్మికుల్లో మేనేజర్ హోదాలో ఏపీలో 30.4 శాతం మహిళలే ఉండగా ఇదే దేశం మొత్తం చూస్తే 18.0 శాతమే.
- అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని పంచాయతీరాజ్ సంస్థల్లో 50 శాతం మంది మహిళలు (78,025 మంది) ప్రజాప్రతినిధులుగా ఉన్నారు.
- అదే సాధారణ కార్మికులు, నిర్ణయాత్మక హోదాల్లోనూ, శాసనసభ్యులు, సీనియర్ అధికారులు, మేనేజర్ల స్థాయిలో మహిళల భాగస్వామ్యం బీహార్, ఉత్తరాఖండ్, పంజాబ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల్లో అత్యల్పంగా ఉంది.
- కానీ, సమాజంలో సగభాగమైన మహిళలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యమిస్తోంది.



- మంత్రిమండలితో పాటు స్థానిక సంస్థల్లోనూ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా చట్టాలు చేసింది.
- అంతేకాక.. ఏపీలో 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలిస్తే వాటిని మహిళల పేరు మీదే పంపిణీ చేశారు. సాధారణ హోదాలోనూ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఎక్కువమంది మహిళలున్నారని.. వీరంతా నిర్ణయాలు తీసుకోవడంలో ముందున్నట్లు నివేదిక వెల్లడించింది.

మే 15 కల్లా ఇంటర్, టెన్త్ ఫలితాలు

పూర్తయిన మూల్యాంకనం

- ఇంటర్ మార్కుల క్రోడీకరణ వేగవంతం
- సాంకేతిక అంశాలపై కొనసాగుతున్న పరిశీలన
- టెన్త్ మార్కులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు..



సాక్షి, హైదరాబాద్: లక్షలాది మంది విద్యార్థులు ఎదురు చూస్తున్న టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు మే 15 కల్లా విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందుకు సంబంధించి విద్యా శాఖ ఉన్నతాధికారుల కసరత్తు తుది దశకు చేరుకుంటోంది. ఇంటర్మీడియట్ మొదటి, రెండో ఏడాది పరీక్షలకు దాదాపు 9 లక్షల మంది, టెన్త్ పరీక్షలకు 4.90 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ మూల్యాంకన ఇప్పటికే ముగిసింది. మార్కులను మరోసారి పరిశీలించి, కంప్యూటర్ ద్వారా ఇంటర్ బోర్డుకు పంపారు. డీకోడింగ్ ప్రక్రియ కూడా ముగిసినట్టు అధికారులు తెలిపారు. ట్రయల్ రన్ జరుగుతోందని, సాంకేతిక పరమైన లోపాలు పరిశీలించిన తర్వాత ఫలితాల విడుదల తేదీ ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు. మే రెండోవారం అంటే.. 15వ తేదీలోగా ఫలితాలు వెల్లడించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇక పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం దాదాపు ముగిసింది. కొన్ని పెద్ద కేంద్రాల్లో అక్కడక్కడా కొనసాగుతోంది. మూల్యాంకనం పూర్తికాగానే డీ కోడింగ్ చేసి, మార్కులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా బోర్డుకు పంపుతున్నారు. కాగా, టెన్త్ ఫలితాలను వచ్చే నెల 10లోగా ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు చెపుతున్నారు.

ఒక పోస్టు.. 174 మంది పోటీ

ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులు 614 | పోటీలో 1,06,272 మంది అభ్యర్థులు

- సివిల్, ఇతర విభాగాల్లోని ఒక్కో కానిస్టేబుల్ పోస్టుకు సగటున 12 మంది పోటీ
- నేటి నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ఖాకీ కొలువులకు యువతలో ఎంతో క్రేజ్ ఉంటుంది. అవకాశం, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పోలీస్ ఉద్యోగానికి పోటీ పడుతుంటారు. ఈసారి కూడా కానిస్టేబుల్ పోస్టులకు విపరీతమైన పోటీ ఉంది. ఈ నెల నిర్వహించనున్న కానిస్టేబుల్ పోస్టుల తుది రాత పరీక్షకు పార్ట్–2 దరఖాస్తు పూర్తి చేసిన అభ్యర్థుల సంఖ్య చూస్తే కానిస్టేబుల్ పోస్టులకు కాంపిటీషన్ ఫుల్ అన్న విషయం స్పష్టం అవుతోంది. సివిల్ పోలీస్, టీఎస్ఎస్పీ, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్లశాఖ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ శాఖల్లో కానిస్టేబుల్ పోస్టులకు ఈనెల తుది రాత పరీక్ష నిర్వహించబోతున్నారు. ఉమ్మడి పది జిల్లా కేంద్రాలతోపాటు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో పోలీస్ నియామక మండలి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి అభ్యర్థులకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు సమయం ఇచ్చింది. ప్రతి అభ్యర్థి www.tslprb.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ లాగిన్ ఐడీ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్స్‌కు పోటీ తీవ్రం..

ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు పోటీ తీవ్రంగా ఉంది. మొత్తం 614 పోస్టులకుగాను 1,06,272 మంది తుది రాతపరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 174 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అదేవిధంగా పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో సివిల్ కానిస్టేబుల్, ఇతర పోస్టులకు కలిపి మొత్తం 3,40,639 మంది తుది రాత పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్టు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు తెలిపారు.




వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ పోస్టులు.. తుది రాత పరీక్ష కోసం పార్ట్–2 నింపిన అభ్యర్థుల సంఖ్య..

పోస్ట్	ఖాళీల సంఖ్య	అభ్యర్థుల సంఖ్య
సివిల్ కానిస్టేబుల్, తత్సమాన పోస్టులు	15,644	1,76,370
ఎక్సైజ్ కానిస్టేబుల్	614	1,06,272
ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్	63	17,172
కమ్యూనికేషన్ కానిస్టేబుల్	262	16,816
పీటీఓ డ్రైవర్	100	16,891
ఫైర్ సర్వీసెస్ డ్రైవర్	225	7,118

కొత్తగా 472 పోస్టులు మంజూరు

- రోడ్లు, భవనాల శాఖలో వివిధ విభాగాల పునర్విభజన
- కొత్తగా సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: రోడ్లు, భవనాల శాఖలో ఏళ్లుగా కొనసాగుతున్న అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది వ్యవస్థను సమూలంగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పోస్టులసంఖ్య పెంచటం, ఉన్న అధికారులు, సిబ్బందిని జిల్లాలవారీగా పంచటం, వారికి ఉన్న ఆర్థికపరమైన కేటాయింపు బాధ్యతల పంపిణీ తదితరాలకు సంబంధించి తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. దీని ప్రకారం కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖలోని వివిధ విభాగాల్లో 472 పోస్టులను మంజూరు చేసింది. గత నవంబర్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయిలో సమీక్షించి దీనిపై ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను మరింత మెరుగ్గా నిర్వహించటంతోపాటు వర్షాల వల్ల దెబ్బతిన్న వాటిని వీలైనంత తొందరగా మరమ్మతు చేసి పునరుద్ధరించాలంటే అధికారులు, సిబ్బంది వ్యవస్థను సమూలంగా మార్చాల్సి ఉందని అప్పట్లో అభిప్రాయపడ్డారు. ఈ మేరకు కొత్తగా సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల ఏర్పాటుతోపాటు వాటికి కొత్తగా అధికారుల వ్యవస్థను రూపొందించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కసరత్తు చేసి నివేదికలు పంపాలని ఆదేశించడంతో అధికారులు కసరత్తు చేసి కొన్ని కొత్త పోస్టులతోపాటు సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల సంఖ్యను ఖరారు చేశారు. దానిని ఆర్థిక శాఖ ఆమోదించటంతో రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు తాజాగా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా అందులో ఆదేశించారు.

సర్కిళ్ల సంఖ్య 25కు పెంపు: రోడ్లు, భవనాల శాఖలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 సర్కిళ్ల సంఖ్యను 25కు పెంచారు. డివిజన్ల సంఖ్యను 49 నుంచి 62కు, సబ్ డివిజన్లను 135 నుంచి 214కు పెంచారు. సెక్షన్ల సంఖ్యను 432 నుంచి 556కు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మొత్తం విభాగాలను ప్రక్షాళన చేసి కొత్తగా రీఆర్గనైజ్ చేశారు. ఆ మేరకు పోస్టులను ఆయా విభాగాలు, జిల్లాలవారీగా కేటాయిస్తూ వివరాలను ఉత్తర్వుల్లో పొందుపరిచారు. చీఫ్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, చీఫ్ ఇంజనీర్ టెరిటోరియల్ 1, 2 లాంటి కొత్త అధికారుల అంచెను ఏర్పాటుచేసి వాటి కింద అధికారులు, సిబ్బంది వ్యవస్థను సిద్ధం చేసి పోస్టులు కేటాయించారు.

చంపేశారా? చనిపోయాడా?

ఫిలిప్పీన్స్‌లో రాష్ట్ర విద్యార్థి అనుమానాస్పద మృతి

- హత్య చేసి డ్రెయినేజీలో పడేశారని కుటుంబసభ్యుల ఆరోపణ
- మృతదేహాన్ని స్వస్థలం రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు



తండ్రి రాంరెడ్డితో మణికాంత్‌రెడ్డి (ఫైల్)



డ్రెయినేజీలో పడి ఉన్న మృతదేహం

భూదాన్‌పోచంపల్లి: వైద్య విద్య కోసం ఫిలిప్పీన్స్‌కు వెళ్లిన ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం రాంలింగంపల్లికి చెందిన గూడూరు రాంరెడ్డి, రాధ దంపతుల కుమారుడు మణికాంత్‌రెడ్డి(21) ఫిలిప్పీన్స్‌లోని దావో మెడికల్ కాలేజీలో 2020లో ఎంబీబీఎస్‌లో చేరాడు. కరోనా కారణంగా కొద్దిరోజులు ఆన్‌లైన్‌లో క్లాసులు విన్నాడు. గత ఏడాది ఆగస్టులో ఫిలిప్పీన్స్ వెళ్లాడు. ప్రస్తుతం థర్డ్ ఇయర్ పరీక్షలు రాస్తున్నాడు. అయితే.. ఆదివారం తెల్లవారుజామున మణికాంత్‌రెడ్డి ఉంటున్న హాస్టల్ మేనేజర్ రాంరెడ్డికి ఫోన్‌చేసి మీ కుమారుడు బైక్ యాక్సిడెంట్‌లో చనిపోయాడని, కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఫోన్‌చేసి మెట్లపై నుంచి జారి పడి మృతిచెందాడని చెప్పారు. మణికాంత్ రెడ్డి మృతదేహం ఫొటో, వీడియో పంపించారు. కాగా.. హాస్టల్ వెనుక డ్రెయినేజీలో మణికాంత్‌రెడ్డి మృతదేహం కనిపించిందని పోలీసులు తెలిపారు. హాస్టల్ యాజమాన్యం, పోలీసులు చెప్పిన తీరు వేర్వేరుగా ఉండటంతో కుమారుడి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మణికాంత్‌రెడ్డి డ్రెయినేజీలో పడి ఉండటం,తలకు గాయం ఉండటంతో హత్యేనని ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఎవరో హత్య చేసి డ్రెయినేజీలో పడేసి ఉంటారని అంటున్నారు. 15 రోజుల క్రితం హాస్టల్‌లో మనదేశానికే చెందిన విద్యార్థులకు, మణికాంత్‌రెడ్డికి మధ్య గొడవ జరిగిందని, వారిలో ఎవరైనా ఘాతుకానికి పాల్పడ్డారా అనిఅనుమానిస్తున్నారు. మణికాంత్‌రెడ్డి మృతదేహాన్ని వెంటనే ఇండియాకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మంత్రి కేటీఆర్‌ను కోరారు. వెంటనే స్పందించిన మంత్రి, ఫిలిప్పీన్స్‌లోని ఎంబసీతో పాటు, అక్కడి ఎన్ఆర్ఐలతోనూ మాట్లాడి.. మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

మేమెట్లా బతికేది

నాలుగురోజుల కిందట మాట్లాడినం. హాస్టల్ ఫీజు కావాలంటే పంపించిన. 'పరీక్షలు నడుస్తున్నయి, నేనే ఫోన్ చేసి మాట్లాడుతా'అన్నడు. శనివారం ఫోన్ చేస్తే కలువలేదు. ఆదివారం చేద్దామనుకొన్నం. ఈ లోపు ఘోరం జరిగిపోయింది. నా కొడుకు లేకుండా మేమెట్లా బతికేది.

– గూడూరు రాంరెడ్డి, మృతుడి తండ్రి

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.